www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 224 శనివారం, మే 09, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా
# మారుస్తా...

● దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి ● 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన ● మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం ● కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపనలు




**కొడంగల్,మే 08 :** దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని మిగతా2లో...

## బెంగాల్ రాజకీయాల్లో
# బిజెపి శకం



● రాష్ట్ర సిఎంగా సువేందు అధికారి
● శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
● అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ
● నేడు సిఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం
● ప్రధాని మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాల హాజరు

**కోల్‌కతా,మే 08 :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, మిగతా2లో...




## తమిళనాడు ఉత్కంఠకు తెర

- నేడు సిఎంగా విజయ్ ప్రమాణం
- మద్దతుల లేఖలతో గవర్నర్తో మరోమారు భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు గవర్నర్ అనుమతి
- 11 గంటలకు నెహ్రూ స్టేడియంలో ప్రమాణ కార్యక్రమం
- కాంగ్రెస్, లెఫ్ట్ తదితర పార్టీల మద్దతు లేఖలు సమర్పణ
- టివికె కూటమి బలం 120కి చేరిక..మద్దతుపై అనేక మెలికలు

## సోనార్ బంగ్లా కోసం కృషి

- మహనీయుల కలలు సాకారం చేస్తాం
- దశాబ్దాలుగా భయం గుప్పిట్లో బెంగాల్
- గో అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం
- చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం
- సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి దేశాన్ని రక్షిస్తాం
- కక్షసాధింపు రాజకీయాలకు బిజెపి దూరం
- బిజెపి లెజిస్లేచర్ పార్టీ భేటీలో అమిత్ షా స్పష్టీకరణ




## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో కలిసి పర్యటన
ముంపు ప్రాంతాలను గుర్తించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్,మే 08(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజధానిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలే ట్రాఫిక్, ఉప్పొంగే డ్రైనేజీలు.. తెరుచుకుని ఉండే మ్యాన్ హోల్స్ మిగతా2లో...

## తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం

● కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు విమర్శలు మానితే మంచిది
● కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి







## కొడంగల్‌పైనే కాదు.. రాష్ట్రంపై శ్రద్ధ పెట్టాలి

- బిఆర్ఎస్ ప్రాజెక్టులతో డబ్బులు వృధా చేసింది
- ఎక్కడా కాల్వలు నిర్మించి నీళ్లు పారించలేదు
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన
# శాంతిభద్రతలు



- నరగంలో వరుస హత్యలు ఆందోళనకరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్,మే 08 :** రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, మిగతా2లో...

# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

● మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి ● స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది ● అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం ● ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయండి ● జనంలో విశ్వసనీయత కల్పించేలా కార్యాచరణ ● ఉన్న నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ ● కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్,మే 08 :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను మిగతా2లో...

## ప్రధాని పర్యటన తరవాత
# రాజకీయ మార్పులు

- బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు



**హైదరాబాద్,మే 08 :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తు న్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు మిగతా2లో...




## సచివాలయంపై డ్రోన్ కలకలం

సోషల్ మీడియా ప్రచారంపై సర్కార్ సీరియస్

**అమరావతి,మే 08 :** రాజధాని అమరా వతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కలెక్టర్ల సదస్సు జరుగుతున్న సమయంలో.. సచివాలయంపై డ్రోన్ కలకలం అంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం మిగతా2లో...

# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి – ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశర చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈస్ట్–టు–వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి –గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు.

# కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

(మొదటి పేజీ తరువాయి)

వెరసి వాహనదారులకు నరకప్రాయంగా ఉంటుంది. ఇక కృష్ణానగర్ నగర్ గురించి ఎంత చెప్పినా తక్కువే... చిన్నపాటి వర్షానికే రోడ్ల మీద డ్రైనేజీ ఉప్పొంగి ప్రవహిస్తూ వరదను తలపిస్తుంటుంది. ఈ క్రమంలో కృష్ణానగర్ వరద సమస్యపై హైడ్రా ఫోకస్ పెట్టింది. కృష్ణానగర్ వరద సమస్యను నెల రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. కృష్ణానగర్‌లో కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం చేసింది హైడ్రా. స్థానిక ఎమ్మెల్యే నవీన్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి పనులను పరిశీలించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల వరద కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు అధికారులు. నాలాల్లో డీసిల్టింగ్ పనుల్లో జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా భాగస్వామ్యం వహిస్తోంది. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్, వెంకటగిరి నుంచి వచ్చే మట్టి కారణంగా సమస్య తీవ్రత పెరుగుతోందని అంటున్నారు అధికారులు. వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు చర్యలు చేపట్టామని అన్నారు. కృష్ణానగర్ వరద ముప్పు కు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రత్యామ్నాయ వరద కాలువ నిర్మాణంపై ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటున్నారని..8 నుంచి 9 అడుగుల లోతున్న కాలువల్లో 6 నుంచి 7 అడుగుల మేర పూడిక పేరుకుపోయిందని తెలిపారు అధికారులు. అవసరమైతే స్లాబులు తొలగించి పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తామని స్పష్టం చేశారు కమిషనర్ రంగనాథ్. నాలాపై నిర్మించిన ఒకటి రెండు ఇళ్లను గుర్తించామని... తప్పనిసరి పరిస్థితి వస్తేనే తొలగింపు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇళ్ల ఖాళీ చేయించటానికి ముందు నోటీసులు, తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు కమిషనర్ రంగనాథ్.

# బెంగాల్ రాజకీయాల్లో బిజెపి శకం

(మొదటి పేజీ తరువాయి)

పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమాచారం. తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపూర్‌లోని కర్కులీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు 2006–09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయీ (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయీ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపూర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్–2 ఈయనేనని అంతా అనుకున్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

# తమిళనాడు ఉత్కంఠకు తెర

**చెన్నై,మే 08 :**తమిళనాట ఉత్కంఠకు తెరపడింది. టివికె అధినేత విజయ్ నేడు సిఎంగా ప్రమాణం చేయబోతున్నారు. వివిధ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు సమర్పించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరు గుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నై లోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మే 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది. ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరుతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరడానికి అడుగులు పడు తున్నా.. మిత్రపక్షాల షరతులు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు వీసీకే తమ మద్దతుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశాయి. విజయ్ ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వామపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. టీవీకే ప్రభుత్వానికి తాము కేవలం బయటి నుంచే మద్దతు ఇస్తామని.. కేబినెట్‌లో చేరే ఉద్దేశం లేదని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. ప్రస్తుత రాజకీయ అనిశ్చితిని తొలగించి, ఒక సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న ఉద్దేశంతోనే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఇక, టీవీకేకు ముందుగానే మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్‌కు ఒక కీలకమైన షరతు విధించింది. భవిష్యత్తులో టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ మతతత్వ పార్టీలతో చేతులు కలపకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ షరతుకు లోబడి ఉంటేనే.. తమ 5 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటుందని హైకమాండ్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకమైన 2 స్థానాలు కలిగిన విదుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ తనదైన వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. వచ్చే ఉపఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని ఆయన షరతు పెట్టారు. తిరుమావళవన్ స్వయంగా తిరుచ్చి ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ స్థానం ఇస్తేనే టీవీకేకు మద్దతుపై తుది సంతకం చేసే అవకాశం ఉంది.వామపక్షాలు కేబినెట్‌లో చేరక పోవడం వల్ల విజయ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలకే ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, తిరుమావళవన్ కోరుతున్న 'తిరుచ్చి ఈస్ట్' స్థానం విషయంలో విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సోనార్ బంగ్లా కోసం కృషి

**కోల్‌కతా,మే 08:** సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా క్లళెం వేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బీజేపీ కార్యకర్తలందరి బాధ్యత అన్నారు. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు. బెంగాల్ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్‌షా శుక్రవారంనాడు హాజరయ్యారు. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సువేందు అధికారిని బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. ఈనెల 9వ తేదీన కోల్‌కతాలోని బ్రిగేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... కమ్యూనిస్ట్ పాలన నుంచి బెంగాల్‌లో భయం, హింసాత్మక వాతావరణం ఉందని, ఇది ఆ తర్వాత తీవ్రంగా మారిందని అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో బెంగాల్ ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని అన్నారు. ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా 'సోనార్ బంగ్లా' లక్ష్యంతో ముందుకు సాగుతామని చెప్పారు.

బెంగాల్ భయం రహిత సమాజం దిశగా వెళ్తుందని అన్నారు. గత 5 దశాబ్దాలుగా బెంగాల్ శాంతిభద్రతలు, ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ పరంగా తీవ్రమైన ప్రతికూల రాజకీయాలను చూసిందని.. బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఇప్పుడు బీజేపీ బాధ్యత అని అన్నారు. బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేస్తూ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శ్రీ అరబిందో, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కోరుకున్న బెంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని అన్నారు.

# తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం

**హైదరాబాద్,మే 08:**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు. గవర్నర్ చర్యలను బిజెపికి అంటగట్టి విమర్శించడం మానుకోవాలన్నారు.

# కొడంగల్‌పైనే కాదు..రాష్ట్రంపై శ్రద్ధ పెట్టాలి

**హైదరాబాద్,మే 08:**రిజర్వాయర్ల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేసినా రైతులకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వలేకపోయారని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రిజర్వాయర్లు నిర్మించడం మాత్రమే సరిపోదని, నీళ్లు పొలాల వరకు చేరాలంటే కాలువలు కూడా నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన ప్రయోజనం కలగలేదని విమర్శించారు. టీఆర్ఎస్ నిర్వహించిన సభలో ఎమ్మెల్సీ కవిత పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతానికి తగిన న్యాయం జరగలేదని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు 12 సీట్లు ఇచ్చినా అభివృద్ధి పనులు కనిపించలేదని అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ప్రకటించాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకే తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని పేర్కొన్న కవిత.. త్వరలో మరో నీటి ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆ ఉద్యమానికి లక్ష్మీదేవిపల్లి వేదిక కావడం గర్వంగా ఉందని చెప్పారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ– వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.


# సచివాలయంపై డ్రోన్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత సీరియస్‌గా తీసుకుంది. శాంతిభద్రతల దృష్ట్యా కీలకమైన సమయంలో ఇలాంటి పుకార్లు పుట్టించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. విజయవాడలోని సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆకాశంలో కనిపించిన ఓ విమానాన్ని.. డ్రోన్‌గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు కలకలం రేపాయి. కలెక్టర్ల సదస్సు జరుగుతున్న వేళ భద్రతా వైఫల్యం జరిగిందంటూ విమర్శలు చేసే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసుల విచారణలో అసలు నిజం బయటపడింది. ఢిల్లీ నుంచి విజయవాడ వస్తున్న ఎం2903 విమానాన్ని చూపించి.. అది డ్రోన్ అంటూ తప్పుడు ప్రచారం చేశారని పోలీసులు నిర్ధారించారు. సదరు విమానం నిర్ణీత షెడ్యూల్ ప్రకారమే ల్యాండింగ్ కోసం ఆ మార్గంలో ప్రయాణించిందని అధికారులు స్పష్టం చేశారు.

# కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేష్ నియామకం

**శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ నాయకులు జి. కృష్ణ.....**




**బాలానగర్ మే 09 ( పీపుల్స్ న్యూస్):**తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ను వివిధ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ సందర్భంగా కూకట్ పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ, నాయకులు కే. మనోచారి, గంగన్న, రాములు తదితరులు బండి రమేష్ ను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవాదృక్పథంతో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే బండి రమేష్ కు ఈ పదవి రావడాన్ని అభినందించారు. రాష్ట్రంలోని కమ్మ సామాజిక వర్గ అభ్యున్నతికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఆయన కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కూకట్ పల్లి ప్రాంత అభివృద్ధికి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలు అందిస్తున్న బండి రమేష్, ఇప్పుడు రాష్ట్ర స్థాయి బాధ్యతలు చేపట్టడం ద్వారా మరింత సమర్థవంతంగా సేవలందించే అవకాశం లభించింద న్నారు. ఆయన నాయకత్వంలో కమ్మ కార్పొరేషన్ మరింత బలోపేతం అవుతుందని సీపీఐ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని బండి రమేష్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ధూమపానం చేసే కేసులు నమోదు.







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 8(పీపుల్స్ న్యూస్) :** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం , ధూమపానం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షితా కృష్ణమూర్తి అన్నారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ జోన్ పరిధిలో శుక్రవారం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 38 పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు జోన్ పరిధిలోని పార్కులు, స్మశాన వాటికలు, వైన్ షాపులు , జనావాసాలు లేని ప్రాంతాలతో పాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి సేవించినందుకు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న 28 మందిని గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 81 మందిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారందరిపై కేసులు నమోదు చేశారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రజలకు అసౌకర్యం, ఇబ్బంది కలిగించే ఇటువంటి పనులను పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ మద్యపానం, ధూమపానం , గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయి.హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రక్షితా కృష్ణమూర్తి, పర్యవేక్షణలో జరిగిన ఈ డ్రైవ్‌లో జోన్ పరిధిలోని ఏసీపీలు, ఎస్హెచ్ఓలు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ బహిరంగ సభను జయప్రదం చేయండి: అత్తికారి మల్లేష్

**బాలానగర్ మే 09 ( పీపుల్స్ న్యూస్):**ఈ నెల 10 వ తేదీన సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్లో ప్రధాని మోది బహిరంగ సభను జయప్రదం చేయాలని బిజెపి కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకుడు అత్తికారి మల్లేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బాలానగర్ డివిజన్ పరధిలోని ఇందిరానగర్ లో బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు సూచనలమేరకు ఈ నెల 10వ తేదీన నిర్వహించబడనున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభ విజయవంతం కోసం స్థానిక నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ బాలానగర్ డివిజన్ అధ్యక్షులు డా. కిరణ్ హాజరై మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవంగా చూడటానికి కారణం నరేంద్ర మోదీ తీసుకున్న ధైర్యమైన నిర్ణయాలు, పారదర్శక పాలన,



దేశభక్తి"అని పేర్కొన్నారు."ప్రతి పేద కుటుంబానికి ఇల్లు, ప్రతి ఇంటికి గ్యాస్, ప్రతి రైతుకు గౌరవం, ప్రతి యువకుడికి అవకాశాలు, ప్రతి మహిళా భద్రత – ఇవన్నీ మోదీ ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనం అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే నిజాయితీ గల నాయకత్వం అవసరమని పేర్కొన్నారు.

అనంతరం అత్తికారి మల్లేష్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు కుటుంబ పాలనను, అవినీతి రాజకీయాలను తిరస్కరించి అభివృద్ధి రాజకీయాలకు మద్దతు ఇచ్చారని తెలిపారు. దేశం బలంగా ఉండాలంటే బీజేపీ మరింత బలపడాలని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే మోదీ బహిరంగ సభ దేశ భవిష్యత్తుకు మార్గదర్శక సభ అవుతుందని, బాలానగర్ మండలం నుండి భారీ ఎత్తున ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని మల్లేష్ కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అనిల్, సీనియర్ నాయకులు అర్జున్, సురేందర్, రాజు, విజయ్, బాలస్వామి, నాగరాజు సురేష్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత భవితకు పోలీసు 'రక్ష'.. మత్తు నెట్వర్క్‌పై ఉక్కుపాదం!

### డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం: మల్కాజిగిరి సీపీ సుమతి

**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో,మే 8 (పీపుల్స్ న్యూస్) :** భావి భారత పౌరులైన యువతను మత్తు రక్కసి కోరల నుంచి కాపాడేందుకు పోలీస్ యంత్రాంగం సరికొత్త వ్యూహాలకు పదును పెట్టింది. నగర ప్రొడక్టివిటీకి చిరునామాగా, వేలాది మంది విద్యార్థుల విద్యా కేంద్రంగా ఉన్న దిల్సుక్ నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి వెల్లడించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

డ్రోన్ పోలీసింగ్.. టెక్నాలజీతో చెక్!

నేరగాళ్ల కంటే ఒక అడుగు ముందే ఉండాలన్న సంకల్పంతో అత్యాధునిక సాంకేతికతను పోలీసులు రంగంలోకి దించారు.

డ్రోన్" ఆకాశం నుంచి నిఘా:

అర్ధరాత్రి వేళల్లో విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిశితంగా పర్యవేక్షించనున్నారు.

స్పాట్ టెస్టులు:

రాత్రిపూట పెట్రోలింగ్ చేసే పోలీసులకు ప్రత్యేక 'డ్రగ్ డిటెక్షన్ కిట్లు' అందజేశారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులకు తక్షణమే పరీక్షలు నిర్వహించి చర్యలు తీసుకుంటారు.

సిసి కెమెరాల కవచం:

ఈ ప్రాంతంలోని 3,200 కెమెరాలలో 70% పైగా క్రియాశీలంగా ఉన్నాయని, వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించినట్లు సీపీ తెలిపారు.



హాస్టళ్లపై ప్రత్యేక ఆడిట్.. నిర్వాహకులకు హెచ్చరిక

సరూర్ నగర్ పరిధిలోని హాస్టళ్లలో ఇప్పటికే ప్రత్యేక ఆడిట్ నిర్వహించినట్లు సీపీ సుమతి పేర్కొన్నారు. "హాస్టల్ నిర్వాహకులు తప్పనిసరిగా హై-రిజల్యూషన్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తే వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే హాస్టళ్లను సీజ్ చేయడానికి వెనుకాడం."

పాన్ డబ్బాలే టార్గెట్

మత్తు పదార్థాల విక్రయాలకు కేంద్రాలుగా మారుతున్న పాన్ డబ్బాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. నిషేధిత పదార్థాలు విక్రయిస్తే కఠినమైన పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నగర భద్రతలో సామాన్య పౌరులు, పెడెస్ట్రియన్లు సైతం భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

"ఒక్క కేసు.. జీవితాంతం చీకటి"

యువతకు హితబోధ చేస్తూ సీపీ సుమతి భావోద్వేగంగా




మాట్లాడారు."తెలంగాణ దేశంలోనే అత్యంత యువ రాష్ట్రం. 15 నుండి 30 ఏళ్ల వయసు అనేది దేశానికి పునాది వంటిది. ఈ సమయంలో కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలే తప్ప, క్షణికానందం కోసం మత్తుకు బానిస కావొద్దు. ఒక్కసారి ఎన్డిపిఎస్ (మత్తు పదార్థాల నిరోధక చట్టం) కేసులో చిక్కుకుంటే, మీ కెరీర్ అక్కడితో ముగిసిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగాలు, విదేశీ ప్రయాణాలకు శాశ్వతంగా దూరమవుతారు."

పాత అనుభవాల నేపథ్యంలో పక్కా ప్లాన్

గతంలో తాను సికింద్రాబాద్ డీసీపీగా ఉన్నప్పుడు ఎదురైన సవాళ్లను ఆమె గుర్తు చేసుకున్నారు. సికింద్రాబాద్‌లోని అక్రమ లాడ్జీలు డ్రగ్స్ విక్రయాలకు ఎలా అడ్డాగా మారాయో వివరించిన ఆమె, ప్రస్తుత బాధ్యతల్లో అటువంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన గ్రౌండ్ లెవల్ నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. బాధితులకు శిక్షలతో పాటు కౌన్సెలింగ్ ఇచ్చి వారిని జనజీవన స్రవంతిలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీపీ పేర్కొన్నారు.

# మ్యూల్ అకౌంట్లను నియంత్రించడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్.

**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 8 (పీపుల్స్ న్యూస్) :** మ్యూల్ అకౌంట్లను నియంత్రించడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని, ఒకసారి ఖాతాను ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా చూడాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ బ్యాంకర్లకు సూచించారు.సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో శుక్రవారం సైబరాబాద్ సీపీ కార్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో బ్యాంకులు , పోలీసుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం ద్వారా దర్యాప్తును వేగవంతం చేయడం, ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్ , డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు వాపసు ఇవ్వడం , డిజిటల్ మోసాల విచారణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అత్యంత ప్రమాదకరమైన ముప్పుగా మారాయని అన్నారు. ఆన్‌లైన్ స్కామ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఫ్రీ-లాంచ్ ఆఫర్లు, కాల్ సెంటర్ మోసాలు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు తదితరాల ద్వారా ప్రజలు భారీ మొత్తంలో డబ్బును కోల్పోతున్నారని అన్నారు. చాలామంది తమ జీవితకాల పొదుపులను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సైబరాబాద్ పరిధిలో 2025 సంవత్సరంలో సైబర్ మోసాల కారణంగా ప్రజలు రూ.438 కోట్లను కోల్పోగా, 2026 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.104 కోట్లను కోల్పోయినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా అవగాహన పెరుగుతున్నప్పటికీ, మరింత అప్రమత్తత , పటిష్టమైన నివారణ చర్యలు అవసరమని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకింగ్ డేటా భద్రత, మ్యూల్ అకౌంట్ల నియంత్రణ, దర్యాప్తులకు బ్యాంకుల నుంచి సకాలంలో సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించడానికి ప్రతి బ్యాంకులో ప్రత్యేకమైన మరియు కేంద్రీకృత 'సైబర్ సెల్స్' ఏర్పాటు చేయాలని సీపీ కోరారు. ప్రజలు కూడా పెట్టుబడులు పెట్టే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని , నేరగాళ్లకు సహకరించవద్దని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తులో ఎదురవుతున్న సవాళ్ల గురించి సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి





మనోహర్ మాట్లాడుతూ బ్యాంకుల నుండి ఖాతా వివరాలు, కేవైసీ పత్రాలు , ఫ్రీజ్ కన్ఫర్మేషన్లు అందడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల నిందితులను పట్టుకోవడం కష్టమవుతోందని తెలిపారు. ఖాతాల ఫ్రీజ్ , డిఫ్రీజ్ ప్రక్రియల్లో జరుగుతున్న ఆలస్యంపై కూడా చర్చించారు.సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ ఎన్‌సీఆర్‌బీ డాటాను విశ్లేషిస్తూ, ప్రతి బ్యాంకులో అప్‌డేట్ చేయబడిన నోడల్ ఆఫీసర్ వివరాలతో కూడిన 'సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్' ఏర్పాటు చేయాలని సూచించారు. దీనివల్ల కమ్యూనికేషన్ వేగవంతం కావడమే కాకుండా, కష్టమర్ల సొమ్మును కాపాడవచ్చునని తెలిపారు. బ్యాంక్ సిబ్బందికి సైబర్



నేరాల ప్రక్రియలపై శిక్షణ ఇవ్వాలన్నారు. కార్పొరేట్ ఖాతాలకు సంబంధించిన రిలేషన్ షిప్ మేనేజర్ల వివరాలను పంచుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి, క్రైమ్స్ డీసీపీ ఏ. ముత్యం రెడ్డి, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయి శ్రీ , హెచ్‌డీఎఫ్‌సీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు

# తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కొత్త రూల్.. విద్యార్థులు తెలుసుకోకపోతే ఇబ్బందే, డబ్బులు రావు

హైదరాబాద్:తెలంగాణ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియలో కీలక సంస్కరణను తీసుకొచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు ట్యూషన్ ఫీజ్, స్కాల రషిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే సమ యంలో.. పదోతరగతి మెమోలో ఉన్న పేరు.. ఆధార్‌లోని పేరు, ఇంటిపేరు ఒకేలా ఉండాలని ప్రభుత్వం తెలిపింది. ఒకవేళ ఈ రెండు సరిపోలకపోతే విద్యార్థి దరఖాస్తు ప్రాసెస్ చేయరు.. అక్కడే ఆగిపోతోంది. ఈ మేరకు విద్యా ర్థులు పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ (పుట్టినతేదీ), ఏ సంవత్సరంలో పదోతరగతి పూర్తయ్యింది వంటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు సంబంధించి ఈ వివరాలన్నీ సరిపోలితేనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వస్తుంది. విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో కులం, ఉపకులం, ఆధార్ నంబరు, విద్యార్థి మొబైల్ నంబరు, యూనివర్సిటీ, జిల్లా, మం డలం, కాలేజీ పేరు కూడా నమోదు చేయాల్సి



ఉంటుంది. ఈ వివరాల్లో పదోతరగతి మెమో లో, ఆధార్‌లో పేరు సరిపోలితేనే దరఖాస్తు ప్రాసెస్ ప్రారంభమవుతుంది. ఇలా విద్యార్థి దరఖాస్తు చేసుకున్న తర్వాత ఓ ఐడీ వస్తుంది.. అప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు తొలివిడత పూర్తవుతుంది. అలాగే రెన్యువల్ విద్యార్థుల ఆధార్, పదోతరగతి పేరు సరిపో లాల్సిందే అంటున్నారు అధికారులు. తొలివిడ తలో దరఖాస్తు పూర్తిచేసిన విద్యార్థులు మీసేవ కేంద్రాల్లో ఆధార్ ఆథెంటికేషన్ ప్రాసెస్ పూర్తిచేయాలి. అనంతరం విద్యార్థులు దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి, ఆన్‌లైన్లో సమర్పించాల్సి ఉంటుంది.ప్రతి ఏటా రాష్ట్రంలో ట్యూషన్ ఫీజుల కోసం ఏటా 12 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరందరికి ప్రభుత్వం రూ.2400 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు గతంలో ఆధార్ ధ్రువీకరణ చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేది. తెలంగాణలో జాతీయ ఉపకార వేతనాల విధానం ప్రకారం ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థులకు చెల్లిస్తున్నట్లుగా ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు వారి వ్యక్తిగత బ్యాంకు అకౌంట్‌లలో నేరుగా ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.కొత్త విధానం ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు 20 శాతం మంది ఆధార్‌లో పేరు సవరించుకో వాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ వేసవి సెలవులు ముగిసేలో గా.. ఆధార్‌లో పేర్కొన్న పేరు, ఇంటిపేరులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తు న్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యే నాటికి దరఖాస్తు చ సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాదు తప్పనిస రిగా ఆధార్ మొబైల్ అనుసంధానం చేసుకోవా లి. ఆధార్ లింక్ చేసి ఉన్న బ్యాంక్ అకౌంట్ కూడా ఉండాలి. విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌లో వివరాలు, ఆధార్ నంబర్ తనిఖీ తర్వాతే మంజూరు చేస్తారు.మంజూరవుతాయి.

# ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ అభివృద్ధి.. కేబినెట్ సబ్ కమిటీ

హైదరాబాద్, మే 8: ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ ఈరోజు(శుక్రవారం) సమావేశమైంది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (రుణది) నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి.హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు, ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను



తొలగించి, రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు.ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించను న్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు.

# మోదీ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి

హైదరాబాద్, మే 8 : ప్రధానమంత్రి నరేం ద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు () వ్యాఖ్యా నించారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీ యాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజర య్యే సభ ఏర్పాట్లను (శుక్రవారం) రామచం దర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏబీఎన్‌తో ఆయన మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం..ఈరోజు నుంచి రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి



కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# బీడీ కార్మికులకు తీపికబురు.. జీతాలు పెరిగాయి,

హైదరాబాద్:తెలంగాణలో బీడీ కార్మికులకు శుభవార్త.. రాష్ట్రవ్యాప్తంగా బీడీ పరిశ్రమలో పనిచే స్తున్న కార్మికులకు వేతనాలు పెంచారు. బీడీ పరిశ్ర మలకు చెందిన యాజమాన్యాలు, కార్మిక సంఘాలు వివిధ కేటగిరీలకు చెందిన కార్మికుల నూతన వేతనాలపై ఒప్పందం చేసుకున్నారు. హైదరాబాద్‌లో యాజమాన్యాలు, కార్మిక సంఘాల సమావేశమైన ఈ నిర్ణయం తీసుకు న్నాయి. తాజాగా చేసుకున్న ఒప్పందం ప్రకారం కొత్త జీతాలు 2028 ఏప్రిల్ 30 వరకు అమల్లో ఉంటుంది. ప్రతి వెయ్యి బీడీలకు రూ.6 చొప్పున కార్మికుకలు జీతాలు పెంచేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి.తాజాగా పెంచిన జీతాల విషయానికి వస్తే.. జాతీయ సెలవులు, బోనస్ అన్నీకలిపి బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.6.92 (15.33%) పెరగనుంది. అలాగే బీడీ కార్మికుల్లో 98శాతం మంది మహిళలు ఉన్నారు.. వీరంతా బీడీలు చుట్టి జీవనోపాధి పొందుతున్న సంగతి తెలిసిం దే. తెలంగాణలోని సిద్ధిపేట, మెదక్, జనగాం,



నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో బీడీ పరిశ్రమలు ఉన్న సంగతి తెలిసిందే. ప్రధానంగా ఈ బీడీ పరిశ్రమకు నిజామాబాద్ కేంద్రంగా ఉంది. కార్మిక సంఘంల్లు ప్రతి రెండేళ్లకోసారి బీడీ పరిశ్రమల యాజమాన్యాలతో చర్చలు జరుపుతారు. ఆ సమయంలో కార్మికులకు చెల్లించే వేతనాల విషయంలో ఒప్పందాలు చేసుకుంటారు. ప్రస్తుతం బీడీలు చుట్టే కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.268.31 చొప్పున చెల్లిస్తున్న సంగతి తెలిసిందే.. తాజాగా పెరిగిన జీతంతో కలిసి ఇకపై రూ.275.23 చొప్పున అందిస్తారు.బీడీ పరిశ్రమలో ప్యాకర్స్, బట్టీవాలా, మునిమ్‌లు, చాటన్, ఇతర క్లర్క్‌లు కూడా పనులు చేస్తుంటారు. వీరి సంఖ్య దాదాపు 12వేల నుంచి 14 వరకు ఉంది. వీరికి కూడా జీతాలు పెంచారు. వీరిలో బీడీ ప్యాకింగ్ కార్మికులకు నెలకు రూ.4,500.. మిగిలిన ఉద్యోగులకు రూ.2,200 చొప్పున జీతాలు పెంచారు. వాస్తవానికి బీడీ కార్మికులకు ప్రతి వెయ్యి బీడీలకు రూ.3 చొప్పున పెరుగుతాయన్నారు కార్మిక సంఘాల నేతలు. కానీ ఈసారి మాత్రం రూ.6 పెంచేలా యాజమాన్యాలను ఒప్పించామని.. మొత్తం 7 లక్షల మందికిపైగా బీడీ కార్మికులకు లబ్ధి చేకూరుతుందని చెబుతున్నారు.

# కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్, మే 8: రాష్ట్ర డీజీపీ సీవీ ఆనం ద్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశా రు. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్‌ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో (గురువారం) మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాల యంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహ నంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై డీజీపీకి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతి భద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నా రు.అలా ప్రశ్నించినందుకే దాడులు: దాసోజు శ్రవణ్‌కరీంనగర్‌లో కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్‌పై దాడిని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఖండించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులపై డీజీపీ సీవీ ఆనంద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసీఆర్ కొడుకువే నా అని కేటీఆర్‌ను ప్రశ్నించడం సరైందని కాదని కౌశిక్ రెడ్డి ప్రశ్నించినందుకే దాడులు చేశారని




ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తంబాకు తింటాడని అన్నందుకే దాడులు చేస్తారా అని నిలదీశారు. కేంద్ర హోం సహాయ మంత్రిగా ఉండి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా బండి సంజయ్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని భావిస్తున్నామని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు.తగిన గుణపాఠం చెబుతాం: వివేకానంద గౌడ్ బండి సంజయ్, ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు.. వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి. అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం' అని వివేకానంద గౌడ్ హెచ్చరిం చారు.శాంతిభద్రతలు దిగజారిపోయా యి: పల్లా రాజేశ్వర్ రెడ్డితెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో ఉందన్నారు. నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగ ర్‌లో పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరిం చినట్లు తెలిపారు. నిన్ను కౌశిక్ రెడ్డిని చంపాల ని వచ్చారన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే కార్యకర్తలు వచ్చారని.. ఆయనపై కేసు నమోదు చేయాలని రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# రెండున్నరేళ్ల తర్వాత.. బండి సంజయ్ గుజరాత్, యూపీ వెళ్లి బతకాల్సి వస్తుంది.

హైదరాబాద్: బండి సంజయ్, రేవంత్ రెడ్డి మధ్య చీకటి ఒప్పందం ఉందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆపద వచ్చినప్పుడల్లా బండి సంజయ్ కాపాడుతున్నాడని తెలిపారు. కరీంనగర్ దాడి వెనుక రేవంత్ రెడ్డి సహకారం ఉందని ఆరోపించారు.కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ నాయకులపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు బీఆర్‌ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. డీజీపీని కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, దేశపతి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం కేపీ వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. 2014కు ముందు బండి సంజయ్ చందాలతో బతికేవాడని అన్నారు. కానీ ఇప్పుడు అహంకారపూరితంగా



మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మీరు మాట్లాడిన భాషలోనే మీకు సమాధానమిచ్చామని తెలిపారు.పాడి కౌశిక్ రెడ్డిపై పథకం ప్రకారమే దాడి జరిగిందని కేపీ వివేకానంద తెలిపారు. కౌశిక్ రెడ్డిపై హత్యకు సామాగ్రితో వచ్చారని పేర్కొన్నారు. ఇలాంటి సంస్కృతిని కొనసాగిస్తే.. రెండున్నరేళ్ల తర్వాత బండి సంజయ్ గుజరాత్, యూపీకి వెళ్లి బతకాల్సి వస్తుందని హెచ్చరించారు. పదేళ్లలో తాము ఎంతో ఓపికగా ఉన్నామని తెలిపారు. అన్ని ఆధారాలతో డీసీపీకి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో రాక్షస రాజ్యం : బీఆర్‌ఎస్ నాయకుడు రాకేష్‌రెడ్డి




హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ రాక్షస రాజ్యం నడుపుతోందని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వరంగల్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిస్తే ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ అమలు చేయకపోతే రైతులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి చేతగాని దద్దమ్మళ్ల కేసులు పెడుతు భయాందోళనలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు,మంత్రులు ఐకేపీ సెంటర్ల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడితే సమస్య అర్థమవుతుందిన సూచించారు.రైతులను కాపాడుకోవడానికి ఎన్ని కేసులకైనా కేటీఆర్ సిద్ధమని తెలిపారు. తెలంగాణ ద్రోహులపై కేటీఆర్ దురందరుడిలాగా పోరాటం చేస్తున్నారని వివరించారు. బిచ్చగాళ్లకు వేసినట్లు రైతు బంధు వేస్తున్నారు. అన్ని పంటలకు బోనసని ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా దిగజారిందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అవినీతి అక్కడ ఉంటుందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపైనర్ కాదు. స్టార్ డిస్ట్రిబ్యూటరని అన్నారు.

# యువత నిబద్ధతతో పనిచేయాలి:

హనుమకొండ, మే 8 : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. (శుక్రవారం) ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.యువత ఒత్తిడికి లోనుకావొద్దు: ఎంపీ కడియం



కావ్యయువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానించారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు.ఏఐతో ఉద్యోగాలు పోతున్నాయి: నాగరాజుఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకుని నిలబడాలని అన్నారు. ఉద్యోగం ఎక్కడైనా చేసేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలని చెప్పుకొచ్చారు. ఆర్మీలో తెలంగాణ యువత ప్రాతినిధ్యం తక్కువ అని తెలిపారు. ఉద్యోగం రావాలంటే నైపుణ్యం కలిగి ఉండాలని అన్నారు. ప్రైవేటు ఉద్యోగంలో రాణించాలంటే స్కిల్స్ ముఖ్యమని చెప్పుకొచ్చారు. యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు.తల్లిదండ్రుల కళలు నెరవేరాలంటే కష్టపడాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు.

## పెన్షన్స్‌పై ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుంది



**విజయవాడ, మే 8 :** పెన్షన్స్‌పై తమ ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుందని తెలుగుదేశం పార్టీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ) వ్యాఖ్యానించారు. ఆయా సమస్యల పరిష్కరానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోం దని పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో తమ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని చెప్పుకొచ్చారు. తాము హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలు అన్ని ఒక్కొక్కటిగా అమలు చేశామని వెల్లడించారు. ప్రజలంతా ఇది మంచి ప్రభుత్వ మని అంటున్నారని తెలిపారు. (శుక్రవారం) విజయవాడలోని 45వ డివిజన్ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ శివనాథ్ పాల్గొని మాట్లా డారు. జగన్ హయాంలో నేతలు, అధికారులు ఎవరు ప్రజల దగ్గరకు వెళ్లింది లేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీ శివనాథ్ వివరించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. విజయవాడలోని అన్ని సమస్యలను జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులం కలిసి సీఎం దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఆయా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు. జీవో నంబర్ 30ను తీసుకువచ్చి ప్రతి ఒక్క లబ్దిదారుడుకి రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. విజయవాడలో డ్రైనేజీ, కొండ ప్రాంత ప్రజల సమస్యలు త్వరలో పరిష్కారం కాబోతున్నాయని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

# రూ.5 కోట్లతో అందుబాటులోకి ఏటీసీఎస్ - ప్రభుత్వానికి విజయవాడ సీపీ ప్రతిపాదనలు


**విజయవాడ :** గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను వినియోగించుకుంటూ, నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన ఏటీసీఎస్ (అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్) ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధుల కోసం సీపీ రాజశేఖరబాబు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇంకా సుమారు రూ. 5 కోట్లు అవసరమని, ఆ నిధులు ఇస్తే ఏటీసీఎస్ అందుబాటులోకి వస్తుందని సీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకురానున్నారు.కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం శాంతి, భద్రతలపై సమీక్ష జరగనుంది. ఈ ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు అందజేయనున్నారు. మూడున్నరేళ్ల క్రితం ప్రారంభమైన ఈ ప్రాజెక్టు నిధుల సమస్యతో పూర్తవ్వలేదు. విజయవాడ నగరంలో దాదాపు 54 కూడళ్లు ఉన్నాయి. వీటిలో ట్రాఫిక్ సిగ్నళ్లను ఏర్పాటు చేసే ప్రక్రియ అత్యంత చురుగ్గా సాగుతోంది.ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ : ఇది పూర్తైన తర్వాత కీలకమైన వాహనాల నెంబరు ప్లేట్లను గుర్తించే ఏఎన్‌పీఆర్ (ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్) కెమెరాలను నగరంలో బిగించాల్సి ఉంది. ఏఎన్‌పీఆర్ ప్రత్యేకత ఏంటంటే దీని వల్ల ట్రాఫిక్ ఉల్లంఘనలను వేగంగా గుర్తించవచ్చు.



చలాన్ల జారీ ప్రక్రియ పారదర్శకంగా ఉంటుంది. దొంగిలించిన వాహనాలను ట్రాక్ చేయడం కూడా సులభమవుతుంది. టోల్ ప్లాజాల్లో వేచిచూసే సమయం తగ్గుతుంది. భద్రతా పర్యవేక్షణ మరింత బలోపేతం అవుతుంది. అలా వీటి నుంచి వచ్చే ఇన్‌పుట్స్‌ను కమాండ్ కంట్రోల్ కేంద్రానికి పంపించే వ్యవస్థ ఏర్పాటుకు ఈ నిధులు వెచ్చించాల్సి ఉంది. ఇదివరకే పోలీసులు వీఎంసీ(విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్)ని సంప్రదించగా నగరపాలిక మాత్రం చేతులెత్తేసింది. ప్రతి కూడలికి 8 కెమెరాలు కచ్చితంగా అవసరం. ఈ విధంగా చూస్తే నగరం మొత్తం 432 ఏఎన్‌పీఆర్ కెమెరాలు అవసరమవుతాయని ప్రతిపాదించారు.అసలు ఏటీసీఎస్ అంటే ఏంటి? : ఇది ట్రాఫిక్ సిగ్నల్స్‌ను నిర్వహించే ఒక అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ. ఈ వ్యవస్థ రోడ్లపై ఉన్న వాహనాల రద్దీని బట్టి సిగ్నల్ సమయాన్ని (గ్రీన్ లైట్ ఎంత సేపు ఉండాలి అనేది) ఆటోమేటిక్‌గా మార్చుకుంటుంది. సిగ్నల్ జంక్షన్ల వద్ద అమర్చిన సెన్సార్లు లేదా కెమెరాల ద్వారా ఏ వైపు వాహనాలు ఎక్కువగా ఉన్నాయో గమనించి, ఆ దిశలో ఎక్కువ సమయం గ్రీన్ సిగ్నల్ వచ్చేలా చేస్తుంది. దీనివల్ల ట్రాఫిక్ జామ్ తగ్గి, వాహనదారులు సిగ్నల్స్ వద్ద ఎక్కువ సేపు ఆగాల్సిన అవసరం ఉండదు. ఉదాహరణకు మహాత్మా గాంధీ రోడ్డులోని ఒక మార్గంలో వాహనాల రద్దీ తీవ్రస్థాయికి చేరితే, కెమెరాలు ఆ రద్దీ ప్రదేశాన్ని గుర్తించి ట్రాఫిక్ సిగ్నళ్లను ఆకుపచ్చ రంగులోకి మారుస్తాయి. రద్దీ తొలగిపోయే వరకు ఆ రంగు మారకుండా చూసుకుంటాయి. ఈ సిస్టమ్ అమలుతో :ట్రాఫిక్ జామ్‌లు తగ్గుతాయిఇంధన వినియోగం తగ్గుతుందికాలుష్య నియంత్రణలో సహాయపడుతుందిఅత్యవసర వాహనాలకు వేగంగా మార్గం కల్పించవచ్చు అదనంగా ఈ వ్యవస్థలో సేకరించే డేటా ఆధారంగా భవిష్యత్తులో ట్రాఫిక్ ప్రణాళికలు రూపొందించవచ్చు. మార్పులు కూడా తీసుకొని రావచ్చు. రియల్ టైమ్ మానిటరింగ్ వల్ల ట్రాఫిక్ పోలీసులకు కూడా నిర్వహణ సులభమవుతోంది. అంతేకాకుండా ఈ అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ భవిష్యత్ నగర రవాణాకు కీలక పరిష్కారంగా మారనుంది.

# ఇకపై నియోజకవర్గాల్లోనూ 'గ్రీవెన్స్ డే' - ప్రతి శుక్రవారం ఫీల్డ్‌కు కలెక్టర్లు

**అమరావతి:** రాష్ట్రంలో ప్రజాదర్బార్ ద్వారా వేలాది సమస్య లకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్న సంగతి తెలిసిందే. భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, సాగునీటి ఇబ్బందులు ఇలా సామాన్యుల కష్టాలను విని వెంటనే పరిష్కరించే విధానంతో ప్రజాదర్బార్‌కు మంచి పేరు వచ్చింది. అదే స్ఫూర్తితో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ం మరో అడుగు ముందుకేసింది. ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని, సింగపూర్ తరహా లో 'ప్రజాదర్బార్' ఏర్పాటు చేసి ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.ఇకపై నియోజకవర్గాల్లోనూ ప్రతి శుక్రవారం 'ఫీల్డ్ గ్రీవెన్స్ డే' నిర్వహించాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం సమీక్ష చేపట్టి పలు కీలక సూచనలు చేశారు. 'కాగితాలు తీసుకుని కార్లో వదిలిపెట్టకుండా పిటిషన్లకు పరిష్కారం




చూపాలి' అని కలెక్టర్లకు సీఎం స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఫిర్యాదులు స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. సింగపూర్‌లో ఇదే తరహాలో ఫిర్యాదుల పరిష్కారం జరుగుతోందని తెలిపారు.'రాజకీయ నాయకులు, సహా కలెక్టర్లు కలిసి 'గ్రీవెన్స్ డే' లో పాల్గొనాలి. సమస్యల పరిష్కారం సహా అన్ని వివరాలు ఆటోమెటిక్?గా రికార్డు చేసే విధానాన్ని తీసుకొస్తున్నాం. ప్రాధాన్యతా పద్ధతుల్లో సమస్యల పరిష్కారం జరగాలి. సింగపూర్? తరహాలో అమలు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజా దర్బార్? మాదిరాగా దీన్ని విజయవంతం చెయ్యాలి.' - చంద్రబాబు'ప్రజాదర్బార్' ఏర్పాటు: పీజీఆర్ఎస్ కోసం 'ప్రజాదర్బార్' తరహాలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. మండల స్థాయిలోనూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు.నాలుగుసార్లు క్షేత్రస్థాయి పర్యటన: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ స్వీకరిస్తున్నట్లే, ఇకపై ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ స్వీకరించాలని సూచించారు. సమస్యలు పరిష్కారమైతే ప్రభుత్వానికి బ్రాండ్ రావడంతో పాటు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని నాలుగుసార్లు సందర్శించాలని, 'గుడ్ విల్ మిషన్'గా కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. అన్ని వీడియో కాన్ఫరెన్సులను ఒకరోజుకే పరిమితం చేద్దామని పేర్కొన్నారు.

## కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు: మంత్రి సత్యకుమార్




**అమరావతి, మే 08:** రాష్ట్రంలో కిడ్నీ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్ ద్వారా వీటి నిర్వహణ చేపడతాయని తెలిపారు. ఇప్పటికే కూటమి పాలనలో 12 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు.అదనపు డయాలసిస్ కేంద్రాలతో కలిపి మొత్తం 73 కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నవారికి అందుబాటులోకి వచ్చాయని మంత్రి సత్యకుమార్ వివరించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2,721పైగా డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 14 కొత్త డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేసింది.

## ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డ్



**అమరావతి, మే 8:** ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు సృష్టించారు. గంటల వ్యవధిలోనే భారీ సంఖ్యలో ఫైళ్లను పరిష్కరిం చడం ద్వారా పరిపాలనలో వేగం, పారదర్శకతకు కొత్త ప్రమాణాలు నిర్దేశించారు. కలెక్టర్ల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడి పనితీరు ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఈ-ఫైళ్ల క్లియరెన్స్ సమయాన్ని 5 గంటల నుంచి 2 గంటల 49 నిమిషాలకు తగ్గించడం ద్వారా అచ్చెన్నాయుడు రికార్డు సాధించారు. భారీగా ఫైళ్లు వచ్చినా వేగవంతంగా డిస్పోజ్ చేస్తున్నారు మంత్రి.ప్రజలకు త్వరితగతిన సేవలు అందించడమే తన లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ-గవర్నెన్సు అమలులో వ్యవసాయ శాఖ ముందంజలో ఉందని అధికారులు తెలిపారు. మంత్రి నాయకత్వంలో వ్యవసాయ శాఖ సాధిస్తున్న పనితీరుపై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌ను రోజుల నుంచి గంటల వ్యవధిలోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రభుత్వ యంత్రాంగంలో ఈ-ఫైళ్ల చురుకుదనాన్ని పెంచుతోంది. మంత్రి అచ్చెన్నాయుడు ఫైళ్ల క్లియరెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు.

# పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం.. జనసేనలో బాలినేనికి కీలక బాధ్యతలు

**అమరావతి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక బాధ్య తలు అప్పగించారు. డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటుగా ఏపీలో త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీ లను ఏర్పాటు చేసింది. మొత్తం 11 మంది సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సభ్యులకు తాజాగా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డికి రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి అనంతపు రం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలు అప్పగించింది.పవన్ కళ్యాణ్ ఆదేశాలత బాలినేని శ్రీనివాసరెడ్డి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై.. రాబోయే స్థానిక సంస్థల



ఎన్నికలు. డీలిమిటేషన్ అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ పర్యటన వివరాలతో సమగ్ర నివేదికను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సమర్పించనున్నారు.అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటుగా ఆరణి శ్రీనివాసులు, టీసీ వరుణ్‌కు స్థానం కల్పించారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కోసం కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సీహెచ్ వంశీకృష్ణలతో కమిటీ ఏర్పాటైంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కోసం పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, కొటికలపూడి గోవిందరావులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతలను నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభానులకు అప్పగించారు.వచ్చేవారం జనసేన కమిటీల ప్రకటనమరోవైపు జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు కమిటీల ను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే వారం కమిటీలను ప్రకటించనున్నట్లు జనసేన పార్టీ తెలిపింది. జనసేన పార్టీ సంస్థాగత విస్తృత నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన ప్రక్రియలో పవన కళ్యాణ్ నిమగ్నమై ఉన్నారన్న జనసేన.. పార్టీ నిర్మాణంలో భాగమైన కమిటీల ఏర్పాటు కోసం గత కొన్ని నెలలుగా పవన్ కళ్యాణ్ ముఖ్య నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. శస్త్రచికిత్స నుంచి పూర్తిస్థాయిలో ఆరోగ్యపరమైన ఇబ్బందులున్నా కూడా కమిటీల ప్రకటనపై దృష్టిపెట్టారని తెలిపింది.

# అమరావతిలో ఆ భవనాలు కూల్చేసే ప్రమాదం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై జనసేన పార్టీ పదవుల నుంచి తప్పుకున్న బొలిశెట్టి సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవినీతిపై, పర్యావరణంపై రాజీలేని పోరాటం చేస్తానని.. రాజకీయ పార్టీల నేతలపై నమ్మకం పోయిందని.. కూటమి నేతలను వదిలిపెట్టేది లేదన్నారు. అమరావతిలో పర్యావరణాన్ని విధ్వంసం చేశారని.. నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలను నిర్మించారు కాబట్టే గత ప్రభుత్వ హయాంలో ప్రజావేదికను కూల్చేశారన్నారు. రాజధాని అమరావతిలో నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేయాలని.. పర్యావరణ విరుద్ధంగా చేస్తే



ఊరుకునేది లేదన్నారు. తన పోరాటం కొనసాగిస్తానుని.. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా కడితే మళ్లీ కూల్చేసే ప్రమాదం ఉందని.. ఈ విషయాన్ని ప్రభుత్వం గమనిస్తే మంచిదన్నారు. రాజధాని నిర్మాణంలో 84 శాతం సాగు, పర్యావరణ భూములు ఉన్నాయని.. అమరావతి పరిధిలో నదులు కాలువలను రక్షించాలి పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు బొలిశెట్టి సత్యనారాయణ. అమరావతిలో నిర్మాణాలు నిబంధనలకు లోబడి చెయ్యాలన్నారు. అమరావతి పరిధిలో ఉన్న నదులు, కాలువలు, వాగులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమాజాన్ని మీడియా కాపాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. అందరి ప్రాథమిక కర్తవ్యం అన్నారు. పారిశ్రా మిక వృద్ధి, ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వాలు పర్యావరణ నియమాలను విస్మరించినప్పుడు.. యువత, పౌర సమాజం ఒక బలమైన వాచ్ డాగ్‌గా మారాల్సిన అవసరం చాలా ఉందన్నా రు. కేంద్ర సాధికార కమిటీ () వెల్లడించి న అంశాలు క్షేత్రస్థాయిలో ఉన్న భయంకరమైన వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయని బొలిశెట్టి సత్యానారయణ చెప్పుకొచ్చారు.

## తిరుమలలో జమ్మూ-కశ్మీర్ లెఫ్ట్‌నెంట్ గవర్నర్ ప్రత్యేక పూజలు



**తిరుమల :** జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(మనోజ్ సిన్హా (శుక్రవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శంచుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన మహా ద్వారం వద్ద టీటీడీ ఈవో రవిచంద్ర , ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారుఆలయంలోని ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం, ఉప గవర్నర్ స్వామివారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. ఈవో లెఫ్టినెంట్ గవర్నర్‌కు తీర్థ ప్రసాదాలను, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వహణాధికారులు లోకానందం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బంగాల్ సీఎంగా సువేందు అధికారి- కొలువుదీరనున్న బీజేపీ తొలి సర్కార్



**బెంగాల్:** తృణమూల్ కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బెంగాల్‌లో తొలి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. తన రాజకీయ గురువు మమతా బెనర్జీపైనే ఘనవిజయం సాధించిన సువేందు అధికారిని బీజేపీ అధిష్ఠానం ఖారారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు సువేందును శాసన సభాపక్షనేతగా ఎన్నుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలతో భేటీ అయి సువేందు అధికారిని పేరు ఫైనల్ చేశారు. బీజేపీ కొత్త ప్రభుత్వంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మహిళా నేత అగ్నిమిత్ర పాల్‌కు ఒక ఉప ముఖ్యమంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎంగా ఆమె ఎంపికైతే బంగాల్ తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టిస్తారు. రెండో ఉప ముఖ్యమంత్రి పదవిని ఉత్తర బంగాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అమిత్ షా ఇప్పటికే అగ్నిమిత్ర పాల్, శంకర్ ఘోష్‌లతో విడివిడిగా సమావేశమై చర్చలు జరిపారు. జ్యోతిబసు ప్రభుత్వంలో బుద్ధదేవ్ భట్టాచార్య తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు బెంగాల్‌లో ఉప ముఖ్యమంత్రుల వ్యవస్థ రాబోతోంది. బ్రిగేడ్ పరేడ్ మైదానంలో ప్రమాణ స్వీకారం శనివారం కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ మైదానంలో సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రమాణస్వీకారానికి యంత్రాంగం అంతా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అప్పుడు టీఎంసీ వీడి- ఇప్పుడు అదే పార్టీని ఓడించిపశ్చిమ బంగాల్‌లో 15 ఏళ్ల మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని కూల్చడంలో సువేందు అధికారి కీలక పాత్ర పోషించారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా ఎదిగిన సువేందు ఆరేళ్ల కిందట అనూహ్యంగా తృణమూల్‌ను వీడారు. ఇప్పుడు తన మాజీ గురువు మమతా బెనర్జీ స్థానంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్నారు. బెంగాల్‌లో గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీని ఓడించిన సువేందు అధికారి ఈ సారి అంతకంటే ఎక్కువ మెజార్టీతో భవానీపూర్ లోనూ ఓడించారు. బెంగాల్‌లో బీజేపీకి 207 సీట్లు రావడంలోకీలక పాత్ర పోషించారు. రాజకీయం వెన్నెతో పెట్టిన విద్య సువేందు అధికారి 1970 డిసెంబర్ 15న బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్ జిల్లా కాంతిలో జన్మించారు. రాజకీయాలు సువేందుకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండడంతో చిన్నప్పటి నుంచీ వాటిని బాగా వంటబట్టించుకున్నారు. సువేందు అధికారి తండ్రి శిశిర్ అధికారి మన్మోహన్‌సింగ్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. సువేందు సోదరులు కూడా రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ప్రస్థానంసువేందు అధికారి తన రాజకీయ ప్రస్థానాన్ని కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ద్వారా ప్రారంబికలిసి పోరాడారు. దీదీ నేతృత్వంలోబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో సఫలీకృతమయ్యారు. నందిగ్రామ్‌తోపాటు సింగూర్ ఉద్యమాలు వామపక్ష ప్రభుత్వాన్ని బలహీనపరిచి 2011లో టీఎంసీ అధికారంలోకి రావడానికి సహకరించాయి. మమతా బెనర్జీ ప్రభుత్వంలో రవాణా, నీటిపారుదల, పర్యావరణ శాఖల మంత్రిగా సువేందు బాధ్యతలు నిర్వర్తించారు. మమతా బెనర్జీ ప్రధాన అనుచరుడిగా పార్టీలో రెండో శక్తిమంతమైన నేతగా ఎదిగారు.

# కేరళం సీఎం రేసులో కేసీ వేణుగోపాల్.. 11న ప్రమాణస్వీకారం



**న్యూఢిల్లీ:** కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఈ రేసులో లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ ముందున్నారని తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్ని క్‌లు తమ నివేదికను పార్టీ అధ్యక్షుడు మల్లికా ర్జున్ ఖర్గేకు సమర్పించినట్లు పార్టీ వర్గాలు శుక్రవారంనాడు తెలిపాయి. పార్టీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమి భాగస్వాములు, ప్రజాభి ప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సీఎం అభ్యర్థుల రేసులో కేసీ వేణుగోపాల్‌తో పాటు గత అసెంబ్లీలో విపక్ష నేత వీడి సతీశన్, వెటన్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల పోటీ పడ్డారు. అయితే పార్టీ అధిష్టానానికి అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న 63 ఏళ్ల కేసీ వేణుగోపాల్ ముందు వరుసలో ఉన్నట్టు చెబుతున్నారు. ఆయనను తదుపరి సీఎంగా అధిష్టానం ప్రకటిస్తే ఎంపీ స్థానానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగానే వేణుగోపాల్ అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. యూడీఎఫ్ విజయానికి నిజమైన వ్యూహకర్త ఆయనేనని, ఆయనను నాయకన్, హీరో అని చిత్రీకరిస్తూ పార్టీ కార్యాలయం ల పోస్టర్లు కూడా వెలిసాయి.

# పశ్చిమ బెంగాల్ సీఎంగా సువేందుకు ఛాన్స్



**బెంగాల్ :** ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ.. ప్రభుత్వ ఏర్పాటు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ ఎన్నికల్లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీని ఓడించిన బీజేపీ కీలక నేత సువేందు అధికారి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, సువేందుకు సహాయంగా మంత్రివర్గంలో ఇద్దరు ఉపముఖ్య మంత్రులు కూడా ఉంటారని సమాచారం. మీడియా కథనాల ప్రకారం, ఈసారి ఒక మహిళా నేత డిప్యూటీ సీఎంగా ఉండే అవకాశం ఉంది. ఆసంసోల్ దక్షిణ్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన బీజేపీ నేత అగ్నిమిత్రా పాల్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపడతారని సమాచారం. ఇదే నిజమైతే ఆమె రాష్ట్రంలోని తొలి మహిళా డిప్యూటీ సీఎంగా చరిత్ర సృష్టిస్తారు. ఇక రెండో ఉపముఖ్యమంత్రిగా ఉత్తర బెంగాల్ నుంచి ఒక నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. సిలిగురి నుంచి గెలిచిన శంకర్ ఘోష్‌ను డిప్యూటీ సీఎం పదవి వరించవచ్చని సమాచారం. ఇప్పటికే హోం మంత్రి అమిత్ షా కోల్‌కతాలో ఘోష్, పాల్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. పశ్చిమబెంగాల్‌లో గత రెండు దశాబ్దాలుగా ఉపముఖ్యమంత్రులు లేరు. అంతకుముందు జ్యోతి బసు ప్రభుత్వంలో సీపీఎం నేత బుద్ధదేబ్ భట్టాచార్జ డిప్యూటీ సీఎంగా సేవలందించారు. ఇక ముఖ్యమంత్రిని ఎన్నుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు త్వరలో సమావేశం కానున్నారు. ఇతర కేబినెట్ మంత్రుల విషయంలో కూడా త్వరలో స్పష్టత రానుంది. ఆ తరువాత కోల్‌కతాలోని చారిత్రక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో మంత్రులు ప్రమాణస్వీకారం చేస్తారు.

# శిథిలావస్థ నుంచి పునరుద్ధరణ దాకా సోమనాథ్ ప్రస్థానం- 1000రోజుల ప్రత్యేక పూజలు- ప్రధాని మోదీ సంపాదకీయం



**గుజరాత్:** గుజరాత్‌లోని ప్రసిద్ధ సోమనాథ్ ఆలయ ప్రస్థానం శిథిలావస్థ నుంచి పునరుద్ధరణ దాకా, విధ్వంసం నుంచి సృజన దాకా సాగిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. పదేపదే దాడులు, విధ్వంసాలు ఎదురైనా సోమనాథ్ ఆలయం పునరుద్ధరణకు, కొనసాగింపునకు ప్రతీకగా నిలుస్తూ భారతీయులకు నాగరికతాపరమైన సందేశాన్ని ఇస్తోందన్నారు. ఈ ఆలయ పరిరక్షణ, పునరుద్ధరణతో సంబంధమున్న సర్దార్ వల్లభాయ్ పటేల్, కేఎం మున్షీ, అహల్యాబాయి హోల్కర్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ వంటి చారిత్రక ప్రముఖులను ప్రధాని స్మరించుకున్నారు. శతాబ్దాలుగా ఆలయం కోసం త్యాగాలు చేసిన వారికి నివాళిగా, రాబోయే 1000 రోజుల పాటు సోమనాథ్‌లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తామని ఆయన ప్రకటించారుసోమనాథ్ ఆలయాన్ని మే 11న సందర్శించనున్న సందర్భంగా ఆ ఆలయం ప్రాముఖ్యతపై ప్రధాని మోదీ శుక్రవారం ఓ సంపాదకీయాన్ని రాశారు. ఈవిషయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన వెల్లడించారు. అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొని సోమనాథ్‌ను ఎల్లప్పుడూ పరిరక్షించి, దాని పూర్వ వైభవాన్ని పునరుద్ధరించిన ప్రతి ఒక్కరికీ తన సంపాదకీయంలో నివాళులు అర్పించానని ప్రధాని తెలిపారు. భారతీయ నాగరికత గొప్పతనం విషయంలో సోమనాథ్ ఎల్లప్పుడూ ఎందుకు ముఖ్యమైందో అందులో వివరించినట్లు చెప్పారు. తన సోమనాథ్ పర్యటన వివరాలనూ సంపాదకీయంలో ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయాన్ని 1951 మే 11న భారతదేశపు మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తాను సోమనాథ్ సందర్శనకు వెళ్తున్నట్లు మోదీ వెల్లడించారు. మహనీయులను స్మరించుకోవాల్సిన సమయమిది“సోమనాథ్ ఆలయంపై మొదటి దాడి జరిగి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన సోమనాథ్ స్వాభిమాన్ పర్వానికి కూడా నేను హాజరయ్యాను. సామ్రాజ్యాలు ఉదయించి పతనమయ్యాయి. కాలాలు మారాయి. విజయాలు, పెను మార్పులతో చరిత్ర ముందుకు సాగింది. అయినా సోమనాథ్ మన స్మృతులలో నిలిచే ఉంది. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడిన ఎందరో మహనీయులను స్మరించుకోవాల్సిన సమయం ఇది. లకులీశ, సోమ శర్మన్ వంటి వాళ్లు సోమనాథ్ ఆలయాన్ని (ప్రభాస) గొప్ప తత్వశాస్త్ర కేంద్రంగా తీర్చిదిద్దారు. శతాబ్దాల క్రితం వల్లభికి చెందిన చక్రవర్తి మహారాజా ధరసేన -4 అక్కడ రెండో ఆలయాన్ని నిర్మించారు. దండయాత్రల ఎ. ఆ సమయంలోనూ సర్దార్ పటేల్‌ను ఒక విషయం తీవ్రంగా కలవరపెట్టింది. అదే సోమనాథ్ దుస్థితి. 1947 నవంబర్ 13న సర్దార్ పటేల్ చేతుల్లో సముద్రపు నీటితో ఆ ఆలయ శిథిలాల పక్కన నిలబడి ఇలా అన్నారు. “గుజరాతీ నూతన సంవత్సరపు ఈ పవిత్రమైన రోజున సోమనాథ్‌ను పునర్నిర్మించాలని మేం నిర్ణయించుకున్నాం. సౌరాష్ట్ర ప్రజలారా, మీరు మీ వంతు కృషి చేయాలి. ఇది ఒక పవిత్ర కార్యం. ఇందులో అందరూ పాలుపంచుకోవాలి” అని సర్దార్ పటేల్ ఆనాడు పిలుపునిచ్చారు. దురదృష్టవశాత్తు సర్దార్ పటేల్ తాను ఎంతో ఉద్వేగంతో సమర్థించిన ఈ కల నెరవేరడాన్ని చూసేందుకు విధి ఆయనకు అవకాశాన్ని ఇవ్వలేదు. సోమనాథ్ ఆలయాన్ని పునరుద్ధరించి భక్తుల కోసం తలుపులు తెరిచేలోపే ఆయన ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు. ఆయన ఆశయాన్ని కేఎం మున్షీ ముందుకు తీసుకెళ్లగా, నవానగర్ జామ్‌సాహెబ్ దానికి మద్దతు ఇచ్చారు” అని ప్రధాని మోదీ వివరించారు. త్రయంబకేశ్వర్ నుంచి శ్రీశైలం వరకు“సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ అనేది కేవలం ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికే కాకుండా జాతీయ ఐక్యత, సాంస్కృతిక కొనసాగింపులకు స్ఫూర్తి లాంటిది. ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడంపై మా ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఇందులో భాగంగా ‘వికాస్ భీ, విరాసత్ భీ’ అనే విజన్‌తో పుణ్యక్షేత్రాల సాంప్రదాయ స్వరూపాన్ని కాపాడుతున్నాం. వాటిని ఆధునీకరిస్తున్నాం. ఈ విజన్‌తోనే సోమనాథ్ నుంచి కాశీ వరకు, కామాఖ్య నుంచి కేదార్‌నాథ్ వరకు, అయోధ్య నుంచి ఉజ్జయిని వరకు, త్రయంబకేశ్వర్ నుంచి శ్రీశైలం వరకు ఆధ్యాత్మిక కేంద్రాల సాంప్రదాయ స్వరూపాన్ని కాపాడుకుంటున్నాం. వాటికి అత్యాధునిక సౌకర్యాలను సమకూర్చే అవకాశం మా ప్రభుత్వానికి లభించింది” అని ప్రధాని మోదీ చెప్పారు.

# టీవీకేకి మద్దతుపై వామపక్షాలు, వీసీకే చర్చిస్తున్నాయ్.. త్వరలోనే సరైన నిర్ణయం: బినోయ్ విశ్వం



**చెన్నై, మే 8:** తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించి నెలకొన్న సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం ఇవాళ కీలక వ్యాఖ్యలు చేశారు. మే 4, 2026న వెలువడిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, అత్యధిక స్థానాలు గెలుచుకుని ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఆహ్వానించాలని డి. రాజా డిమాండ్ చేశారు. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న సంప్రదాయాలను, పద్ధతులను గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ పాటించాలని రాజా పేర్కొన్నారు. ప్రభుత్వ బలాన్ని గవర్నర్ నివాసంలో కాకుండా, అసెంబ్లీ వేదికగా నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని ఆయన అన్నారు. 1996లో వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వానికి ఇచ్చిన విధంగానే, అతిపెద్ద పార్టీకి ఇక్కడ కూడా అవకాశం ఇవ్వాలని చెప్పుకొచ్చారు. డీఎంకే , ఏఐఏడీఎంకే కలిసే అవకాశం ఉందన్న వార్తలపై రాజా స్పందిస్తూ, ఆ విషయంలో తనకు స్పష్టత లేదని, కానీ ప్రజలు వామపక్షాలు అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంపై సీపీఐ, సీపీఎం, వీసీకే పార్టీలు చర్చిస్తున్నాయని, త్వరలోనే ఒక సరైన నిర్ణయం తీసుకుంటామని సీపీఐ పార్టీ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం తెలిపారు. కాగా, 234 స్థానాలు ఉన్న తమిళనాడు అసెంబ్లీలో టీవీకే తాజా ఎన్నికల్లో 108 స్థానాలను గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా, కాంగ్రెస్ మద్దతుతో టీవీకే బలం 112కి చేరుకుంది. వామపక్షాల మద్దతు లభిస్తే ఆ సంఖ్య 117కి చేరుతుంది.

# ఆ ముగ్గురూ కలిసొస్తే విజయ్‌కు పట్టం.. కొనసాగుతున్న ప్రతిష్టంభన



**చెన్నై:** తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా విజయ్ సారథ్యంలోని టీవీకే నిలిచినప్పటికీ మెజారిటీకి ఆమడ దూరంలో నిలిచిపోయింది. టీవీకే సంఖ్యాబలం చూపిస్తేనే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తామని గవర్నర్ తేల్చిచెప్పడంతో గత నాలుగు రోజులుగా అనిశ్చితి కొనసాగుతోంది. ఈనెల 10వ తేదీ వరకూ వరకూ టీవీకేకు గవర్నర్ గడువు ఇచ్చినందున అంతవరకూ వేచిచూస్తామని స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే చెబుతోంది. అన్నాడీఎంకే సైతం ప్రభుత్వం ఏర్పాటు దిశగా పావులు కదుపుతోంది. పార్టీకి చెందిన 40 మంది ఎమ్మెల్యేలను పుదుచ్చేరిలోని రిసార్ట్‌కు తరలించింది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కూడగట్టుకోవాలంటే వామపక్షాలు, వీసీకే మద్దతు అనివార్యమవుతోంది. సీపీఐ, సీపీఎంతో పాటు వీసీకే కీలక సమావేశాలు జరుపుతున్నందున సాయంత్రానికి కల్లా అనిశ్చితి తొలిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. టీవీకేకు అనుకూలంగా ప్రజాతీర్పు ఉన్నందున దూకుడుగా వ్యవహరించకుండా వేచిచూడాలని డీఎంకే ఆలోచనగా ఉంది. వీసీకే బలంపరంగా చూస్తే ఆ పార్టీకి విజయ్ గెలిచిన రెండు నియోజకవర్గాలతో సహా 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించడంతో ఆ బలం 113కు చేరింది. టీవీకే బలనిరూపణకు మరో ఆరు సీట్లు అవసరం. టీవీకే భవితవ్యాన్ని నిర్దేశించే బలం వీసీకే, సీపీఐ, సీపీఎం చేతుల్లో ఉంది. వీసీకే-2, సీపీఐ-2, సీపీఎం-2 సీట్లు గెలుచుకున్నాయి. ఈ పార్టీలు టీవీకేతో జతకడితే సింపుల్ మెజారిటీతో టీవీకే ప్రభుత్వం ఏర్పాటు సాధ్యమవుతోంది. టీవీకేతో పొత్తు ఖరారు చేయాలా వద్దా అనే దానిపై వీసీకే, వామపక్ష పార్టీలు శుక్రవారం సాయంత్రానికల్లా ఒక నిర్ణయం తీసుకోనున్నాయి. ప్రజా తీర్పును గౌరవించాలని మూడు పార్టీలు భావిస్తున్నట్టు చెబుతున్నారు. ఒంగా పొత్తు కొనసాగిస్తున్నందున అవి ఎటూతేల్చుకోలేక పోతున్నాయి. మరోవైపు, త్వరలోనే మంచివార్త చెబుతామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి తాజాగా ప్రకటించడం సంచలనమవుతోంది. అన్నాడీఎంకే, డీఎంకే పొత్తు పొట్టుకుంటాయనే ప్రచారం జరుగుతోంది. అయితే, బీజేపీతో పొత్తు తెంచుకుంటేనే అన్నాడీఎంకేకు మద్దతిచ్చే విషయం ఆలోచిస్తామని డీఎంకే వర్గాలు అంటున్నాయి. ఈ క్రమంలో టీవీకేకు వీసీకే, వామపక్షాలు మద్దతు ప్రకటిస్తాయా లేదా అనే దానిపై తమిళనాట ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది.

# కెంపుల లోయలో భారీ రూబీ లభ్యం



**మయన్మార్ :** భారీ కెంపు లభ్యమైంది. మాండలే నగరం ) లోని మొగాక్ ప్రాంతంలో 11 వేల క్యారెట్ల (2.2 కేజీలు) బరువున్న కెంపును గుర్తించినట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. ఇలా లభ్యమవడం అరుదైన విషయమని చెప్పారు. కాగా మయన్మార్‌లోని మొగాక్ ప్రాంతానికి కెంపులలోయ అనే పేరు కూడా ఉన్నది. ఆ లోయలో గతంలో కూడా రూబీలు లభ్యమయ్యాయి. 1990లో 496 క్యారెట్లు, 1996లో 21,450 క్యారెట్లు, 2022లో 2,789 క్యారెట్ల బరువున్న రూబీలు ఆ లోయలో లభించాయి. 1996లో దొరికిన రూబీ కంటే ప్రస్తుతం లభ్యమైన రూబీ విలువ ఎక్కువగా ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ఆ విలువ ఎంత ఉండొచ్చనేది మాత్రం అధికారులు వెల్లడించలేదు. 2015లో జరిగిన ఒక వేలంలో 25.59 క్యారెట్ల మయన్మార్ రూబీ 30.33 మిలియన్ల డాలర్లు (రూ.286 కోట్లు) పలికింది.

# ఇండోనేషియాలో అగ్నిపర్వతం బద్దలు



**ఇండోనేసియా** లోని మలుకులో ఇవాళ మౌంట్ దుకోనో అగ్నిపర్వతం బద్దలైంది. ఈ ఘటనలో 20 మంది పర్వతారోహకులు గల్లంతైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వారిలో ముగ్గురు మృతి చెందినట్లు తెలిపారు. అగ్నిపర్వతం విస్ఫోటనం చెందిన సమయంలో పలువురు విదేశీయులతో సహా మొత్తం 20 మంది పర్వతారోహకులు ఆ పర్వతంపై ఉన్నారని చెప్పారు. వారిలో ఏడుగురిని సురక్షితంగా కిందకు తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, విస్ఫోటనం కొనసాగుతున్నందున మృతదేహాలను పర్వతం నుంచి ఇంకా వెలికితీయలేదని అన్నారు. ఇదిలావుంటే బద్దలైన అగ్నిపర్వతం నుంచి దాదాపు 18 కిలోమీటర్ల ఎత్తువరకు దట్టంగా బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసిందని వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు వెల్లడించారు. దాంతో రెస్క్యూ సిబ్బంది సమీప గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మౌంట్ దుకోనో అగ్నిపర్వతం మార్చి 29 నుంచి క్రియాశీలకంగా ఉండటంతో ఎప్పుడైనా బద్దలయ్యే అవకాశం ఉందని ఇప్పటికే తాము హెచ్చరికలు జారీ చేసినట్లు ఇండోనేషియా విపత్తు నివారణ సంస్థ వెల్లడించింది. తాము లెవెల్ 2 హెచ్చరికలు జారీ చేసినప్పటికీ.. వాటిని లెక్క చేయకుండా కొందరు పర్వతారోహకులు పర్వతంపైకి వెళ్లినట్లు బీఎన్‌పీబీ తెలిపింది.

# మ్యాజిక్ ఫిగర్ లేకపోవడం గవర్నర్ తప్పా ?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టాలు, శాసనసభ, లోక్‌సభ అంటే తెలియని వారంతా..ఇప్పుడు చట్టసభలకు ఎన్నికవుతున్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఉన్న వెసలుబాటు కారణంగా ఎవ్వరైనా చట్టసభలకు ఎన్నిక కావచ్చు. ఎన్నికయ్యాక అయినా చట్టాలు, రాజ్యాంగ గురించి తెలుసుకుంటే బాగుండేది. కానీ అలా జరగడం లేదు. డబ్బులు, పలుకుబడి, మందబలం ఉంటే ప్రజాప్రతినిధులు అవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఏమీ తెలియకండా బయట ఉండేవారు చట్టాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడేస్తున్నారు. తమిళనాడు విషయంలో ఇదే జరుగుతోంది. టివికె పార్టీ పార్టీ పెట్టి,108 సీట్లు నెగ్గి, అత్యధిక మెజార్టీ సీట్లతో విజయ్ ముందున్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు ఉండాలి. కేవలం అందరికన్నా మెజార్టీ సాధిస్తే లేదా అతిపెద్ద పార్టీగా అవతరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రూల్ ఏమీ లేదు. 118 సీట్లకు సంబంధించి మద్దతు పత్రాలను సమర్పించాలని గవర్నర్ విశ్వనాథ్ కర్లేకర్ కోరడంలో కూడా వింతేమీ లేదు. మద్దతు ఉందని తెలిస్తే తప్పకుండా ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాల్సిందే. అలా కాకుండా అతిపెద్ద పార్టీగా గెలిచాం కనుక ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలని గవర్నర్‌ను డిమాండ్ చేయడం సరికాదు. అలాగే గవర్నర్‌ను నిందించడం అంతకన్నా సరికాదు. అందుకే చట్టం, రాజ్యాగం తెలియని నటులు ప్రకాశ్ రాజ్, విశాల్, కాంగ్రెస్ నేతలు గవర్నర్ తీరును తప్పు పడుతున్నారు. వీరంతా బిజెపి వ్యతిరేకులు కనుక గవర్నర్‌ను తప్పు పడుతున్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇలా మద్దతు ఉన్నా లేకున్నా ప్రభుత్వాల ఏర్పాటుకు పిలిచి, బొక్కబోర్లా పడ్డ సంఘటనలు ఉన్నాయి. అలాగే హార్స్ ట్రేడింగ్ జరగడం చూశాం. కాబట్టి గవర్నర్ అనుసరించిన విధానమే రాజ్యాంగబద్ధం. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు రోజులు కావస్తున్నా.. వ్యవహారం ముందుకు కదలడం లేదు. టివికె అధినేత విజయ్‌కు మద్దతు ఇచ్చే వారు లేఖలు సమర్పించి ఉంటే ఈ పంచాయితీ రాదు. తమిళనాడు రాజకీయం రసకందాయంలో పడడానికి హంగ్ ఏర్పడడమే ప్రధాన కారణం. అలాగే గట్టిగా ఏ ఒక్క పార్టీ కూడా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించలేదు. ఐదు సీట్లు కాంగ్రెస్ మాత్రమే ప్రకటించింది. అదికూడా మద్దతు లేఖ సమర్పించలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ, కూటమికి మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన ఏర్పడింది. దీనికి గవర్నర్ తప్పు కాదు.ఆయన బిజెపి మనిషి కనుక ఇలా చేశారని అనేవాళ్లు మూర్ఖులు తప్ప మరొకరు కాదు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో సినీ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో గెలిచి మెజారిటీకి కాస్త దూరంలో నిలిచి పోయారు. స్టాలిన్ నాయకత్వం లోని డీఎంకే కూటమి 73 స్థానాలకు పరిమితం కాగా, పళనిస్వామి నేతృత్వంలోని అన్నా డీఎంకే కూటమి 53 స్థానాలు గెలుచుకున్నది. ఈ మూడింటిలో ఏవో రెండు పార్టీలు కలిస్తే తప్ప ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం లేదు. ఎవరికి వారే భీష్మించుకొని కూర్చోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆగిపోయింది. గవర్నర్‌ను విజయ్ సంప్రదించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించా లంటే మ్యాజిక్ ఫిగర్ సభ్యుల మద్దతు తప్పనిసరి అని గవర్నర్ స్పష్టంచేశారు. దీంతో తమిళనాడులో సీఎం పీఠం ఎవరిది అనే తీవ్ర ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొన్నది. బీహార్‌లో 2005 ఎన్నికల్లో జేడీయూ, ఆర్జేడీ, ఎల్‌జేపీలో ఏ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన నెలకొన్నది. తాము ఎవరికీ మద్దతిచ్చేది లేదని మూడు పార్టీల నేతలు భీష్మించుకున్నారు. విధి లేని పరిస్థితుల్లో గవర్నర్ బూటాసింగ్ రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. అసెంబ్లీ రద్దు చేశారు. వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. ప్రతిష్టంభన పేరుతో అసెంబ్లీని రద్దు చేయడం అప్రజాస్వామికమని సుప్రీంకోర్టు తప్పుపట్టింది కానీ అప్పటికే రద్దయిన అసెంబ్లీ పునరుద్ధరించలేదు. ఆరునెలలకే అసెంబ్లీ ఎన్నికలు జరిగి జేడీయూ అధికారంలోకి వచ్చింది.



సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం గవర్నర్ తొలుత మెజారిటీ సాధించిన పార్టీకి లేదా ప్రీపోల్ సంకీర్ణానికి అవకాశం ఇవ్వాలి. లేదా ఎన్నికల తర్వాత ఏర్పడ్డ సంకీర్ణానికి అవకాశం ఇచ్చి బలపరీక్షకు పురమాయిం చాలి. సర్వసాధారణంగా జరుగుతున్న తంతు ఇదే. ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాని సందర్భంలో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆహ్వానించ వచ్చునా లేదా అన్న విషయంలో మాత్రం గవర్నర్లు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. అలా తీసుకున్న సందర్భం లో విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఇలా గోవా, కర్నాటక, మహారాష్ట్రల్లో తలబొప్పి కట్టిన సంఘటనలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 నిబంధన ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులను నియమిస్తారు. గవర్నర్ అభీష్టం ఉన్నంతకాలం వారు పదవిలో ఉంటారు. ఈ మేరకు గవర్నర్‌లు అంతా ఒకే రీతిన వ్యవహరించారు. కానీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే ముందుగా ఎవరిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలన్న విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. అక్కడే గవర్నర్ల విచక్షణాధికారం చట్టాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు చూశాం. రాజకీయ నేతలను గవర్నర్లుగా నియమించడం మొదలయ్యాక విచక్షణాధికారం ఆయా పార్టీల విధానాలకు అనుగుణంగా మారింది. ఇలాంటి దుష్ట సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టింది. బిజెపి కొనసాగిస్తోంది. అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలా వద్దా అనే విషయంలో ఒక స్పష్టత ఇస్తే తమిళనాడు వంటి వివాదాలు భవిష్యత్తులో తలెత్తవు. ఆ దిశగా కేంద్రం రాజ్యాంగ సవరణ చేస్తే మరీ మంచిది. డీఎంకే, అన్నాడీఎంకే కూటములు ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాని నేపథ్యంలో విజయ్‌కి గవర్నర్ అవకాశం ఇస్తే పెద్దగా అభ్యంతరాలు ఎందుకని చాలామంది ప్రశ్నిస్తున్నారు. కానీ ఇక్కడా గవర్నర్ తన పరిధి మేరకు, రాజ్యాంగ బద్ధంగానే మద్దతు లేఖలు కోరారు. అందులో తప్పుకూడా లేదు. తన బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని అడగడంతోనే అక్కడ మెలిక ఉంది. అధికారంలోకి వచ్చిన తరవాత ఓ పదిమంది ఎమ్మెల్యేలను కొనడం సులువు. అలాంటి ఉదాహరణలు కోకొల్లలు. కాబట్టి హార్స్ ట్రేడింగ్‌కు అవకాశం లేకుండా, నడుచుకోవాలన్న గవర్నర్ నిర్ణయం సమర్థనీ యం. అన్నా డీఎంకే, డీఎంకేల్లో ఒకరు మద్దతిస్తే విజయ్ ముఖ్య మంత్రి కావచ్చు. లేదా డీఎంకే, అన్నా డీఎంకే కూటములు కలిస్తే కాంగ్రెస్, బీజేపీ సహకారం లేకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే 121 సీట్ల బలం వారికి ఉన్నది. ఈ క్రమంలో గవర్నర్‌ను విమర్శించే వారు చట్టాలను, రాజ్యాంగాన్ని తెలుసుకుంటే మంచిది. మరీ ముఖ్యంగా సినిమా నటులకు ఇది వర్తిస్తుంది.

---

## టివికెను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలి

**• ద్రవిడ పార్టీల కలయికపై సమాచారం లేదు • డిఎంకె ఎంపి కనిమొళి వెల్లడి**



**చెన్నై,మే8:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు సాధించినా.. మెజార్టీ లేకపోవటంతో టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతోంది. దీన్ని డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు అవకాశంగా మలుచు కోవాలని చూస్తున్నాయి. ఇరు పార్టీల అగ్రనేతలు దశాబ్దాల వైరాన్ని మరిచి పొత్తులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతించాలి. ప్రజల తీర్పే సర్వోన్నతమైనది. దానిని గౌరవించాలి. దురదృష్టవశాత్తు ఎవరికీ మెజారిటీ లేదు. నేను ఊహాగానాలకు సమాధానం ఇవ్వలేనని అన్నారు. రెండు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ.. టీవీకేకు మద్దతు ఇవ్వటంపై కనిమొళి స్పందించారు. మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కనిమొళి మాట్లాడుతూ.. కాంగ్రెస్-డీఎంకే చాలా ఎన్నికల్లో కలిసి పనిచేశాయని తెలిపారు. తాజా ఎన్నికల్లో కూడా కలిసి పోటీచేసి ఓటమి చవిచూశాయన్నారు. ప్రతి పార్టీకి తమకు ఏదైతే సరైనదని అనిపిస్తుందో అది చేసే హక్కు ఉంటుందన్నారు. ఇతరుల గురించి తాను చెప్పేది ఏమీ లేదని, తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విశ్వసనీయ వర్గాల సమచారం ప్రకారం.. అన్నాడీఎంకే పార్టీకి మద్దతు ఇవ్వడానికి డీఎంకే సిద్ధంగా ఉంది. మద్దతు కావాలంటే బీజేపీతో అన్నాడీఎంకే పొత్తును రద్దు చేసుకోవాలని డీఎంకే షరతు పెట్టింది. అంతేకాదు.. తమతో పాటు కలిసే చిన్న పార్టీలకు కూడా మంత్రి పదవులు ఇవ్వాలని అంటోంది.ఇదిలావుంటే కాంగ్రెస్ తీరును డీఎంకే ఎమ్మెల్యే సమావేశం ఖండించింది. తేనాంపే÷-టటైలోని అన్నా అరివాలయంలో డీఎంకే ఎమ్మెల్యే సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ అధ్యక్షతన గురువారం జరిగింది. శాసనసభ ఎన్నికల్లో డీఎంకే నాయకత్వంలోని లౌకివాద ప్రగతిశీల కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన కూటమి పార్టీలకు, ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఐదేళ్ల డీఎంకే హయాంలో తమిళనాడును పలు రంగాల్లో ముందంజలో నడిపించినందుకు స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తగిన నిర్ణయం తీసుకునే అధికారాన్ని ఆయనకే అప్పగిస్తూ, కూటమికి ద్రోహం చేసి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని ఆరోపిస్తూ, ఆ పార్టీ వైఖరిని ఖండిస్తూ తీర్మానాలు చేశారు.

## యువత మత్తుకు దూరంగా ఉండాలి

### టాలెంట్ ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి


### మెగా జాబ్‌మేళాలో మంత్రి సురేఖ

**హనుమకొండ,మే8:** యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు. యువత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. టాలెంట్ ఆధారంగా మాత్రమే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కాళోజీ కళాక్షేత్రంలో మెగా జాబ్‌మేళా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, కలెక్టర్ సత్యశారదదేవి పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. సమాజంలో ఇప్పటి జనరేషన్‌లో చాలా మార్పులు వచ్చాయని చెప్పుకొచ్చారు. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడొద్దని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యువత ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఉండాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య వ్యాఖ్యానించారు. నిత్యం మనలో మనం యుద్ధం చేసుకోవాలని అన్నారు. యువత ఉద్యోగాల ప్రయత్నాలను ఆపొద్దని చెప్పుకొచ్చారు. యువత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. ఏఐ వచ్చిన తర్వాత ఉన్న ఉద్యోగాలు పోతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. నేటి పోటీని తట్టుకుని నిలబడాలని అన్నారు. ఉద్యోగం ఎక్కడైనా చేసేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉండాలని చెప్పుకొచ్చారు. ఆర్మీలో తెలంగాణ యువతప్రాతినిధ్యం తక్కువ అని తెలిపారు. ఉద్యోగం రావాలంటే నైపుణ్యం కలిగి ఉండాలని అన్నారు. ప్రైవేటు ఉద్యోగంలో రాణించాలంటే స్కిల్స్ ముఖ్యమని చెప్పుకొచ్చారు. తల్లిదండ్రుల కళలు నెరవేరాలంటే కష్టపడాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే నాగరాజు సూచించారు.



## పశ్చిమాసియాలో శాంతి దోబూచులాట!

ఒకవైపు ఇరాన్‌తో యుద్ధం ముగిసిందంటారు, మరోవైపు శాంతి ఒప్పందం కుదరలేదంటారు. మేం చెప్పినట్లుగా వినకపోతే పెద్దఎత్తున తిరిగి దాడులు చేస్తామంటూ ఇంకోవైపు బెదిరిస్తుంటారు. అసలు యుద్ధమే లేదంటూ తమ పార్లమెంటును తప్పుదారి పట్టించారు. లెబనాన్ మీద దాడులను కూడా ఆపాలన్న ఇరాన్ డిమాండ్‌ను పట్టించుకోని అమెరికా ప్రతిరోజూ ఇజ్రాయిల్‌తో జరిపిస్తూనే ఉంది.తాను ప్రారంభించిన ప్రాజెక్టు ఫ్రీడమ్‌ను రెండురోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. హార్ముజ్ జలసంధిలో చిక్కుకు పోయిన నౌకలకు దారి చూపి గమ్యస్థానాలకు పంపటానికి పెట్టిన పేరు అది. కాల్పుల విరమణకు ప్రకటించిన నెల రోజుల విరామం గురువారం నాటితో ముగిసిపోయింది.ఈ లోగా పాత అంశాలకే కొన్ని మార్పులు చేసి ఇరాన్ కొత్త ప్రతిపాదనల పేరుతో మధ్యవర్తి పాకిస్తాన్‌కు అందచేసింది. వాటిని పరిశీలిస్తున్నా మంటూనే తమతో ఒప్పందానికి రాకపోతే.....తాట తీస్తానంటూ ట్రంప్ పపాటలే పాడుతున్నాడు. ఒప్పందం కుదుర్చుకొనే పరిస్థితి మరింత మెరుగైందని అదే నోటితో చెబుతాడు. అతగాడు ఎన్ని పిల్లి మొగ్గలు వేసినా ఈ పరిస్థితిలో మార్పులేదు. ఐరోపాలోని అమెరికా మిత్రదేశాలన్నీ మరింతదూరం జరుగుతున్నాయి తప్ప చేయూత అందించేందుకు సిద్ధపడటం లేదు.ఇరాన్ సంక్షోభంలో అనేక దేశాల్లో ఆర్థిక పరిస్థితి అతలాకుతలమవుతున్నది, జనాల మీద ఇంధన భారం విపరీతంగా పెరుగుతున్నది. ఇదిలా ఉండగా బుధవారం నాడు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్గాచీ చైనా సందర్శించి అక్కడి నేతలతో తాజాపరిస్థితి గురించి చర్చించటం ప్రాధాన్యత సంతరించుకుంది. వాషింగ్టన్ ఎన్ని బెదిరింపులకు పాల్పడినా వెన్నుదన్నుగా నిలుస్తున్న చైనాను ఇరాన్ నమ్ముతున్నది. ఒప్పందం కుదుర్చుకొనేందుకు ఇరాన్ ప్రతిపాదించిన పద్నాలుగు అంశాలపై రెండు పక్షాలూ క్రమంగా దిగివచ్చేందుకు ప్రాతిపదిక ఉన్నట్లు అమెరికా మీడియా సంస్థలు చెప్పిన కథనాలతో బ్రెంట్ ముడి చమురు ధర 98 డాలర్లకు తగ్గింది.రెండు రోజుల పాటు బలవంతంగా నౌకల విముక్తి పథకాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన కూడా దీనికి దోహదం చేసింది. యురేనియం శుద్ధిని కొంతకాలం వాయిదా వేసేందుకు ఇరాన్ అంగీకరిస్తే దాని మీద విధించిన ఆంక్షల ను క్రమంగా సడలించటంతో పాటు, స్తంభింపచేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేసేందుకు అమెరికా సుముఖంగా ఉందని ఊహాగానాలు వెలువడ్డాయి.యురేనియం శుద్ధి హక్కును తాము వదలుకొనేది లేదని తప్ప అణ్వాయుధాలను తయారు చేస్తామని ఇరాన్ ఇంతవరకు ఎప్పుడూ చెప్పలేదు.అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందానికి (ఎన్‌పిటి) కట్టుబడే ఉన్నామని అంటోంది. ప్రపంచంలో అతిపెద్ద సైనిక శక్తిగా ఉన్న అమెరికా ఇప్పుడేం చేస్తున్నది? ఫిబ్రవరి 28న ఇరాన్‌పై దాడులను ప్రారంభించటమైతే చేసింది గానీ, ఇప్పుడు ఆ సంక్షోభం నుంచి బయటపడటానికి అమెరికా నానా ఇబ్బందులు పడుతున్నది. చెప్పుకోరాని చోట దెబ్బతగిలితే ఎవరికైనా ఎలా ఉంటుందో ట్రంప్‌ది అదే స్థితి. ఇరాన్ ప్రతిదాడుల్లో జరిగిన నష్టం గురించి చెప్పుకోలేదు, అలాగని దాచుకోలేడు. గల్ఫ్‌లోని పదిహేను అమెరికా మిలిటరీ కేంద్రాలలో 228 కట్టడాలు, ధ్వంసమైన పరికరాలకు సంబంధించి ఇటీవల ఇరాన్ కొన్ని చిత్రాలను విడుదల చేసింది. వాటిలో విమానాలను నిలిపే ప్రాంతాలు, చమురు డిపోలు,విమానాలు, రాడార్లు, సమాచార వ్యవస్థల వంటివి ఉన్నాయి. ఇంతవరకు ఆ చిత్రాలు తిమ్మినిబమ్మిని చేసి చూపినవిగా లేదా కృత్రిమ సృష్టి అని చెప్పలేక అమెరికా ఏవేవో పిట్టకథలను చెబుతున్నది.ఎవరెన్ని చెప్పినా ఇరాన్ గురిచూసి దెబ్బతీసిందని దాడుల సమయంలోనే వార్తలొచ్చినందున అలాంటి కథలను నమ్మాల్సిన అవసరం లేదు.ట్రంప్ చెప్పి నట్లుగా మరిన్ని దాడులకు పాల్పడితే ఇదే మాదిరి పరాభవం ఎదురుకావచ్చునే హెచ్చరికలే భూతల దాడులకు దిగకుండా అమెరికా మిలిటరీ జాగ్రత్తపడుతున్నదని చెప్పవచ్చు. ఇరాన్‌పై దాడులతో తమకు 25బిలియన్ డాలర్ల మేర నష్టం వచ్చినట్లు రక్షణశాఖ కబుర్లు చెబుతున్నది. కానీ, ఇది 50బిలియన్ డాలర్లకు పైమాటే ఉంటున్నట్టు తెలుస్తోంది. వర్తమాన సంవత్సరంతో పోల్చితే 42శాతం పెంచి వచ్చే ఏడాది రక్షణ బడ్జెట్‌ను 1.5లక్షల కోట్ల డాలర్లకు పెంచాలని ప్రతిపాదిస్తున్నారంటే ఎంతగా దెబ్బతిన్నదో చూడవచ్చు. పశ్చిమాసియా, మధ్య ప్రాచ్య ప్రాంతంలో జరిగిన నష్టాలకు సంబంధించిన చిత్రాలను విడుదల చేయవద్దని వాణిజ్య ఉపగ్రహ కంపెనీలను ట్రంప్ యంత్రాంగం ఆదేశిం చిందంటేనే అది ఎంతగా మూసిపెడుతోందో తెలుస్తోంది.



# సమయం : సజీవ సాక్ష్యం

సమయం నిశ్శబ్దంగా..
నిలకడగా ప్రవహిస్తుంది
గడియారమే టిక్ టిక్ అంటూ..
తెగ పొగరుగా అరుస్తుంది !

సమయానికి పక్షపాతం లేదు
సమయం చేతిలో చేయివేసి..
లక్ష్యం వైపు ఏకాగ్రతతో నడిస్తే..
విజయతీరాలకు చేర్చుతుంది !

సమయంలో మన ప్రాణ మిత్రుడు
మనకు ఏం, ఎప్పుడు, ఎక్కడ...
ఎం ఇవ్వాలో తెలివిగా తెలుసుకొని..
మన జీవిత పల్లెంలో వడ్డిస్తుంది !

సమయానికి విలువనిస్తే..
మహోన్నత శిఖరాలకు చేర్చుతుంది
సమయాన్ని చులకన చేస్తే..
అధ పాతాళానికి తోసేస్తుంది !

జీవితాన్ని ఆస్వాదిస్తే వేగంగా..
కష్టనష్టాల బాధల్లో నెమ్మదిగా..
ఎదురు చూపుల్లో మందకోడిగా..
శుభ కార్యాల్లో జోరుగా వడివడిగా..
కదిలినట్లు అనిపించే సమయం
నరులతో ఆడుతుంది వింత నాటకం
మన రాకపోకలకు అదో సజీవ సాక్ష్యం
దాన్ని తప్పించుకోవడం అసాధ్యం !

మధుపాళీ

## నూతన దంపతులను ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు



**ఎన్టీఆర్ డిస్టిక్ మే 9**

జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామం శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు దామెర్ల వెంకట అంజని ప్రసాద్-వాణి ప్రసన్న కుమారుడు పవన్ కళ్యాణ్ మరియు వల్లపునేని శ్రీనివాస్ రావు-వీరనాగమ్మ కుమార్తె నవ్య వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ.ల సంఘం అధ్యక్షులు మార్కాపూడి గాంధీ, జడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి -నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠ రావు, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శివరాత్రి పృధ్వీరాజ్, నియోజకవర్గ ఐటీ, వాణిజ్య బీసీ విభాగాల అధ్యక్షులు బండి రంజిత్, దేరంగుల శ్రీనివాసరావు, జవ్వాజి నరసింహారావు, మండల రైతు విభాగ అధ్యక్షులు గూడపాటి శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు

## నూతన దంపతులను ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు

**ఎన్టీఆర్ డిస్టిక్ మే 9**



పెనుగంచిప్రోలు గ్రామంలోని ఈ రోజున శృతి కన్వెన్షన్ హాల్ నందు పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కొమ్మినేని సత్యనారాయణ-అనసూయ కుమారుడు వంశీ కృష్ణవివాహ వేడుకకు నందిగామ మాజీ శాసనసభ్యులు మొండితోక జగన్మోహనరావు కలసి పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి -నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు లగడపాటి నాగేశ్వరరావు, అనిగండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు ఉన్నం శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ విభాగ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శివరాత్రి పృధ్వీరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, చేని రాంబాబు నియోజకవర్గ ఐటీవాణిజ్య విభాగాల అధ్యక్షులు బండి రంజిత్, దేరంగుల శ్రీనివాసరావు, మండల రైతు విభాగ అధ్యక్షులు గూడపాటి శేషగిరిరావు, పిడికిడి కోటేశ్వరరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, వూట్లా లక్ష్మణరావు, గంగూరి ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు

## కామినేని సైదులు రాములమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సుబ్బారావు రూ.25,116/- రూపాయల విరాళముగా




**ఎన్టీఆర్ డిస్టిక్ మే 8**

జగ్గయ్యపేట మండలము తిరుమలగిరి గ్రామములో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము నందు జరుగుచున్న నిత్యాన్నదాన పథకమునకు ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మక్కపేట వాస్తవ్యులు కామినేని సైదులు రాములమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సుబ్బారావు రూ.25,116/- రూపాయల విరాళముగా అందజేసియున్నారు. వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా సిబ్బంది శ్రీ స్వామి వారి ప్రసాదములు అందజేయుట జరిగినది అని తిరుమలగిరి దేవస్థానం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుమ్మా వెంకటేష్, సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి నూతక్కి వెంకట సాంబశివరావు తెలియజేసియున్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

**.. దెందులూరు నియోజకవర్గంలో ఏలూరు ఎంపీ పర్యటన.**
**.. దెందులూరు మండలం చల్లచింతలపూడిలో పార్టీ నేత ఇంట వివాహ వేడుకలకు హాజరైన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.**
**.. గన్నవరంలో ఏపీ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడి కుమార్తె వివాహానికి హాజరు.**
**.. హనుమాన్ జంక్షన్ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు.**





**ఏలూరు, మే 08.**

ఏలూరు పార్లమెంట్ పరిధిలో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పలువురు పార్టీ నేతల ఇంట వివాహాది శుభ కార్యాలకు హాజరయ్యారు. ముందుగా ఉదయం దెందులూరు నియోజకవర్గం చల్లచింతలపూడి వెళ్లిన ఎంపీ, పార్టీ నేత నాగనబోయిన సత్యనారాయణ, శ్రీమతి చంద్రావతి దంపతుల కుమార్తె ప్రసన్న కుమారి వివాహం సందర్భంగా నూతన వధువును ఆశీర్వదించి "మహేష్ అన్న పెళ్ళి కానుక" అందజేసి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గన్నవరంలో జరుగుతున్న ఏపీ బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి కుమార్తె గీతిక వివాహ వేడుకకు హాజరైన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వధూవరులను ఆశీర్వదించి "మహేష్ అన్న పెళ్ళి కానుక" అందజేశారు. గన్నవరం వెళుతూ మార్గమధ్యలో హనుమాన్ జంక్షన్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆగి, హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకమండలి ఛైర్మన్, ఈవో ఆలయ మర్యాదలతో ఎంపీకి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ పూజారులు ఎంపీకి ఆశీర్వచనం, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసారు.

# భారత వీరత్వానికి ప్రతీక మహారాణా ప్రతాప్‌సింగ్

### (09 మే "మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి" సందర్భంగా)

రాజస్థాన్‌లోని మెవార్ రాజ్య 13వ రాజు మహారాణా ప్రతాప్ 09 మే 1540న రాజపుత్ర కుటుంబానికి చెందిన ఉదయ్ సింగ్-జైవంత బాయి దంపతులకు జన్మించారు. చిన్నతనంలోనే యుద్ధ నైపుణ్యాలు, వినూత్న పోరాటాలు, గుర్రపు స్వారి, సాయుధ కత్తి సాహసాలు, రాజకీయాలు లాంటి అంశాల్లో శిక్షణ పొంది నిష్ణాతులు అయ్యారు. 1572లో తండ్రి ఉదయ్ సింగ్ మరణానంతరం మేవర్ 13వ రాజుగా బాధ్యతలు చేపట్టారు. 1567 – 68లో చిత్తోర్‌గఢ్ ముట్టడి అనంతరం మేవార్ ప్రాంత సారవంతమైన భూములు మొఘలుల వశం అయ్యాయి. ఆరావళి ప్రాంత అడవులతో కూడిన ప్రాంతం రాణా ప్రతాపుడి నియంత్రణలోనే ఉండేది.

అక్బర్‌ను ధిక్కరించిన ధీశాలి:

మొఘల్ చక్రవర్తి అక్బర్ మేవార్ నుంచి గుజరాత్‌కు స్థిరమైన శాశ్వత మార్గం నిర్మించాలని అనుకున్నాడు. అప్పటికే రాజపూత్ రాజులు అక్బర్‌కు సామంత రోజులుగానే ఉండేవారు. అక్బర్‌కు సామంతరాజు ఉండడానికి మొదటి సారి నిరాకరించారు రాణా ప్రతాప్. ఈ విషయంలో రాణా ప్రతాప్‌కు అక్బర్‌కు మధ్య విభేదాలు పెరిగి హల్దీఘాటీ యుద్ధానికి దారి తీసింది. 18 జూన్ 1576న రెండు రాజ్యాల మధ్య యుద్ధం జరిగింది. అధిక సైన్యం కలిగిన మొఘలులు విజయం సాధించారు. మేవార్ సైన్యానికి భారీ నష్టాలు వచ్చాయి. యుద్ధ సమయంలో హల్దీఘాటీ వద్ద ఉన్న ఇరుకైన కనుమ దారి వద్ద రాణా ప్రతాప్ సైనిక దళాలు మోహరించడం, మొఘల్ సైన్యంతో 6 గంటలు యుద్ధం కొనసాగడం, మహారాణా గాయపడి కొండల్లో తప్పించుకోవడం జరిగింది. మహారాణా ప్రతాప్‌న, వారి కుటుంబ సభ్యులను కూడా పట్టుకోకపోవడంతో మొఘలుల విజయం నిరర్థకం అయ్యింది.

మెవార్ రాజ్య పునర్నిర్మాణం:

అనంతరం ససైన్యంతో అజ్ఞాతం లోంచి బయటకు వచ్చి మేవార్ పశ్చిమ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకోగలిగారు. 1582లో మొఘలుల నుంచి దావర్ వద్ద 36 సైనిక స్థావరాలను స్వాధీనం చేసుకొని తన కిరీటంలో మరో కలికితురాయిని చేర్చుకోగలిగారు. ఓటమి పొందినప్పటికీ, తిరిగి తన సైన్యాన్ని ఏర్పరచుకుకొని మళ్ళీ రాజ్య స్థాపన చేయుకోవడం జరిగింది. 1585లో అక్బర్ తన మకాంను లాహోర్‌కు మార్చడంతో మేవార్ రాజ్యాన్ని కొంత వరకు విస్తరించుకొని చావంద్? అనబడే నూతన రాజధానిని నిర్మించాడు. 1597 జనవరి 19న చావంద్ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన ప్రతాపుడు తన 56వ ఏట కన్ను మూసారు. రాణా ప్రతాప్ పెద్ద కుమారుడు అమర్ సింగ్ తర్వాత రాజయ్యాడు.

ఒంటరిగా, మరే ఇతర రాజపుత్ర రాజ్యాల మద్దత్తు లేకుండా మొఘల్ సామ్రాజ్యాన్ని ధిక్కరించిన రాణా ప్రతాప్ శౌర్య ప్రతాపాలు, ఆత్మగౌరవం, విలువలతో కూడిన జీవితం తర్వాత వచ్చిన ఛత్రపతి శివాజీకి కూడా మార్గ నిర్దేశం చేయడం విశేషం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# సంప్రదాయేతర పవన శక్తిని ఒడిసిపడదాం !

### (09 మే "జాతీయ విండ్ మిల్ (గాలిమరల) దినం" సందర్భంగా)

గాల్లో మండి శక్తిని ఇవ్వగల పదార్థాన్ని ఇంధనంగా నిర్వచిస్తాం. ఆది మానవుడి నుంచి నేటి వరకు బొగ్గు, వంట చెరుకు, పెట్రోల్, డిసిల్, కిరోసిన్. వంట గ్యాసు లాంటి ఘన/ద్రవ/వాయు పదార్థాలను ఇంధనాలుగా మాడుతూ వస్తున్నాం. భూమి పొరల్లోంచి తవ్వి తీసిన బొగ్గు, పెట్రోలియం లాంటి ఉత్పత్తులను శిలాజ ఇంధనాలుగా పిలుస్తున్నాం. నేడు విద్యుత్ వినియోగమే ప్రజల జీవనాధారంగా మారిన వేళ శిలాజ ఇంధనాల కొరతతో పాటు వాటి వాడకం వల్ల జరుగుతున్న పర్యావరణ విధ్వంసం వల్ల తరిగే సాంప్రదాయ పునరుత్పాదకత సాధించలేని శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూనే తరగని, సాంప్రదాయేతర, పునరుత్పాదక శక్తి వనరుల పట్ల మానవ ఆలోచనలు వెళ్లవలసిన అగత్యం ఏర్పడింది.

జాతీయ విండ్ మిల్ (గాలి మరల) దినం:

నేడు పునరుత్పాదక శక్తి వనరులుగా సౌర, పవన, అలల, జియోథర్మల్, హైడ్రో, బయోమాస్ లాంటివి నిలుస్తున్నాయి. గాలులు వీచినపుడు వచ్చే పవనాలతో గాలి మరలను లేదా విండ్ మిల్స్‌ను అమర్చి విద్యుత్తు శక్తిగా మార్చడం అనాదిగా జరుగుతూ వస్తున్నది. నెథర్‌లాండ్స్‌లో ప్రారంభంపైన విండ్ మిల్స్ విప్లవం నేడు ప్రపంచ దేశాలన్నింటిలో ప్రవేశిస్తున్నది. పవన శక్తిని ఒడిసి పట్టే సునాయాస విండ్ మిల్స్ లేదా గాలి మరలకు విస్తృత ప్రచారం కలిపించడానికి ప్రతి ఏట మే నెల రెండవ శనివారం, అనగా 09 మే 2026 రోజున "జాతీయ విండ్ మిల్ లేదా గాలి మరల దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్ ఎనర్జీగా లభిస్తున్న పవన శక్తిని విండ్ మిల్స్ ద్వారా గ్రామీణ, మునిసిపల్, ఇతర విభాగాల్లో విద్యుత్ లేదా ఇతర రూపాల్లో వాడడం కొనసాగుతున్నది. నాటి విండ్ మిల్స్‌కు సాంకేతిక సొబగులు అద్ది అత్యాధునిక విండ్ టర్బైన్స్‌ను కూడా రూపొందించి ముందుకు సాగడం జరుగుతోంది.

పవనశక్తి ప్రయోజనాలు, సవాళ్ళు:

సహజ పవన గమనాలకు అనుగుణంగా గతిశక్తిని గాలి మరలను అమర్చి పర్యావరణహిత, హరిత, శుద్ధ విద్యుత్తు శక్తిని ఉత్పత్తి చేయడం నేడు సర్వత్రా కనిపిస్తున్న దృశ్యాలు. భూతాపానికి గ్రీన్ హౌజ్ వాయువుల ఉద్గారకాలను తగ్గించడం, కార్బన్ ఎమిషన్స్‌ను కట్టడి చేయడం, ఖర్చు తక్కువ కావడం, మేయింటెనెన్స్ సులభం కావడం, శక్తి అవసరాలను తీర్చడం, భూభాగానికి సహకరించడం, విండ్ మిల్స్ స్థాపన సులభం కావడం, ఉద్యోగాల కల్పన జరగడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన పునరుత్పాదక పవన శక్తి ఉత్పత్తితో పాటు వాడకాన్ని కూడా ప్రోత్సహించడం నేటి అవసరంగా మారింది. గాలి మరల వాడకంతో వన్యప్రాణుల సహజత్వానికి విఘాతం కలగడం, శబ్ద కాలుష్యానికి కారణం కావడం, ఎత్తైన ప్రదేశాల్లో భూమి అనుకూలంగా ఉండడం లాంటి ప్రతికూలాలు ఉన్నప్పటికీ పవన శక్తిని విద్యుత్ రూపంలోకి మార్చడం విధిగా జరగాలి.

భారత్‌లో పవన శక్తి:

ప్రపంచవ్యాప్తంగా 80 శాతం అత్యధిక పవనశక్తిని ఉత్పత్తి చేస్తున్న ఐదు దేశాల్లో జర్మనీ, అమెరికా, డెన్మార్క్, స్పెయిన్, భారత్ ఉన్నాయి. భారత్‌లో పవనశక్తిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపి, గుజరాత్, కర్నాటక, ఎంపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళ నాడులు ముందున్నాయి. భారత పునరుత్పాదక శక్తి వనరుల మంత్రిత్వశాఖ లక్ష్యాల ప్రకారం 2030 నాటికి 30 జిడబ్ల్యూ పవన శక్తిని ఒడిసి పట్టడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. విండ్ టర్బైన్స్ ద్వారా పవనంలో దాగిన గతి శక్తిని, తొలుత యాంత్రిక శక్తిగా మార్చడం, యాంత్రిక శక్తిని విద్యుత్తు శక్తిగా మార్చడం భారతంలో విస్తృతంగా జరుగుతున్నది.

పర్యావరణ హిత, గ్రీన్, క్లీన్, తరగని, పునరుత్పాదక పవన శక్తిని వీడడం వల్ల ప్రత్యక్షంగా కార్బన్ ఉద్గారాలు తగ్గిపోయి ప్రతికూల వాతావరణ మార్పులు అదుపు చేయబడతాయి. సులభంగా, ఉచితంగా, విరివిగా అందుబాటులో ఉన్న పవన శక్తిని విద్యుత్‌గా మార్చడం వల్ల వ్యక్తిగత శక్తి స్వేచ్ఛ లభిస్తుంది. నేడు సోలార్ పవర్ ప్లాంట్ల వలె విండ్ పవర్‌ను వాడడం కూడా బహుళ ప్రచారంలోకి రావాలి, రేపటి పరిశుద్ధ పర్యావరణానికి పునరుద్ధరణ జరగాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# పర్యావరణ పరిరక్షణలో వలస పక్షులు

### (09 మే "ప్రపంచ వలస పక్షుల దినోత్సవం" సందర్భంగా)

కొన్ని ప్రత్యేక ప్రాంతం లేదా దేశం నుంచి నియమిత సీజన్లలో సుదూరం పయనించి వచ్చి చేరే వలస పక్షులు ప్రకృతి విందులను ఆరబోస్తూ, చూపరుల కళ్లకు విందులు చేస్తాయి. వలస పక్షుల వల్ల విత్తనాల వ్యాప్తి, పుప్పొడి వ్యాప్తి, కీటకాల నియంత్రణల ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతోంది. ఒక దేశం నుంచి మరో దేశానికి ప్రయాణించి జీవవైవిధ్యం, దేశాల మధ్య సహకారాలకు ప్రతీకలుగా వలస పక్షులు ఉపయోగపడుతున్నాయి. వలస పక్షుల సహజ ప్రకృతి విధ్వంసం కావడం, వాతావరణంలో ప్రతికూల మార్పులు చోటు చేసుకోవడం, వేటల రూపంలో మానవ ప్రమేయం పెరగడంతో వలస పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లడంతో పర్యావరణ సహజత్వం కాపాడబడటం, ప్రజల జీవనోపాధిని నిలబెట్టడం, పంటలకు పట్టే తెగుళ్లు-కీటకాలను నియంత్రించడం, పరాగ సంపర్కానికి దోహదపడడం, విత్తన వ్యాప్తి చేయడం, పోషకాలను రవాణా చేయడం లాంటి ప్రయోజనాలు ఒనగూడుతాయి. దండయాత్ర, ఆక్రమణ, వలసవాదం, వలస వెళ్ళడం లేదా వలస రావడం అనే నాలుగు వలస పక్షుల రూపాలు ఉంటాయి.

భారతదేశానికి వచ్చే వలస పక్షి అతిథులు :

వలస పక్షుల్లో అధికంగా తమ సంతానోత్పత్తి, ఆహారం, తమ పిల్లల్ని పెంచడం కోసం సరైన వాతావరణ పరిస్థితులను వెతుక్కుంటూ, వేల మైళ్లు ప్రయాణించి మెరుగైన ప్రకృతి కలిగిన ప్రదేశాలకు వలసలు వెళతాయి. భారతదేశంలో పక్షి జీతుల పరిరక్షణకు ప్రతి ఏట 05 జనవరి రోజున "జాతీయ పక్షుల దినోత్సవం" కూడా పాటించడం ఆనవాయితీగా మారింది. శీతాకాలంలో భారతదేశానికి వలస పక్షులు చేరడంతో పక్షి ప్రేమికుల సందర్శనాలు, వాటి సంరక్షణకు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది. వలస పక్షుల దినోత్సవాన్ని శరత్కాలంలో 10 అక్టోబర్ రోజున కూడా నిర్వహించడం చూస్తున్నాం. వలస పక్షుల పరిరక్షణకు అవసరమైన అంతర్జాతీయ సహకారం గురించి అవగాహన పెంచడానికి ప్రపంచ వలస పక్షుల దినం వేదికలు సమర్థవంత సాధనాలుగా పని చేస్తాయి. వలస పక్షులను వీక్షించడానికి ప్రత్యేక "వలస పక్షి వీక్షణ యాత్రలు" కూడా చేయడం చూస్తున్నాం. వలస పక్షులు ఒక ప్రకృతి అద్భుతం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,000 రకాల వలస పక్షి జాతులు ఉన్నాయి. చాలా వలస పక్షులు ఉత్తర ప్రాంతాల నుంచి దక్షిణ శీతల విడిది ప్రాంతాలకు చేరతాయి. కొన్ని వలస పక్షి జాతులు దక్షిణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి చేసి తేలికపాటి ఉత్తర శీతాకాల తీర ప్రాంతాలకు వస్తాయి. ఇతర వలస పక్షులు శీతాకాల మాసాల్లో పల్లపు ప్రాంతాల్లో నివసించి, వేసవిలో పర్వత ప్రాంతాలకు చేరతాయి. ప్రతి ఏటా శీతాకాలంలో సైబీరియా, యూరప్, మధ్య ఆసియా దేశాల నుంచి చలిని తట్టుకోవడానికి, ఆహారం పొందడానికి వేలాది కిమీ ప్రయాణించి లక్షలాది వలస పక్షులు భారతదేశంలోకి చిత్తడి నేలలు, సరస్సులకు వలసలు వస్తాయి. అత్యంత ఎత్తులో ఎగిరే బార్-హెడెడ్ గూస్, సైబీరియన్ క్రేన్, అమూర్ ఫాల్కన్, డెమోయిసెల్ క్రేన్, గ్రేటర్ ఫ్లెమింగో, రఫ్, ఉత్తర షోవెలర్, రోజీ పెలికాన్, గాడ్వాల్, గాడ్విన్, స్పాటెడ్ రెడ్‌షాంక్, బ్లూత్రోట్, ఆసియా కొయెల్, నల్ల కిరీట రాత్రి కొంగ లాంటి 14 రకాల వలస పక్షి జాతులు భారతదేశానికి వలసలు వస్తాయి.

ప్రతి ఏటా 2వ శనివారం, అనగా 09 మే 2026న ప్రపంచ వలస పక్షుల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. 2026 ప్రపంచ వలస పక్షుల దినం ఇతివృత్తంగా "ప్రతి పక్షి ముఖ్యమే : మీ పరిశీలనలు విలువైనవి" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వలస పక్షుల జనాభా, వాటి ఆవాసాలు, సంతానోత్పత్తి, వాటి మనుగడకు ప్రమాదకరంగా మారిన కారకాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం ప్రతి పౌరుడి బాధ్యత. ఆవాసాల నష్టం, ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పుల కారణంగా వలస పక్షుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. వలస పక్షి జాతుల సహజ ఆవాసాలకు కాపాడుకుంటూ, వాతావరణ మార్పులను కట్టడి చేస్తూ వాటి సందడి, సందర్శనాలను ఆసాంతం ఆస్వాదిద్దాం. వలస పక్షుల అందాల విందును అనుభవిద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద అన్నదానం

### 250 మంది పేదలకు స్వయంగా వడ్డించిన కార్పొరేటర్ అంజన్ కుమార్

**కరీంనగర్ :** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని నేడు కరీంనగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 1:00 గంటకు జరిగిన ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, 26వ డివిజన్ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు స్వయంగా వడ్డించి సుమారు 250 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, పార్టీ కార్యదర్శి ఇమ్రాన్ ఘని, కాంగ్రెస్ నాయకులు హరీష్, రమేష్, తిరుమలేష్, సంతోష్, శ్రీనివాస్ మరియు ఏర్పాట్లు చేసిన లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అంజన్ కుమార్ గారు మాట్లాడుతూ.. "ప్రజల మనిషి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పొన్నం ప్రభాకర్ గారి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం మాకు సంతోషంగా ఉంది. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో




కొనసాగాలని, ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం" అని తెలిపారు. "పొన్నం ప్రభాకర్ గారు ఆనాడు తెలంగాణ ఉద్యమ సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి పార్లమెంటులో పోరాటం చేశారు. నేడు రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజాపాలనలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బలహీన వర్గాలకు 42% రిజర్వేషన్ల బిల్లును



అసెంబ్లీలో ప్రవేశపెట్టడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, తన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు" అని కొనియాడారు. "గతంలో కరీంనగర్ పట్టణానికి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం, కరీంనగర్ నుండి తిరుపతికి రైలు సౌకర్యం, ఎఫ్‌ఎం రేడియో వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చిన ఘనత పొన్నం గారిదే" అని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

పీఆర్వో సీడీసీసీ, కరీంనగర్

# రైల్వేల్లో ఉద్యోగాల కోతలు మోడీ ప్రభుత్వ కార్పొరేట్ కుట్ర

- యువత భవిష్యత్తును నాశనం చేస్తూ, రైల్వేలను ప్రైవేటీకరణ దిశగా నెట్టివేత,
- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సూపర్ బజార్ సెంటర్లో నిరసన,
- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె ఫహీమ్ దాదా,



**కొత్తగూడెం, మే 08: :** భారత రైల్వే బోర్డు ఏప్రిల్ 26న ప్రకటించిన మానవశక్తి హేతుబద్ధీకరణ(మ్యాన్ పవర్ రిలేషన్ " 2026--27" పేరుతో 2% పోస్టుల తగ్గింపు (సుమారు 29,608 పోస్టులు) నిర్ణయం సాధారణ పరిపాలనా చర్య కాదని, ఇది దేశ యువతపై నేరుగా చేసిన దాడి అని , ప్రజా రంగాన్ని కార్పొరేట్‌లకు అప్పగించే కుట్రలో భాగమని అఖిల భారత యువజన సమాఖ్య ఆరోపిస్తోంది. రైల్వే బోర్డ్, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఏఐవైఎఫ్ భద్రాద్రికొత్తగూడెం సమితి ఆధ్వర్యంలో సూపర్ బజార్ సెంటర్లో నిరసన ధర్నా నిర్వహించారు, ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా మాట్లాడుతూ రైల్వేలో మొత్తం 14,80,455 పోస్టులు ఉంటే, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది సుమారు 10 లక్షలు మాత్రమే వున్నారని, ఖాళీలు 3--4 లక్షల పోస్టులు ఉన్నాయని, రైల్వే బోర్డ్ తీసుకున్న ప్రస్తుత నిర్ణయంతో 2% ఉద్యోగాల కోత (29,608 పోస్టులు) తగ్గుతాయన్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా, మరోవైపు ఉద్యోగాలను తగ్గించడం అంటే ఇది స్పష్టమైన ఉద్యోగ వ్యతిరేక విధానం అని వారు విమర్శించారు. పేరుతో ఉద్యోగాల నిర్మూలన, కొత్త నియామకాలను నిలిపివేయడం, ప్రభుత్వ ఉద్యోగాలను క్రమంగా తగ్గించడం, కార్పొరేట్ ప్రైవేట్ కాంట్రాక్టర్లకు మార్గం సుగమం చేయడమేనని వారు ఆరోపించారు. ఇది సంస్కరణ కాదని, ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని వారు ఏద్దేవా చేశారు. ఇది సామర్థ్యం కాదని, ఇది ఉద్యోగాల నరమేధంతో పోలుస్తున్నామన్నారు.

రైల్వే శాఖలో ఇప్పటికే కీలక విభాగాలు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నాయని, లోకో పైలట్లు, మెయింటెనెన్స్ సిబ్బంది, సిగ్నలింగ్ సిబ్బంది, టెక్నికల్ వర్కర్స్ ఎక్కువ పని గంటలు పనిచేస్తున్నారని, తక్కువ సిబ్బంది వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగాల కోత, భద్రతపై ముప్పు, ప్రజల ప్రాణాలతో ఆట ఇది మోడీ ప్రభుత్వ నినాదమని వారు ఉద్ఘాటించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ "ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం---ఇప్పుడు 2% ఉద్యోగాల కోతలు ఎందుకు?" ఇదేనా యువతకు ఇచ్చిన హామీ? ఇదేనా అభివృద్ధి? ఇదేనా నూతన భారత్? అని వారు ప్రశ్నించారు.

రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఆర్ఆర్బీ ఆర్ ఆర్ బి అభ్యర్థుల నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరిస్ (ఎన్ టి పి సి), గ్రూప్ డి జూనియర్ ఇంజనీర్ (జే ఈ ), టెక్నీషియన్ ఫలితాలు పెండింగ్ వలన లక్షల మంది యువత నిరీక్షణలో వున్నారని,కేంద్ర ప్రభుత్వం స్పందన లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు.అందుకే ఏఐవైఎఫ్ కేంద్ర ప్రభుత్వం ను రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2% పోస్టుల తగ్గింపు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని, అన్ని పెండింగ్ ఆర్ ఆర్ బి ఫలితాలను తక్షణమే విడుదల చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని నిలిపివేసి శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని, రైల్వే శాఖను ప్రైవేటీకరణ నుండి రక్షించాలని లేనియెడల యువతను పెద్ద ఎత్తున సమీకరించి ఉద్యమిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూమ్, పట్టణ నాయకులు రణధీర్,కోచెర్ల రాకేష్, యాకుబ్, జావీద్, రసూల్,కొయ్యడ రవి,అజయ్, విజయ్ కాంత్, దాసరి శివ, చిన్ను, ఆశ్రఫ్, వినయ్ కుమార్, సంజయ్, త్రినేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# బల్వంతపూర్ అంగన్వాడీ కేంద్రంలో 'టేక్ హోమ్ రేషన్' పంపిణీ



**దుబ్బాక, మే 08:**?దుబ్బాక మండల పరిధిలోని తిమ్మాపూర్ సెక్టార్ బల్వంతపూర్-1 అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులు, బాలింతలు మరియు ప్రీ-స్కూల్ పిల్లలకు టేక్ హోమ్ రేషన్ సరుకులను ఏఎంసీ చైర్మన్ కొంగరి రవి పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన సూచనలు చేశారు.ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నెలలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున, గర్భవతులు,బాలింతలు మరియు చిన్నారులు ఎండలో తిరగకూడదని సూచించారు.?వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా మంచినీరు ఎక్కువగా తాగాలని ఆయన హితవు పలికారు. ఎండల దృష్ట్యా లబ్ధిదారులకు ఇబ్బంది కలగకూడదనే సరుకులను ఇంటికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వరూప,ాామీజ కమిటీ సభ్యులు, అంగన్వాడీ టీచర్ పుష్పలత, గర్భవతులు, బాలింతలు మరియు కిశోర బాలికలు పాల్గొన్నారు

# గడప గడపకు బీజేపీ -రావుల శేషగిరి సంకల్ప యాత్ర 12వ రోజు



**గాజుల రామారం** ఈ కార్యక్రమం 12వ రోజు 2026 మే 9వ తేదీన శనివారం సాయంత్రం 6:00 గంటలకు, గాజుల రామారం డివిజన్‌లోని హెచ్ ఏ ఎల్ కాలనీ గడ్డ ప్యారడైస్ ఫంక్షన్ హాల్ నుండి భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రారంభిస్తారు.

కావున పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుచున్నాము.

ఇట్లు,
భారతీయ జనతా పార్టీ
(స్థానిక యూనిట్)

# జనగణన దేశ అభివృద్ధికి బలమైన పునాది..

- సెన్సస్ ఆఫ్ ఇండియా 2027 అవగాహన వాక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు గారు...






**హన్మకొండ జిల్లా...08 మే 2026 :** భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన "సెన్సస్ ఆఫ్ ఇండియా -- 2027" లో భాగంగా నిర్వహించిన "సెన్సస్ అవర్ నేమ్స్ అవేర్‌నెస్ వాక్" కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ అవగాహన ర్యాలీ హన్మకొండ మున్సిపల్ కార్యాలయం ఎంజీఎం సర్కిల్ నుంచి చారిత్రాత్మక వేయి స్తంభాల గుడి వరకు ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ ఒ మున్సిపల్ కమిషనర్ శ్రీమతి చాహత్ వాజ్పేయి గారు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు, కళాకారులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు గారు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి ప్రణాళికలకు జనగణన ఒక కీలక సాధనమని అన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వనరుల పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల్లో సమగ్ర ప్రణాళికలు రూపొందించడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

జనగణనలో ప్రజలు సరైన సమాచారం అందించడం ద్వారా ప్రభుత్వానికి వాస్తవ పరిస్థితులు తెలిసి, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల అభివృద్ధికి జనగణన డేటా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. దేశ భవిష్యత్తును నిర్మించే ప్రక్రియలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, 2027 జనగణన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే నాగరాజు గారు పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్న "సెన్సస్ అవేర్‌నెస్ వాక్" వంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం తీసుకువస్తాయని కొనియాడారు...

అనంతరం ఎమ్మెల్యే నాగరాజు గారు అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రజలకు జనగణన ప్రాధాన్యతను వివరిస్తూ సందేశాలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, యువత, అధికారులు మరియు ప్రజలను అభినందించారు....ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.....

# పెరుగుతున్న నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టే స్లీప్ బ్యాంకింగ్.. కొత్త ట్రెండ్.. ఏంటిది..



నేటి తరుణంలో సరిపడా నిద్ర పొందడం చాలామందికి పెద్ద సవాలుగా మారింది. ఉద్యోగ ఒత్తిడి, పరీక్షలు, రాత్రి షిఫ్టులు, ప్రయాణాలు వంటి కారణాల వల్ల నిద్రలేమి సమస్య పెరుగుతోంది. అయితే నిద్ర తగ్గే పరిస్థితులు ముందుగానే తెలిసినప్పుడు, దానికి శరీరాన్ని సిద్ధం చేసుకునే ఒక కొత్త పద్ధతి ఇప్పుడు ప్రాచుర్యం పొందుతోంది. దీనినే స్లీప్ బ్యాంకింగ్ అని పిలుస్తున్నారు. స్లీప్ బ్యాంకింగ్ అంటే ముందుగా కొన్ని రోజుల పాటు అదనంగా నిద్రపోవడం ద్వారా, తర్వాత వచ్చే నిద్రలేమి ప్రభావాన్ని తగ్గించుకోవడం. సాధారణంగా నిద్ర తగ్గిన తర్వాత దాన్ని భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తాం. కానీ ఈ పద్ధతిలో మాత్రం ముందుగానే ఎక్కువ నిద్ర తీసుకుని శరీరానికి ఒక రకమైన రిజర్వ్ సిద్ధం చేస్తారు. దీంతో నిద్ర తక్కువగా ఉన్న రోజుల్లో కూడా మెదడు చురుకుదనం, ఏకాగ్రత కొంతవరకు నిలబడుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

2009లోనే పరిచయం..ఈ కాన్సెప్ట్‌ను 2009లో పరిశోధకులు పరిచయం చేశారు. ఒక అధ్యయనంలో కొంతమంది వ్యక్తులు కొన్ని రోజుల పాటు ప్రతిరోజూ ఎక్కువసేపు నిద్రపోయారు. తర్వాత వారందరికీ కొన్ని రోజుల పాటు చాలా తక్కువ నిద్ర మాత్రమే ఇచ్చారు. ముందుగా ఎక్కువ నిద్రపోయి నవారిలో అలసట తక్కువగా ఉండటంతో పాటు, ఏకాగ్రత కూడా మెరుగ్గా ఉన్నట్లు గుర్తించారు. అంతేకాదు, వారు మామూలు స్థితికి కూడా త్వరగా చేరుకున్నారని పరిశోధకులు వెల్లడించారు. నిద్ర అనేది కేవలం శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. మెదడు పనితీరు, జ్ఞాపకశక్తి, మానసిక స్థితి, రోగనిరోధక శక్తి వంటి అనేక అంశాలపై ఇది ప్రభావం చూపిస్తుంది. సరిపడా నిద్ర లేకపోతే ఏకాగ్రత తగ్గిపోవడం, స్పందన సమయం మందగించడం, చిరాకు పెరగడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముందుగానే అదనపు నిద్ర తీసుకోవడం శరీరానికి కొంత రక్షణగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.నిద్ర తక్కువైనా..స్లీప్ బ్యాంకింగ్ వల్ల కొన్ని ముఖ్యమైన ప్రయోజనాలు ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. నిద్ర తక్కువగా ఉన్నా చురుకుదనం కొంతవరకు కొనసాగడం, మానసిక స్థితి మెరుగ్గా ఉండడం, అలసట తగ్గడం, ఏకాగ్రత అవసరమైన పనుల్లో పనితీరు మెరుగుపడడం వంటి ప్రయోజనాలు కనిపిస్తాయి. ముఖ్యంగా వైద్యులు, నైట్ షిఫ్ట్ ఉద్యోగులు, తరచూ ప్రయాణాలు చేసే వారు, పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక స్లీప్ బ్యాంకింగ్‌ను అమలు చేయాలంటే ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. నిద్ర తగ్గే పరిస్థితికి ముందు 3 నుంచి 7 రోజుల పాటు ప్రతిరోజూ ఒకటి లేదా రెండు గంటలు అదనంగా నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రాత్రి ఆలస్యంగా మేల్కొని ఉండటానికి బదులుగా ముందుగానే నిద్రించడం మంచిదని చెబుతున్నారు. అలాగే ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, పడుకునే ముందు మొబైల్, స్క్రీన్ టైమ్ తగ్గించడం, ప్రశాంతమైన వాతావరణంలో నిద్రపోవడం కూడా ముఖ్యమని సూచిస్తున్నారు. శాశ్వత పరిష్కారం కాదు..అయితే స్లీప్ బ్యాంకింగ్‌ను శాశ్వత పరిష్కారంగా భావించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం తాత్కాలికంగా నిద్రలేమి ప్రభావాన్ని సహాయపడుతుంది.

# నాగర్ కర్నూల్ జిల్లా ప్రజల ఆదరాభిమానాలు మరవలేనివి

**- బదిలీపై వెళ్లిన కలెక్టర్ బాధావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో,మే08 :** నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్గా 2 సంవత్సరాల పాటు జిల్లా కలెక్టర్గా సేవలందించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిర్వహించిన ఐఏఎస్ ల బదిలీల్లో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్గా బదిలీపై వెళ్లిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు శుక్రవారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రదాన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ ,వివిధ శాఖల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు,ఉద్యోగులు,ప్రజాప్రతినిధులు కలెక్టర్‌కు శాలువాలు కప్పి,పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు కలెక్టర్ సేవలను కొనియాడుతూ జిల్లా కలెక్టర్ పరిపాలనా దక్షత,ప్రజల పట్ల చూపిన సేవాభావాన్ని,విద్యా ,వైద్య సేవలపై జిల్లాలో పర్యటించి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు అధికారులు ప్రశంసించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ

జిల్లా కలెక్టర్ బాదవత్ సంతోష్ కలిసి పనిచేయడం సంతోషనీయమన్నారు. ఆయన తో కలిసి పని చేసిన సందర్భంతో ఆయన తీసుకున్న నిర్ణయాలపై ఎస్పీ అభినందించారు. కలెక్టర్గా సేవలందించి ప్రజల,అధికారుల ప్రజా ప్రతినిధుల మందనలు పొందారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్,ప్రస్తుత ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేసిన కాలం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంలో అధికారులు,ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు.విద్య వైద్యంపై అధికారుల చిత్తశుద్ధితోనే నేడు పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానానికి రావడం జరిగిందని ఆయన తెలిపారు.ఇదే విధంగా జిల్లా విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలో వైద్య సేవలను గ్రామీణ స్థాయిలో విస్తరించడం ద్వారా ప్రజల ఆరోగ్యాల సంరక్షణకు కృషి చేయడం జరిగిందన్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతు సంక్షేమం,విద్య,వైద్యం,తాగునీరు వంటి అంశాల్లో జిల్లా ముందంజలో నిలవడానికి ప్రతి శాఖ కృషి చేసిందన్నారు.

జిల్లా ప్రజలు తనపై చూపిన ఆదరణ, ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు అధికారుల సహకారం లేకుండా ఏ అభివృద్ధి సాధ్యం కాదని ప్రతి ఉద్యోగి ప్రజా సేవను బాధ్యతగా భావించి పనిచేయాలని బాదావత్ సంతోష్ సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వేగంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.

తన పదవీకాలంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు,అధికారులు,మీడియా ప్రతినిధులు అందించిన సహకారం మరువలేనిదని బదిలీపై వెళ్లిన కలెక్టర్ తెలిపారు.

నాగర్ కర్నూలు జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ను నిర్వహించిన సందర్భంలో అధికారులు తీసుకున్న చొరవపై ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

జిల్లాలో నిర్వహించిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ఇక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా నిర్వహించడం అధికారుల పాత్ర మరింత సమర్థతకు నిదర్శనం అన్నారు.

కొన్ని సందర్భాల్లో అధికారులపై కోపపడ్డ సందర్భాలు ఉంటాయని, అది పనిలో భాగమే అనే ఎవరు దాన్ని గుర్తుపెట్టుకోవద్దని తెలిపారు.

నాగర్ కర్నూల్ జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్,దేవ సహాయం,ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు,ఉద్యోగ సంఘాల నాయకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ బోర్డు ను రద్దు చేయడం అపి వేసి పాత విధానం లోనే కొనసాగించాలి

**చేరాల** వంశీ, బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఉస్మానియా యూనివర్సిటీ లోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు పాఠశాల విద్యలో విలీనం చేసే పక్రియలో ప్రభుత్వం ఆర్డినేన్స్ తీసుకురావడం నిరసిస్తూ ఫ్లకార్డ్లతో తో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా చేరాల వంశీ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్య లో ఇంటర్ విద్య ను విలీనం చేయడం చాలా దుర్మార్గం మైన చర్య అని వారు తెలిపారు. తెలంగాణలో జాతీయ విద్యావిధానంను అమలు కోసం మార్పులు చేయడం విడ్డురం గా వుంది అని వారు తెలిపారు,ఇంటర్మీడియట్ విద్య యొక్క ప్రాముఖ్యత ను తగ్గించడం లో భాగమే విలీనం పక్రియ అని వారు తెలిపారు,పాఠశాల విద్యా చట్టం 1982 ను సవరించి, ఇంటర్మీడియట్ విద్యా చట్టాన్ని 1971 రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం, ప్రస్తుతం ఉన్న ాాజ బోర్డు ను, ఇంటర్మీడియట్ విద్యా మండలి ని కలిపి ఒకే ఉమ్మడి బోర్డు ను ఏర్పాటు చేయడం చాలా కుట్ర పూరితమైన ఆలోచన అని వారు తెలిపారు,తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటు వాళ్ళ జూనియర్ కళాశాలలు సైతం పాఠశాల విద్య పరిధిలోకి వస్తాయి అని వారు తెలిపారు,ఇంటర్మీడియట్ విద్యా మండలిని కలపడం వల్ల 1. లిఇంటర్మీడియట్ ప్రత్యేకత ను తగ్గి పోవడం,ఇంటర్ విద్య అనేది స్కూల్ స్థాయి కంటే ఉన్నత స్థాయి ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ ప్రవేశలకు ఇది కీలకం స్కూల్ విద్య తో కలిపితే అకాడమిక్ ప్రాముఖ్యత తగ్గే అవకాశం ఉంటుంది.2. పరీక్షలు ల నిర్వహణలో ఒత్తిడి.-ాాజ మరియు ఇంటర్ పరీక్షలు ను ఒకే బోర్డు నిర్వహిస్తే పరిపాలన భారం పెరుగుతుంది -ఫలితాల విడుదల, హాల్ టిక్కెట్లు, మూల్యాంకనం లో ఆలస్యం రావచ్చు.3.ఇంటర్ కళాశాల ల పై ప్రభావం

-జూనియర్ కాలేజీల ప్రత్యేకత గుర్తింపు తగ్గే అవకాశం

-ఇంటర్ కళాశాల నియంత్రణ, అనుమతులు వ్యవస్థ లో మార్పులు రావచ్చు.1. ఉద్యోగుల సమస్యలు.- రెండు బోర్డులు ఉద్యోగులు విలీనం వల్ల పోస్టులు తగ్గింపు లేదా బాధ్యతల మార్పు ఉండొచ్చు.

. సీనియరిటీ, పదోన్నతులపై వివాదాలు రావచ్చు.5.విద్యా విధానంలో గందరగోళం.. స్కూల్ సిలబస్, ఇంటర్ సిలబస్ వేర్వేరు విధానాల్లో ఉంటాయి.. ఒకే బోర్డు కింద తీసుకురావడం వల్ల విధానం నిర్ణయాల్లో సమస్యలు రావచ్చు.6.ప్రవేశ పరీక్షలు పై ప్రభావం . ఇంటర్ బోర్డు ప్రత్యేకంగా జూావీజజు, చీజుజు, జీజుజు వంటి పోటీ పరీక్షలు కు అనుగుణంగా వ్యవహరిస్తుంది.. విలీనం తర్వాత ఆ ఫోకస్ తగ్గే అవకాశం ఉంది అని వారు తెలిపారు.7.గ్రామీణ విద్యార్థుల పై ప్రభావం..పరిపాలన మార్పుల వలన మొదట్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు, అడ్మిషన్స్, స్కాలర్ షిప్స్ లలో ఇబ్బందులు రావచ్చు.. ఇంటర్ విద్యా యొక్క ప్రత్యేకత, పరీక్షలు నాణ్యత, కళాశాల స్వతంత్ర త తగ్గే ప్రమాదం ఉంది.ప్రభుత్వం చెబుతున్న ప్రయోజనాలు. పదో తరగతి లో ఏటా 5 లక్ష



ల మంది విద్యార్థులు పాసవుతున్నారు. వీరంతా ఇంటర్ తత్సమాన విద్య లో చేరడం లేదు. ముఖ్యంగా ం౩, ౯, బీసీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. పాఠశాల విద్యలో కి ఇంటర్ వస్తే డ్రాప్ అవుట్ లు తగ్గుతాయి అని ప్రభుత్వం భావిస్తుంది.

. పాఠశాల విద్య లోకి ఇంటర్ ను తీసుకు వస్తే సమగ్ర శిక్ష, పీఎం శ్రీ తదితర పథకాల కింద నిధులు పొందవచ్చు. మౌలిక సదుపాయాలు పెంచుకోవచ్చు.పాఠశాలలో ను పూర్తి స్థాయి ల్యాబ్ లు ఉండాలి అని కేంద్రం ప్రభుత్వం చెబుతుంది. జూనియర్ కళాశాలలో సైన్స్ ల్యాబ్ లు ఉన్నాయి. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు వేర్వేరు గా ఉండడం వల్ల వేర్వేరు ల్యాబ్ లు అవసరం ఉండదు. గ్రంధాలయం లను, ఇతర సౌకర్యాలు లను సమర్ధవంతం గా వాడుకోవచ్చు.పాఠశాల ఇంటర్ కు ఒకే టీచర్స్ ఉండడం వల్ల వారి బోధనకు విద్యార్థులు అలవాటుపడుతారు. ఏ విద్యార్థి విద్యా సామర్థ్యం ఏమిటో టీచర్స్ కు ఇట్టే అర్థం అవుతుంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు అని ప్రభుత్వం

పరిపాలన కోసం ఆర్థిక వనరులు తగ్గించుకోవడం కోసం ముఖ్యంగా కేంద్రం ప్రభుత్వం మెప్పు కోసం మార్పులు చేస్తుంది అని వారు తెలిపారు.జాతీయ విద్యా విధానం లో చాలా వరకు తప్పులు ఉన్నాయి అని ఎట్టి పరిస్థితులు లలో రాష్ట్రము లో అమలు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాము అని వారు తెలిపారు.

ఈ కార్యక్రమం లో మీాఖీ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి,ఓయూ విద్యార్థి నాయకులు సాయి కిరణ్, శివ, శశి కుమార్, సంజయ్, సైదులు,సురేందర్, నరేష్, శివ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాశీయాత్ర పరిపూర్ణం కావాలంటే విశాలాక్షి దేవి దర్శనం తప్పనిసరి- ఆ ఆలయ రహస్యాలు ఇవే!



వారణాసి హిందువులందరికీ పరమ పావన క్షేత్రం. విశ్వేశ్వరాలయంలోని శివలింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. స్వయంగా ఇక్కడ శివుడు కొలువై ఉన్నాడని హిందువుల నమ్మకం. గంగా స్నానం వల్ల సకల పాపాలు పరిహారమై ముక్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. అష్టాదశ శక్తి పీఠాలలో కాశీ కూడా ఒకటి. దక్షయాగంలో ఆత్మార్పణం చేసిన సతీదేవి చెవి కుండలాలు పడిన ప్రదేశమే మణికర్ణికా ఘాట్. ఇక్కడ వెలసిన విశాలాక్షి మందిరం శక్తిపీఠంగా విరాజిల్లుతోంది. ఈ కథనంలో కాశీ విశాలాక్షి మందిరం విశిష్టత తెలుసుకుందాం.

**కాశీలోని దివ్య మూర్తులు**

కాశీ పేరు స్ఫురించగానే ముందుగా ఇక్కడి పవిత్ర గంగానది విశ్వేశ్వరుడు, విశాలాక్షీ, అన్నపూర్ణా దేవి, డుంఠి గణపతి, కాల భైరవుడు గుర్తుకొస్తారు. ఈ క్షేత్రం ఒక జ్యోతిర్లింగ క్షేత్రంగానే కాకుండా ఒక మహా శక్తి పీఠంగా కూడా ప్రసిద్ధి చెందింది. సతీదేవి కర్ణకుండలాలు కాశీలో పడినట్లు ప్రతీతి. అందుకే ఇక్కడ అమ్మవారిని మణికర్ణికా అని కూడా పిలుచుకొంటారు. ఆ పార్వతీ మాతయే విశాలాక్షీ దేవిగా కొలువై ఉందని విశ్వాసం. ఈ తల్లిని విశ్వలక్ష్మీ దేవి అని కూడా పిలవడం పరిపాటి.

**విశాలాక్షి పేరు ఇందుకే!**

గర్భాలయంలో వెలసి ఉన్న అమ్మవారు 'విశాలమైన కన్నులు' కలిగిన దేవి కాబట్టి ఈమెకు విశాలాక్షి అనే పేరు వచ్చింది.

**విశాలాక్షి ఆలయ విశేషాలు**

విశాలాక్షి ఆలయం గంగానది తీరంలో మీర్ ఘాట్ వద్ద ఉంది. కాశీ విశ్వేశ్వరుని గుడికి కొంత దూరంలో విశాలాక్షి అమ్మవారి క్షేత్రం ఉంది.

**ఒకే చోట రెండు విగ్రహాలు**

గర్భాలయంలో ఇద్దరు అమ్మవార్లను దర్శించుకోవాలి. ఒకటేమో అమ్మవారి పురాతన విగ్రహం. ఈ విగ్రహం స్వయంభువు ఉద్భవమూర్తిగా భావిస్తారు. ప్రస్తుతం ఉన్న విగ్రహానికి వెనుక వైపు ఈ విగ్రహం ఉంది. స్వయంభువు విగ్రహానికి ముందు వైపు ఆదిశంకరులు ప్రతిష్టించిన మరో విగ్రహాన్ని కూడా దర్శించుకోవచ్చు. ఈ అమ్మవారు బంగారు తొడుగుతో దర్శనం ఇస్తారు. పసుపు కుంకుమలతో ప్రకాశిస్తూ, పుష్పమాలాంకృతురాలైన విశాలాక్షిని భక్తులు మనసారా పూజిస్తే కోరికలు తప్పక నెరవేరుతాయని విశ్వసిస్తారు. విశాలాక్షి దేవి ఆలయంలో ఆదిశంకరులు శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**ఆలయ స్థల పురాణం**

స్కంద పురాణం ప్రకారం వారణాశిలో ఒక సారి వ్యాస భగవానుని, ఆయన శిష్యులకు ఏడు రోజుల పాటు భిక్ష దొరకదు. ఆ సమయంలో ఆకలి బాధకు తాళలేక వ్యాసుడు తీవ్రమైన ఆగ్రహంతో కాశీని శపించబోతాడు. అప్పుడు విశాలాక్షిదేవి ముత్తైదువుగా మారి వ్యాసమహర్షికి, అతని శిష్య గణానికి తన ఇంట్లో ఆతిథ్యం ఇస్తుంది.

**శివుని శాపం**

అప్పుడు పరమేశ్వరుడు "కాశీనే శపించేటంత గొప్పవాడివా నువ్వు" అంటూ వ్యాస మహర్షిని కాశీ నుంచి బహిష్కరిస్తాడు. అప్పుడు తన తప్పు తెలుసుకున్న వ్యాసుడు పరమేశ్వరుని పాదాలపై పడి క్షమించి, శాపవిమోచనం కలిగించమని ప్రాధేయ పడతాడు. అప్పుడు ఆ భోళాశంకరుడు జరగబోయే "వ్యాస నిష్కాసనం చరిత్ర సృష్టిస్తుందని ఊరడించి, కొన్ని రోజుల తర్వాత మళ్ళీ తప్పక వ్యాసునికి కాశీలో అనుమతిస్తానని" ఊరడిస్తాడు. అప్పటి నుంచి వ్యాసుడు గంగానదికి ఆవలి తీరంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడ నుంచే విశ్వనాథునికి నమస్కరిస్తూ సంతృప్తి చెందేవాడు. తాను నిత్యం శివునికి జరిపే అభిషేకాల కోసం అక్కడ వ్యాసుడు ఒక శివలింగాన్ని కూడా ప్రతిష్టించి పూజించసాగాడు. ఈ ప్రాంతాన్నే వ్యాస కాశీ అంటారు. కాశీకి వెళ్ళినవారు తప్పకుండా వ్యాసకాశి కూడా దర్శించాలి. అప్పుడే కాశీయాత్ర సఫలం అవుతుందని సాక్షాత్తు ఆ విశ్వేశ్వరుడు వరమిచ్చాడు.

**ఆలయాలు వేరైనా అమ్మ ఒకటే!**


ప్రతిరోజూ శివునికి బిక్షాపాత్రలో విశాలాక్షి భిక్ష వేస్తుందంట! విశాలాక్ష్మి పెట్టిన భోజనానికి సంతృప్తి చెందిన శివుడు ఆమెకు కాశీ క్షేత్రానికి అధిదేవతగా ఉండే యోగ్యత కల్పిస్తాడు. చాలాకాలం అన్నపూర్ణా దేవి అంటే విశాలాక్షి దేవి అనే భావించారు. కాలక్రమంలో రెండు వేరు వేరు ఆలయాలు ఏర్పడ్డాయి. విశ్వనాథుని గుడి ప్రాంగణంలో నుంచి అన్నపూర్ణ ఆలయానికి వెళ్ళవచ్చు. విశ్వనాథుని ఆలయానికి దూరంలో విశాలాక్షి ఆలయం ఉంటుంది.

**కళ్యాణ యోగం కలిగించే విశాలాక్షి**

కాశీ విశాలాక్షిని కంచి కామాక్షి తోను మధుర మీనాక్షితోనూ నుగ్రహించే విశాలాక్షికి భాద్రపద శుద్ధ తదియ ంతీర్చేఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుశుద్ధ తదియ ంతీర్చేఆధునిక శాస్త్రీయ ననే విషయాన్ని పాఠకులు గమనించాలివిషయం.

# పవిత్ర వైశాఖ మాసంలో నృసింహ జయంతి- ఆ రోజున స్వామిని భక్తితో పూజిస్తే అనేక శుభాలు!






తాటంకాల దర్శనమే ఎందుకు ప్రత్యేకం? జంబుకేశ్వరం అఖిలాండేశ్వరి అమ్మవారి అద్భుత రహస్యాలు!

తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలో ఉన్న జంబుకేశ్వర ఆలయం పరమేశ్వరుని పంచ భూత క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పార్వతీదేవి 'అఖిలాండేశ్వరి'గా కొలువుదీరి, జలతత్వానికి అధిదేవతగా భక్తులను అనుగ్రహిస్తుంది. 1800 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో అమ్మవారు కఠోర తపస్సు చేసి శివుని నుంచి జ్ఞానాన్ని పొందిందని అంటారు. సాధారణంగా అన్ని శైవ క్షేత్రాలలో శివపార్వతుల కళ్యాణం జరుగుతుంది కానీ ఈ క్షేత్రంలో మాత్రం అమ్మవారికి, స్వామి వారికి కళ్యాణం జరగదు. ఇక్కడ అమ్మవారి దర్శనానికన్నా అమ్మవారి తాటంకాల దర్శనానికే ప్రాధాన్యత ఎక్కువ. ఈ సందర్భంగా అఖిలాండేశ్వరి అమ్మవారి ఆలయం ఎక్కడుంది? అమ్మవారి తాటంకాల మహిమ గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

**పంచభూతాత్మకమైన పరమేశ్వరుడు**

ఈ సృష్టిని ఆవరించి ఉన్న భూమి, అగ్ని, వాయువు, నీరు, ఆకాశం అనే ఐదింటిని పంచభూతాలని అంటారు. లయకారుడైన పరమేశ్వరుడు ఈ పంచభూతాలలో వ్యాపించి ఉన్నందుకు నిదర్శనంగా వివిధ ప్రాంతాలలో పంచభూత లింగాల పేరుతో కొలువై పూజలందుకుంటున్నాడు. చిదంబరంలో భూమి అంటే పృథ్వీ లింగంగా, అరుణాచలంలో అగ్ని లింగంగా, శ్రీకాళహస్తి లో వాయు లింగంగా, జంబుకేశ్వరంలో జల లింగంగా, చిదంబరంలో ఆకాశ లింగంగా పరమేశ్వరుడు పూజలందుకుంటున్నాడు.

జంబుకేశ్వరం క్షేత్రం ఎక్కడుంది?

తమిళనాడులోని తిరుచిరాపల్లి నగరం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో జంబుకేశ్వరంలో వెలసిన జంబుకేశ్వరస్వామి గర్భగుడిలో ఎప్పుడూ భూగర్భ జలాలు ఊరుతూ ఉంటాయి. అందుకే దీనిని జల లింగం అంటారు. ఈ క్షేత్రంలో వెలసిన అఖిలాండేశ్వరి అమ్మవారు పంచభూతలింగ క్షేత్రాలలో ఒకటైన జలలింగ క్షేత్రానికి అధిష్టాన దేవత. అమ్మవారు ఇక్కడ అఖిలాండేశ్వరిగా పూజలందుకుంటుంది.

*జల లింగ క్షేత్రం*

స్వామి వారు 'జంబుకేశ్వరుడు'గా కొలువై ఉంటారు. గర్భాలయంలోని లింగం కింద ఎప్పుడూ నీటి ఊట వస్తూనే ఉంటుంది. అమ్మవారు స్వయంగా కావడితో నీరు తెచ్చి, జంబూ వృక్షం కింద వెలసిన శివునికి అభిషేకం చేశారని పురాణ గాథ.

**తాటంక చక్రాలు**

అఖిలాండేశ్వరి అమ్మవారికి ఉన్న అతి ముఖ్యమైన ప్రత్యేకత ఆమె ధరించే తాటంకాలు. జంబకేశ్వరంలో అఖిలాండేశ్వరి దేవి దర్శనానికన్నా అమ్మవారి తాటంకాల దర్శనానికే ప్రాధాన్యత ఉండడం వెనుక ఓ పురాణగాథ ఉంది. పురాణాల ప్రకారం, ఒకప్పుడు అమ్మవారు అత్యంత ఉగ్రరూపంతో ఉండేవారట! రాత్రి సమయంలో అమ్మవారు గ్రామ సంచారానికి వెళ్లి సకల ప్రాణులను భక్షిస్తూ ఉండేదంట! ఆ సమయంలో అమ్మవారి ఉగ్రత్వాన్ని తగ్గించి, శాంతింప చేయడానికి ఆది శంకరాచార్యుల వారు అమ్మవారి రెండు చెవులకు మహిమాన్వితమైన తాటంకాలు, అంటే చెవి కమ్మలు కర్ణాభరణాలుగా అలంకరించి, ఆమె ఎదురుగా శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

**ప్రశాంత మూర్తిగా**

ఆదిశంకరులు సమర్పించిన తాటంకాల వలన అమ్మవారు ఉగ్రరూపంలో నుంచి శాంత రూపంలోకి మారిందట! ఇలా అమ్మవారు తన ఉగ్రత్వాన్ని వీడి శాంత స్వరూపంగా మారినందున ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి 'పవిత్ర స్నానం' పేరిట అమృత జలాలతో అభిషేకించి అనంతరం 'విద్యా రూపిణి' అలంకారం చేస్తారు. ఇలా చేయడం వలన అమ్మవారు ప్రసన్నమూర్తిగా మారి, భక్తులపై కరుణను కురిపిస్తుందని నమ్మకం. ఈనాటికి అఖిలాండేశ్వరి అమ్మవారి తాటంకాలను దర్శించుకోవడం విశేష ఫలప్రదంగా భావిస్తారు.

**గురు–శిష్య సంబంధం సూచించే ఉపదేశ ముద్రలో**

జంబుకేశ్వరం క్షేత్రంలో అమ్మవారు శివుని వద్ద శిష్యురాలిగా జ్ఞానోపదేశం పొందిందని చెబుతారు. అందుకే ఇక్కడ అమ్మవారు ఉపదేశ ముద్రలో కనిపిస్తారు. ఇక్కడ శివుడు గురువుగా, అమ్మవారు శిష్యురాలిగా పూజలందుకుంటారు.

**ఈ క్షేత్రంలో జరగని కళ్యాణం**

సాధారణంగా శివపార్వతుల కళ్యాణం అన్నిశివాలయాల్లో జరుగుతుంది, కానీ ఇక్కడ శివపార్వతుల మధ్య గురు–శిష్య సంబంధం ఉండటం వల్ల కళ్యాణం నిర్వహించరు.

**గజ పూజ**

అఖిలాండేశ్వరి అమ్మవారికి ఏనుగులు అంటే అత్యంత ప్రీతి. ప్రతిరోజూ ఆలయ ఏనుగు అమ్మవారి సన్నిధికి వచ్చి ప్రణమిల్లుతుంది. పూర్వం ఒక ఏనుగు మరియు సాలీడు ఇక్కడ శివుడిని పూజించి మోక్షం పొందినట్లు ఆలయ చరిత్ర చెబుతుంది.

**మధ్యాహ్న పూజ విశిష్టత**

జంబుకేశ్వరం క్షేత్రంలో ప్రతిరోజు మధ్యాహ్నం ఇక్కడ ఒక ప్రత్యేకమైన ఘట్టం జరుగుతుంది. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రతిరూపంగా భావించే స్త్రీ వేషధారణలో మేళతాళాలతో వెళ్లి స్వామివారికి అభిషేకం మరియు పూజలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో అమ్మవారే స్వయంగా స్వామిని పూజిస్తున్నట్లుగా భావించడం విశేషం. జ్ఞానాన్ని కోరుకునే విద్యార్థులు, ప్రశాంతతను ఆశించే భక్తులు అఖిలాండేశ్వరి దేవిని దర్శించుకోవడం వల్ల విశేష ఫలితాలు పొందుతారని భక్తుల విశ్వాసం.

**తాటంకాల మహత్యం**

చోళ రాజవంశీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలిచే జంబుకేశ్వరం ఆలయంలో వెలసిన అఖిలాండేశ్వరి అమ్మవారిని దర్శించినప్పుడు అమ్మవారి తాటంకాలను భక్తిశ్రద్ధలతో దర్శించి నమస్కరించుకోవాలి. అమ్మవారి తాటంకాలు దర్శించడం వలన సువాసినితనంతో పాటు సకల ఐశ్వర్యాలు కూడా కలుగుతాయని శాస్త్రవచనం. తమిళ చిత్తిరై మాసం అనగా ఏప్రిల్ మే నెలలో అమ్మవారికి ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. మనం కూడా అఖిలాండేశ్వరి అమ్మవారితో పాటు అమ్మవారి తాటంకాలు కూడా దర్శించిన అష్టైశ్వర్యాలు పొందుదాం.

*ఓం శ్రీ మాత్రే నమః*

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# బహుభాషా నైపుణ్యంతో మెదడుకు మేలు - అందుకే పిల్లలకు ఎక్కువ భాషలు నేర్పించాలట!



అప్పుడప్పుడే మాటలు నేర్చుకొంటున్న చిన్నారులు స్కూల్లో చేరే వరకు కుటుంబ సభ్యుల మధ్యే ఉంటారు. దీంతో పేరెంట్స్, ఇంట్లో వాళ్లు ఏ భాష మాట్లాడితే దాన్నే అనుకరిస్తుంటారు. స్కూల్?కు వెళ్లడం మొదలు పెట్టిన తర్వాత హిందీ, ఇంగ్లీషు వంటి భాషలు సైతం తమ సిలబస్‌లో భాగంగా నేర్చుకొంటారు. ఈ క్రమంలో కొందరు తాము నేర్చుకొన్న భాషల్లో రాయడం, చదవడం వరకు మాత్రమే పరిమితం అవుతారు. ఇంకొందరు వాటిలో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాల్ని సంపాదించగలుగుతారు. ఇలా బహుళభాషాలు మాట్లాడగలిగే చిన్నారుల్లో, మెదడు చాలా చురుగ్గా పనిచేయడంతో పాటు జ్ఞాపకశక్తీ పెరుగుతుందంటున్నారు నిపుణులు. మరి, ఎక్కువ భాషలు నేర్చుకోవడం వల్ల చిన్నారులకు కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుమల్టీటాస్కింగ్! : ఈ తరం చిన్నారులు ఎంతో చురుగ్గా ఉంటున్నారు. చిన్నవయసులోనే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకొంటున్నారు. ఓ వైపు చదువుకొంటూనే, మరో వైపు తమకు నచ్చిన వ్యాపకాల్లో రాణిస్తున్నారు. అయితే, సాధారణ చిన్నారులతో పోలిస్తే, ఎక్కువ భాషలు నేర్చుకొన్న పిల్లలు మరింత చురుగ్గా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మనం ఏ భాషలో ప్రశ్న సంధిస్తే తిరిగి అదే భాషలో సమాధానమివ్వగల సామర్థ్యం వారికి ఉంటుందట. ఒకే సమయంలో వేర్వేరు భాషల్లో మాట్లాడినప్పటికీ దానికి తగిన విధంగా వారు మారిపోగలరని పేర్కొంటున్నారు. దీన్నే ఇంగ్లిష్‌లో 'జగ్లింగ్ స్కిల్స్' (జీబస్త్రస్త్రశ్రీఱఅస్త్ర ంఎఱశ్రీశ్రీం) అని పిలుస్తారు. ఇలాంటి వారికి మల్టీ టాస్కింగ్ స్కిల్స్ ఎక్కువగా ఉంటాయట. అంతే కాదు, చిన్నారుల దృష్టిని మరల్చాలని ఇతరులు ప్రయత్నం చేసినప్పటికీ అది సఫలం కాదట. ఇలాంటి పిల్లలు భవిష్యత్తులో మల్టీ మారతారని తెలియజేస్తున్నారు. అంతేకాదు, వెంట వెంటనే విభిన్నమైన పనులు చేయడంలోనూ నేర్పరులుగా రాణిస్తారని వివరిస్తున్నారు. ఎక్కువ భాషలు నేర్చుకొన్న చిన్నారుల్లో ఒకే సమయంలో రెండు పనుల్ని చేయగలిగే సామర్థ్యం పెరుగుతుందని పలు అధ్యయనాల్లో తేలింది.మెదడు చురుగ్గా : భాషలు పనిచేయడానికి సంబంధం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎలాగంటే, ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకొన్నప్పుడు వాటికి సంబంధించిన పదజాలమంతా బ్రెయిన్?లో నిక్షిప్తమై ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుందట. అంతేకాదు, ఏ భాషనైతే మాట్లాడు తున్నామో, దానికి సంబంధించిన పదజాలాన్ని మాత్రమే ఎంచుకొనేలా మెదడు వేగంగా స్పందిస్తుందని అంటున్నారు. ఇలా మెదడుకు చురుకుదనం అలవాటవుతుందట. దీనికి సంబంధించి నిర్వహించిన వివిధ పోటీల్లో ఒకే భాషపై పట్టున్న వారి కంటే రెండు కంటే ఎక్కువ భాషలు మాట్లాడగలిగే వారు చాలా చురుగ్గా ఉన్నట్లు కొన్ని పరిశోధనల్లో గుర్తించాత్రణ : పిల్లలకు సంతోషమొచ్చినా, కోపమొచ్చినా వారిని నియంత్రించడం కష్టం. కానీ, ఒకటి కంటే ఎక్కువ భాషలు తెలిసిన చిన్నారులు మాత్రం తమ భావోద్వేగాలను తామే నియంత్రించుకునే అవకాశం ఎక్కువగా ఎలాగంటే, ఎక్కువ భాషలు తెలిసిన పిల్లలు ఒక భాషలో మాట్లాడుతున్నప్పుడు దానికి సంబంధించిన పదాలను మాత్రమే చెందిన పదాలు రాకుండా జాగ్రత్త పడతారు. ఈ క్రమంలో ఎలాగైతే ఇతర భాషా పదాలు రాకుండా తమని తాము నియంత్రించుకొంటారో, అలాగే భావోద్వేగాల విషయంలోనూ ప్రవర్తిస్తారని పలు అధ్యయనాల్లో తేలింది. అలాగే వీరిలో ఏకాగ్రత కూడా ఎక్కువగా ఉంటుందట. ఎలాంటి కష్టమైన పనైనా సరే పూర్తి దృష్టి దాని పైనే పెట్టగలరట. అంతేకాదు, తాము అనుకొన్న దాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో ఉండడం బహు భాషా ప్రావీణ్యం ఉన్న చిన్నారుల నైజం. పైగా తాము చేసే పని వినూత్నంగా ఉండాలనీ అనుకుంటారట.

# ఈ మొక్కలతో ఇల్లు చల్లగా ఉంటుందట - మీరూ ఇలా ట్రై చేసి చూడండి!



ఇప్పుడు బయట ఎండ మండిపోతోంది. ఇంట్లోనూ ఉక్కపోత తప్పట్లేదు. దీన్ని నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలను తెగ వాడేస్తున్నాం. అలా వాడటం అనేక ఆరోగ్య సమస్యలకు కారణం కావొచ్చుంటున్నారు నిపుణులు. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే కొన్ని రకాల మొక్కల్ని పెంచుకుంటే గాలి శుద్ధి, ఆహ్లాదకర వాతావరణంతో పాటు చల్లగా కూడా ఉంటుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఎలాంటి పెంచుకుంటే మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం!కలబంద : ఎండా కాలంలో ఇంట్లో కలబంద మొక్కల పెంపకం ప్రయోజనకరంగా ఉంటుంది. కేశ సంరక్షణకు, చర్మ సౌందర్యానికి ఉపయోగపడే కలబంద. గది ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించడంలోనూ ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.వెదురు పామ్ : ఈ మొక్కలు కాంతి తక్కువ ఉన్న పరిస్థితుల్లోనూ పెరుగుతాయి. కాలుష్యాన్ని తొలగించి గాలి తాజాగా, చల్లగా ఉండేలా చేస్తాయి.మీ ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారా? – మీరు ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!బేబీ రబ్బర్ : ఇంట్లో పెంచుకునే అందమైన మొక్కల్లో బేబీ రబ్బర్ ఒకటి. ఈ మొక్కలు గాలిలో టాక్సిన్లు తొలగించి, నాణ్యతను మెరుగుపరిచి వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయి. చిన్నగా ఉంటుంది. కాబట్టి, దీన్ని ఇంట్లో ఎక్కడైనా సులభంగా పెంచుకోవచ్చు. రోజూ నీరు పోయాల్సిన అవసరం లేదు. 2010లో టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం, బేబీ రబ్బరు మొక్కలు కార్బన్?డయాక్సైడ్ స్థాయిలను తగ్గించడంలో, ఇంట్లో గాలి నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.ఇంట్లో ఉండే పచ్చని మొక్కలను చూడడం వల్ల కంటికి ప్రశాంతత కలిగి మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఈ మొక్కల్ని వారంలో నాలుగు రోజులు ఇంట్లో, రెండు రోజులు ఆరు బయట పెడితే ఎక్కువ కాలం ఉంటాయి. – ఎం. శ్రీధర్, ఉద్యాన శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్

ఫైకస్ : దీన్ని చిన్నపాటి కుండీ లేదా తొట్టెలో ఇంట్లోనే పెంచుకోవచ్చు. ఈ మొక్క గాలిని శుద్ధి చేస్తుంది. ఫార్మాల్డి హైడ్, బెంజీన్, ట్రైక్లోరో ఎథిలీన్ వంటి గాలిలోని కాలుష్యాలను తొలగించడంతో పాటు వేడిని తగ్గించడంలో సాయపడుతుంది.లెమన్?గ్రాస్ : ఆక్సిజన్?తో పాటు యాంటీ ఆక్సిడెంట్లకు గొప్పగా పని చేస్తాయి. ఇవి గాలిని శుద్ధిచేసి పరిసరాలు తాజాగా ఉండేందుకు తోడ్పడతాయి.

ఫెర్న్ : ఎండాకాలంలో ఇంటిని చల్లగా ఉంచగల మొక్క ఇది. నిండా ఆకులతో కనువిందు చేసే ఫెర్న్ గాలిలో తేమను నిలిపే గుణం కలిగి ఉంటుంది. గాలిలోని కార్బన్?డయాక్సైడ్?ను గ్రహించి ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది. ఇంట్లో గాలి నాణ్యతను వె ం ర ు గ ు ప ర చ డ ం లో న ూ సహాయపడుతుంది.స్నేక్ ప్లాంట్ : ఈ మొక్కలు ఫార్మాల్డిహైడ్, బెంజీన్ వంటి టాక్సిన్లను తొలగించడంతో ఇంట్లో గాలి శుభ్రపడుతుంది. ఇది రాత్రిపూట ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది.స్పైడర్ ప్లాంట్ : గాలిలో ఉండే కార్బన్?డయాక్సైడ్, ఫార్మాల్డి హైడ్?లను తొలగించడంలో స్పైడర్ ప్లాంట్?లు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇవి గాలిలో తేమను జోడించి ఇల్లంతా చల్లగా ఉండేలా చేస్తాయట.తులసి : తులసి ఇంట్లోని కార్బన్?డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను గ్రహించి గాలిని శుద్ధి చేస్తుంది. ఇది రోజులో సుమారు 20 గంటల వరకు ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది.

# భువనేశ్వర్ కుమార్ అరుదైన రికార్డ్

ఐపీఎల్ అంటేనే రికార్డుల అడ్డా. తాజాగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన కెరీర్‌లో ఒక మెమరబుల్ మైలురాయిని చేరుకున్నాడు. గురువారం లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో భువీ బరిలోకి దిగడమే ఒక రికార్డుగా మారింది. ఐపీఎల్ హిస్టరీలో ఇప్పటివరకు ఏ ఫాస్ట్ బౌలర్ కూడా 200 మ్యాచ్‌లు ఆడలేదు. ఆ ఘనత సాధించిన ఫస్ట్ ఇండియన్ పేసర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. అంతేకాదు, ఐపీఎల్ లో 200 పైగా వికెట్లు తీసిన ఏకైక ఫాస్ట్ బౌలర్ కూడా అతనే కావడం విశేషం. ఈ అరుదైన రికార్డుపై భువనేశ్వర్ కుమార్ స్పందిస్తూ తన సంతోషాన్ని పంచుకున్నాడు. ఏ మైలురాయి అయినా స్పెషలే అని, కానీ 200 మ్యాచ్‌లు ఆడటం అనేది నిజంగా ఒక బిగ్ అచీవ్‌మెంట్ అని ఆనందం వ్యక్తం చేశాడు. అందుకే చాలా గర్వంగా, హ్యాపీగా ఉందని, ముఖ్యంగా గతేడాది కప్పు గెలిచిన జట్టులో ఉంటూ, ఈ సీజన్ లో కూడా అద్భుతంగా రాణిస్తున్న సమయంలో ఈ రికార్డ్ రావడం ఇంకాస్త స్పెషల్ ఫీలింగ్ ఇస్తోందని పేర్కొన్నాడు. తన కెరీర్‌లో ఎన్నో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. వాటన్నిటిలో ఒకదాన్ని ఎంచుకోవడం కష్టమే కానీ, ఇన్నేళ్ల ప్రయాణంలో తన తొలి వికెట్ మాత్రం ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపాడు. అక్కడి నుండే ఈ జర్నీ మొదలైందని భువీ తన మనసులోని మాటను చెప్పాడు. ప్రస్తుత కాలంలో టీ20 ఫార్మాట్ చాలా వేగంగా మారిపోతోంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో బ్యాటర్లు విరుచుకుపడుతున్నారు. దీనిపై భువనేశ్వర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాటర్ల అప్రోచ్ పూర్తిగా మారిపోయిందని, పవర్‌ప్లేలో వాళ్ళు చాలా అగ్రెసివ్‌గా ఆడుతున్నారని విశ్లేషించాడు. ఇలాంటి కండిషన్స్‌లో బౌలర్లు నిరంతరం తమ గేమ్ ను ఇంప్రూవ్ చేసుకోవడం ఒక పెద్ద




ఛాలెంజ్ అని, కానీ తాను మాత్రం ఎప్పుడూ తన బేసిక్స్‌ను బలంగా ఉంచుకోవడానికే ట్రై చేస్తానని, అదే తనను ఇన్ని ఏళ్లుగా సక్సెస్ ఫుల్‌గా ముందుకు నడిపిస్తోందని వివరించాడు. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే భువనేశ్వర్ ఈ మ్యాచ్‌లో వికెట్ తీయలేక పోయాడు. నాలుగు ఓవర్లలో 34 పరుగులు ఇచ్చాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ టీమ్ ఇంజూరీ సమస్యలతో సతమతమవుతోంది. జోష్ ఇంగ్లిస్, మొహ్సిన్ ఖాన్, ఆవేష్ ఖాన్ వంటి కీలక ప్లేయర్లు ఈ మ్యాచ్‌కు దూరం కావడంతో అర్షిన్ కులకర్ణి, మయాంక్ యాదవ్, షాబాజ్ అహ్మద్ టీమ్ లోకి వచ్చారు. భారత క్రికెట్ లో భువనేశ్వర్ కుమార్ ఒక సైలెంట్ వారియర్ లాంటివాడని, ఎన్ని కొత్త టెక్నాలజీలు వచ్చినా, ఎంతమంది కొత్త బౌలర్లు వచ్చినా భువీ తన స్వింగ్ తో బ్యాటర్లను వణికించగలడని విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. 200 మ్యాచ్‌ల ఈ మైలురాయి అతని హార్డ్ వర్క్ కు నిదర్శనమని గుర్తు చేస్తున్నారు.

# టీమిండియాలోకి వైభవ్ ఎంట్రీ?

భారత క్రికెట్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా, ఏ నోట విన్నా ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ పేరే వినిపిస్తోంది. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ పరుగుల వరద పారిస్తున్న ఈ టీనేజ్ సెన్సేషన్ గురించి టీమిండియా వెటరన్ బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైభవ్ కేవలం టీ20లకే పరిమితం కాకుండా టెస్టు క్రికెట్ కూడా ఆడాలని, అప్పుడే ఒక ఆటగాడిగా పరిపూర్ణత వస్తుందని పుజారా అభిప్రాయపడ్డారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వంటి అతిపెద్ద లీగ్‌లో వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్.. ప్రస్తుత సీజన్‌లో ఆ జట్టు తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 404 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భవిష్యత్తు టీమ్ ఇండియా స్టార్‌గా అవతరించాడు. వైభవ్ పెర్ఫార్మెన్స్ చూసి అతడిని వెంటనే టీమిండియా టీ20 జట్టులోకి తీసుకోవాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. అయితే పుజారా మాత్రం వైభవ్ టెస్టు క్రికెట్ ఆడాలని కోరుకుంటున్నారు. "వైభవ్ టీ20ల్లో అద్భుతంగా ఆడుతున్నాడు, అతడికి త్వరలోనే టీమిండియా పిలుపు వస్తుంది. కానీ టెస్టు క్రికెట్ అనేది ప్రతి యువ ఆటగాడి మనసులో ఉండాలి. ఒక ఆటగాడికి గౌరవం, పట్టుదల, టెక్నిక్ అనేవి టెస్టుల నుంచే వస్తాయి. సామర్థ్యం ఉంటే వైభవ్ కచ్చితంగా టెస్టుల్లో కూడా రాణించాలి" అని పుజారా పేర్కొన్నారు. టెస్టు క్రికెట్ గొప్పదే అయినప్పటికీ.. వైట్ బాల్ (పరిమిత ఓవర్ల) నిపుణులకు కూడా తమదైన ప్రాముఖ్యత ఉంటుందని పుజారా చెప్పారు. శ్రేయస్ అయ్యర్, వైభవ్ వంటి ఆటగాళ్లను వారి బలాబలాలకు అనుగుణంగా వాడుకోవాలని సూచించారు. వేర్వేరు ఫార్మాట్లకు వేర్వేరు ఆటగాళ్లను ఎంపిక చేసే విధానాన్ని ఆయన




సమర్థించారు. దీనివల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గడమే కాకుండా, ఆయా ఫార్మాట్లలో జట్టు మరింత బలంగా తయారవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జియోస్టార్ సిటివి హిందీ ఫీడ్ నిపుణుడిగా తన కొత్త పాత్ర గురించి కూడా పుజారా ముచ్చటించారు. టీవీలో మ్యాచ్ విశ్లేషణ చేయడం ద్వారా అభిమానులకు ఆటలోని లోటుపాట్లను వివరించవచ్చని ఆయన చెప్పారు. ఆటగాడిగా తనకున్న అనుభవం ద్వారా ఫీల్డ్‌లో జరిగే పరిస్థితులు, టెక్నిక్, బౌలింగ్ వ్యూహాలను విడమర్చి చెప్పడం వల్ల కుర్రాళ్లకు కూడా ఆటపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఒక ఆటగాడు ఒక షాట్‌ను ఎలా ఆడాడు లేదా బౌలర్ ఏ యాంగిల్ వాడుతున్నాడు వంటి విషయాలు ప్రేక్షకులకు తెలియజేయడం తనకు సంతోషంగా ఉందన్నారు.

# పూర్తిగా మారిపోనున్న ఐపీఎల్ షెడ్యూల్..




ఐపీఎల్ అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్... ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ లీగ్ ఐపీఎల్ భవిష్యత్తులో మరిన్ని మెరుపులు మెరిపించబోతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ అభిమానులను అలరిస్తుండగానే, బీసీసీఐ ( రాబోయే సీజన్ల కోసం ఒక భారీ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. ఇకపై ఐపీఎల్ అంటే కేవలం రెండు నెలల సందడి మాత్రమే కాదు.. అంతకు మించి ఉండబోతోంది. ముఖ్యంగా మ్యాచ్‌ల సంఖ్య విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా లీగ్ భవిష్యత్తుపై ఒక కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాబోయే మీడియా రైట్స్ సైకిల్ (2028 నుంచి) కోసం టోర్నమెంట్ ఫార్మాట్‌లో పెద్ద మార్పులు చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. ప్రస్తుతం ఒక సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు జరుగుతుండగా, 2028 నుంచి ఈ సంఖ్యను ఏకంగా 94కి పెంచబోతున్నారు. దీనివల్ల ఆటగాళ్లకు సవాలు పెరగడమే కాకుండా, ప్రేక్షకులకు మరిన్ని ఉత్సాహభరితమైన పోరాటాలు చూసే అవకాశం లభిస్తుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక టీమ్ లీగ్ స్టేజ్‌లో 14 మ్యాచ్‌లు ఆడుతోంది. అయితే 2028 నుంచి ఈ సంఖ్య 18కి చేరనుంది. అంటే టోర్నమెంట్ మరికొన్ని రోజులు అదనంగా జరుగుతుంది. పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్ కోసం జరిగే యుద్ధం ఇప్పుడు మరింత రసవత్తరంగా మారనుంది. మ్యాచ్‌ల సంఖ్య పెరగడం వల్ల ఆటగాళ్ల ఫిట్‌నెస్, జట్ల వ్యూహాలు కూడా మారే అవకాశం ఉంది. మ్యాచ్‌లు పెరుగుతున్నాయి కదా అని కొత్త టీమ్స్ వస్తాయని భావిస్తే పొరపాటే. ఐపీఎల్‌లో ప్రస్తుతానికి ఉన్న 10 జట్లే కొనసాగుతాయని అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు. కొత్త జట్లను ఇప్పుడే చేర్చడం సరైన నిర్ణయం కాదని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే ఉన్న 10 జట్ల మధ్యే మ్యాచ్‌ల సంఖ్యను పెంచి లీగ్‌ను మరింత పటిష్టం చేయాలని నిర్ణయించారు. దీనివల్ల నాణ్యమైన క్రికెట్ ప్రేక్షకులకు అందుతుందని బోర్డు ఆశిస్తోంది.మ్యాచ్‌ల సంఖ్యను 94కి పెంచడం వెనుక అసలు కారణం హోమ్ అండ్ అవే ఫార్మాట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయడమే. అంటే ప్రతి జట్టు మరో జట్టుతో రెండుసార్లు తలపడుతుంది. ఒక మ్యాచ్ తన సొంత మైదానంలో ఆడితే, రెండో మ్యాచ్ ప్రత్యర్థి జట్టు మైదానంలో ఆడుతుంది. దీనివల్ల అన్ని జట్లకు సమానమైన అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం గ్రూప్ సిస్టమ్ వల్ల కొన్ని జట్లతో ఒకే మ్యాచ్ ఆడే పరిస్థితి ఉంది, కానీ 2028 నుంచి ఈ లోపం తొలగిపోనుంది.

# ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ హెచ్చరిక

ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న క్రికెట్ లీగ్ ఐపీఎల్‌లో ఇప్పుడు ఒక కొత్త చర్చ మొదలైంది. గ్రౌండ్‌లో ఆట కంటే కూడా ఆటగాళ్ల క్రమశిక్షణ పైనే ఇప్పుడు అందరి దృష్టి పడింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో జరిగిన కొన్ని సంఘటనలు బీసీసీఐని ఆలోచనలో పడేశాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేయడం నుంచి డగౌట్‌లో ఫోన్లు వాడటం వరకు రకరకాల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే బోర్డు ఇప్పుడు చాలా కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించుకుంది. దీనికోసం అన్ని ఫ్రాంచైజీలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లెటర్ పంపింది. ఈ లేఖలో అన్నిటికంటే ముఖ్యమైంది హనీ ట్రాప్ వార్నింగ్. ఐపీఎల్ టోర్నీ జరుగుతున్నప్పుడు ప్లేయర్స్ టార్గెట్‌గా హనీ ట్రాప్స్ జరిగే అవకాశం ఉందని బీసీసీఐ వార్నింగ్ ఇచ్చింది. కొంతమంది ప్లేయర్స్ టీమ్ మేనేజర్లకు చెప్పకుండా హోటల్ రూమ్స్‌కు అనధికారిక వ్యక్తులను రానిస్తున్నట్లు బోర్డు దృష్టికి వచ్చింది. ఇది సెక్యూరిటీ పరంగా చాలా ప్రమాదకరమని, అందుకే ఇకపై ఎవరైనా గెస్ట్ రావాలి అంటే ఖచ్చితంగా గెస్ట్ అప్రూవల్ సిస్టమ్ ద్వారానే రావాలి అని బోర్డు రూల్ పెట్టింది. గెస్టుల వివరాలను




ప్రతిరోజు రికార్డు చేయాలి అని టీమ్ మేనేజర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి.రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో వేపింగ్ చేస్తున్న వీడియో అప్పట్లో పెద్ద దుమారం రేపింది. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా లేఖలో ప్రస్తావించారు. డ్రెస్సింగ్ రూమ్స్‌లో, డగౌట్స్‌లో లేదా టీమ్ హోటల్స్‌లో వేప్స్, ఈ సిగరెట్లు వాడటంపై పూర్తిస్థాయిలో నిషేధం విధించారు. భారత చట్టాల ప్రకారం కూడా ఇది నేరమని, ఎవరైనా నిబంధనలు మీరితే కఠిన చర్యలు తప్పవని బోర్డు హెచ్చరించింది. క్రమశిక్షణ అనేది టీమ్ గౌరవానికి సంబంధించిన విషయమని, దీనిని అశ్రద్ధ చేయకూడదని స్పష్టం చేసింది.కేవలం ఆటగాళ్లకు మాత్రమే కాదు, టీమ్ యజమానులకు కూడా బీసీసీఐ కొన్ని ఆదేశాలు ఇచ్చింది. మ్యాచ్ లైవ్‌లో జరుగుతున్నప్పుడు యజమానులు ప్లేయర్స్ దగ్గరకు వెళ్లడం, వారిని హగ్ చేసుకోవడం లేదా ఫిజికల్?గా ఇంటరాక్ట్ అవ్వడం వంటివి చేయకూడదు అని బోర్డు కోరింది. ఇలాంటి పనులు టీమ్ పరిస్థితులను దెబ్బతీస్తాయని సైకియా తన లేఖలో పేర్కొన్నారు. ప్లేయర్స్, మ్యాచ్ అఫీషియల్స్ ఉండే ఏరియా ప్రోటోకాల్స్?ను యజమానులు ఖచ్చితంగా పాటించాలి అని, ఆటగాళ్లకు డిస్టర్బెన్స్ కలిగించకూడదు అని లేఖలో వివరించారు. చాలామంది ప్లేయర్స్, సపోర్ట్ స్టాఫ్ సెక్యూరిటీ ఆఫీసర్లకు చెప్పకుండా హోటల్ నుంచి బయటకు వెళ్తున్నట్లు బీసీసీఐ గమనించింది. ఇలా ఇష్టం వచ్చిన టైమ్‌లో హోటల్ దాటి బయటకు వెళ్లడంపై బోర్డు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి టీమ్ హోటల్ వదిలి వెళ్లే ప్రతిసారి మూవ్‌మెంట్ లాగ్‌లో ఎంట్రీ ఇవ్వాలి అని చెప్పింది. సెక్యూరిటీ లియాజన్ ఆఫీసర్ లేదా టీమ్ ఇంటిగ్రిటీ ఆఫీసర్?కు ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా ఎక్కడికి వెళ్లకూడదు అని రూల్ పెట్టింది. ఇది ప్లేయర్స్ సేఫ్టీకి చాలా ముఖ్యమని బోర్డు భావిస్తోంది.


## భారత క్రికెట్ జట్టులోకి సపోర్టింగ్ స్టాఫ్

భారత క్రికెట్ జట్టు సపోర్టింగ్ స్టాఫ్ లో కీలక మార్పులు చోటు చేసుకోన్నాయి. స్పిన్ బౌలింగ్ కోసం ప్రత్యేకంగా ఓ కోచ్‌ను నియమించాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పట్టుబట్టాడు. ఈ మేరకు బీసీసీఐకి సిఫార్సు సైతం చేశారు. ఈ పదవికి టీమిండియా మాజీ స్పిన్నర్ సాయిరాజ్ బహుతులే పేరును ప్రతిపాదించారు కూడా. బీసీసీఐ ఆమోదం లభిస్తే టీమిండియాలో ప్రత్యేక స్పిన్ కోచ్‌ను నియమించడం ఇదే మొదటిసారి అవుతుంది. ప్రస్తుతం జట్టు సపోర్టింగ్ స్టాఫ్ లో మోర్నే మోర్కెల్ బౌలింగ్ కోచ్‌గా, సితాంశు కోటక్ బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. స్పిన్ బౌలింగ్‌కు ప్రత్యేకంగా కోచ్ అంటూ ఎవరూ లేరు. ఈ లోటును పూరించాలని గౌతమ్ గంభీర్ కోరుకుంటున్నారు. గత కొంతకాలంగా భారత స్పిన్నర్ల ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదు. ఇదే గంభీర్ ప్రధాన ఆందోళన. ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన స్పిన్ దళమైన భారత్.. ఇటీవల సొంతగడ్డపైనే ఇబ్బందులు పడుతోంది. 2024లో న్యూజిలాండ్ భారత్‌ను స్వదేశీ టెస్ట్ సిరీస్‌లో ఓడించి చరిత్ర సృష్టించడమే దీనికి నిదర్శనం. గత ఏడాది భారత్‌లో టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. సైమన్ హార్మర్, కేశవ్ మహారాజ్ వంటి విదేశీ స్పిన్నర్లు మన పిచ్‌లపై మెరుగైన ప్రభావం చూపారు. కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిల ఫామ్ ప్రశ్నార్థకమైంది. ఈ అంశాలన్నీ జట్టు యాజమాన్యాన్ని పునరాలోచింపజేశాయి. సాయిరాజ్ బహుతులే టీమిండియా మాజీ లెగ్ స్పిన్నర్. ఆయన రెండు టెస్టులు, ఎనిమిది వన్డే ఇంటర్నేషనల్ ఆడారు. టెస్టుల్లో 39 పరుగులు చేసి 3 వికెట్లు, వన్డేల్లో 23 పరుగులుచేసి 2 వికెట్లు సాధించారు. అంతర్జాతీయ కెరీర్ స్వల్పకాలమే అయినా, దేశవాళీ క్రికెట్‌లో ఆయన రికార్డు అద్భుతం. కోచింగ్ పైనా మంచి పట్టు ఉంది. బీసీసీఐ నేషనల్ క్రికెట్ అకాడమీలో కొనసాగుతున్నారు.

## టీమిండియా టీ20 జట్టులో నాయకత్వ మార్పు!?




భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జాతీయ టీ20 జట్టులో కీలక నాయకత్వ మార్పుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో 2026 టీ20 ప్రపంచకప్ టైటిల్ టీమ్‌ఇండియా గెలిచినా.. తాజాగా ఐపీఎల్‌లో తాను ఫామ్ కోల్పోవడం వల్ల అతడ్ని ఆ బాధ్యతల నుంచి తప్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సీనియర్ ఆటగాడు ఇటీవల బ్యాటింగ్‌లో విఫలమవుతుండటంతో సెలక్షన్ కమిటీ ఆందోళన చెందుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. జాతీయ మీడియా నివేదిక ప్రకారం.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, సూర్యకుమార్ ఇటీవల పరుగులు చేయకపోవడంతో అతడ్ని పక్కకి పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం అందుతోంది. అతడి స్థానంలో టీ20 జట్టుకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేయాలని బీసీసీఐ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 తర్వాత జరిగే ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు అతడిని కెప్టెన్‌గా చేసే అవకాశం కూడా ఉంది. మరోవైపు సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ.. వ్యక్తిగత ప్రదర్శన క్షీణించింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున పది మ్యాచ్‌లలో అతను కేవలం 195 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అదే విధంగా ఈ టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ మణికట్టు సమస్యతో బాధపడుతున్నట్లు.. అసౌకర్యంగా బ్యాటింగ్ చేస్తున్నట్లు నివేదికలు తెలిపాయి. ఈ క్రమంలో శ్రేయస్ అయ్యర్ ఫామ్‌లో ఉండడం సహా కెప్టెన్‌గానూ రాణిస్తుండడం వల్ల అతడ్ని టీ20 జట్టులోకి తీసుకొనే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.



## పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే నటరాజన్‌ను పక్కన పెట్టాం

### - ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ వెల్లడి

పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే తమ పేసర్ టీ నటరాజన్‌ను పక్కనపెట్టాల్సి వచ్చిందని ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ అన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఢిల్లీ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. రెండు మార్పులతో ఈ మ్యాచ్ ఆడుతున్నామని టాస్ సందర్భంగా అక్షర్ పటేల్ తెలిపాడు. ఢిల్లీ వికెట్ స్లోగా ఉంటుందని స్పిన్నర్లు, పేసర్లకు సమంగా సహకరిస్తుందని చెప్పాడు. దాంతోనే ముగ్గురు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నామని, ఈ క్రమంలోనే నటరాజన్‌ను పక్కనపెట్టాల్సి వచ్చిందని అక్షర్ పటేల్ వెల్లడించాడు. 'ముందుగా బ్యాటింగ్ చేయడం, బౌలింగ్ చేయడం అనేది మన చేతుల్లో లేని పని. కాబట్టి జట్టుగా ముందుగా బ్యాటింగ్ చేసినా.. బౌలింగ్ చేసినా అందుకు సిద్ధంగా ఉండాలి. తొలి బంతి నుంచే అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. మేం రెండు మార్పులతో బరిలోకి దిగుతున్నాం. నటరాజన్ స్థానంలో ముఖేష్ కుమార్ బరిలోకి దిగుతున్నాడు. విప్రజ్ నిగమ్ కూడా జట్టులోకి వచ్చాడు. నా అనుభవం ప్రకారం ఢిల్లీ వికెట్‌పై బంతి అంతగా టర్న్ అవ్వదు. కానీ పిచ్ స్లోగా ఉంటుంది. బంతి చాలా నెమ్మదిగా బ్యాట్‌పైకి వస్తుంది. ఇది స్పిన్నర్లకు అనుకూలంగా మారుతుంది. పేసర్లకు స్లోయర్, బౌన్సర్లు వేస్తే అడ్వాంటేజ్ లభిస్తుంది.

శనివారం,
మే 09, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక


# సతీలీలావతితో ఏంచెప్పాలనుకున్నారో..?
## రొటీన్ కథతో బోరింగ్ సినిమా



దాదాపు పదిహేనేళ్ళ క్రితం 'అందాల రాక్షసి' తో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఉత్తరాఖండ్ బ్యూటీ లావణ్య త్రిపాఠి ఇవాళ తెలుగువారింటి కోడలు. కథానాయకుడు వరుణ్ తేజ్ తో ఆమె వివాహం 2023లో అయ్యింది. పెళ్ళికి ముందు లావణ్య త్రిపాఠి ఉమెన్ సెంట్రిక్ మూవీ 'హ్యాపీ బర్త్ డే' చేసింది. పెళ్ళి తర్వాత మరోసారి అదే తరహాలో 'సతీ లీలావతి' సినిమాలో టైటిల్ రోల్ ప్లే చేసింది. అప్పట్లో 'హ్యాపీ బర్త్ డే' ఆమెకు చేదు అనుభవాన్ని అందించింది. మరి ఇప్పుడు 'సతీ లీలావతి' ఎలాంటి అనుభవాన్ని అందించిందో చూద్దాం. చిన్నప్పటి నుండి తల్లిదండ్రులు (పవిత్ర లోకేష్, నరేశ్) చీటికీమాటికి కీచులాడుకోవడంతో చిన్నారి లీల (లావణ్య త్రిపాఠి) మానసికంగా బాగా డిస్టర్బ్ అవుతుంది. పెరిగి పెద్దయ్యాక సైకియాట్రిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) ఆమెలో కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుతాడు. సేతులోని గుడ్ క్వాలిటీస్ నచ్చి అతన్నే ఆమె పెళ్ళాడుతుంది. సేతు కారణంగా ఆమె మూడేళ్ళలో స్టార్ డైరెక్టర్ గా ఎదుగుతుంది. అక్కడ నుంచే ఆమె కష్టాలు మొదలవుతాయి. భార్య షూటింగ్స్ బిజీలో తనను పట్టించుకోక పోవడంతో సేతు డిప్రెషన్ కు లోనవుతాడు. ఆ సమయంలో నర్స్ నికోలా సెబాస్టియన్ (మడోన్నా సబాస్టియన్) కు దగ్గరవుతాడు. భార్యకు విడాకులిచ్చి... నికోలాను పెళ్ళి చేసుకోవాలని సేతు అనుకుంటాడు. ఆ విషయాన్ని లీలకు చెప్పినప్పుడు ఆమె ఎలా రియాక్ట్ అయ్యింది? ప్రేమించి మరి పెళ్ళి చేసుకున్న భర్త దూరం అవుతాడని తెలిసి ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఈ ప్రేమజంట విడిపోయిందా? తప్పులు దిద్దుకుని జీవితాన్ని కొనసాగించిందా? దానికి దారి తీసిన పరిస్థితులు ఏమిటీ? అనేదే ఈ సినిమా కథ. చిన్న చిన్న కారణాల వల్ల భార్య భర్తలు విడిపోవడం చూస్తున్నాం. ఈ కథలోనూ అలాంటి సిల్లీ రీజనే దర్శకుడు తీసుకున్నాడు. భార్య దర్శకురాలని తెలిసి, ఆమె తనకు తగినంత సమయం ఇవ్వలేదని గుర్తించి, అదీ సైకాలజిస్ట్ అయిన ఓ వ్యక్తి అదే కారణంతో ఆమెకు విడాకులు ఇవ్వాలనుకోవడం సిల్లీగా అనిపిస్తుంది. విడాకులు తీసుకోబోతున్న ప్రేమజంట అనేది ఈ మూవీలోని బేసిక్ పాయింట్! అందుకు కారణంగా చూపించిన పాయింట్ చాలా బలహీనంగా ఉండటంతో ఆ తర్వాత వచ్చే ఏ సన్నివేశాలతోనూ ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని పరిస్థితి నెలకొంది. భార్యాభర్తలు ఎలాంటి అభిప్రాయభేదాలు ఉన్నా కలిసి కాపురం చేయాలంటూ లీల తల్లిదండ్రులనే దర్శకుడు ఉదాహరణగా చూపుతాడు. ఈ పాయింట్ ఎన్నో సినిమాలలో చూపించిందే! అందులో కొత్తదనం లేదు. భార్యను అపార్థం చేసుకుని దూరం అవ్వాలనుకున్న భర్త తిరిగి తప్పు తెలుసుకుని భార్యకు దగ్గరయ్యే కథలు కోకొల్లలుగా వచ్చాయి. కాకుంటే ఇందులో హీరోయిన్ డైరెక్టర్. ఆమె ప్రొఫెషన్ ను బేస్ చేసుకుని కొన్ని కామెడీ సీన్ ను దర్శకుడు తాతినేని సత్య తెరకెక్కించాడు. కానీ ఆ సన్నివేశాలు పేలవంగా ఉండి, ప్రేక్షకుడి సహనాన్ని పరీక్షించాయి. దాంతో సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ ఏదో కంగాళీగా సాగినట్టే అనిపిస్తుంది. నటీనటుల విషయానికి వస్తే లావణ్య త్రిపాఠి తెరమీద అందంగా ఉంది. కథానుగుణంగా యాక్షన్ సీన్స్ కూడా చేసింది. కాకపోతే సెంటిమెంట్ సీన్స్ పండించలేకపోయింది.

# పల్లెటూరు ప్రేమకథ..
# 'గోదారి గట్టుపైన'



మేం ఫేమస్ చిత్రంతో యూత్ ఆడియెన్స్‌కు చేరువైన సుమంత్ ప్రభాస్, సుదీర్ఘ విరామం తర్వాత నటించిన తాజా చిత్రం 'గోదారి గట్టుపైన'. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే గోదావరి తీర ప్రాంత నేపథ్యంలో, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే సున్నితమైన భావోద్వేగాల మధ్య దర్శకుడు సుభాష్ చంద్ర ఈ చిత్రంను తెరకెక్కించారు. కోనసీమలోని ఓ మారుమూల గ్రామంలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేసే శ్యామ్ బాబు (జగపతిబాబు)కు తన కూతురు మాయ (నిధి ప్రదీప్) అంటే ప్రాణం. ఆమె సంతోషమే తన ప్రపంచంగా బ్రతుకుతుంటాడు. అయితే, మాయ జీవితంలోకి ఆటో డ్రైవర్ రాజు (సుమంత్ ప్రభాస్) ప్రవేశించడంతో కథ మలుపు తిరుగుతుంది. వీరిద్దరి మధ్య చిగురించిన ప్రేమ, భిన్నమైన సామాజిక నేపథ్యాల కారణంగా తండ్రీకూతుళ్ల మధ్య ఎలాంటి సంఘర్షణకు దారితీసింది? చివరకు ప్రేమ గెలిచిందా లేక తండ్రి బాధ్యత గెలిచిందా? అనేదే ఈ చిత్ర ప్రధానాంశం. తెలంగాణ యాసకు అలవాటు పడిన సుమంత్, ఈ సినిమాలో గోదావరి యాసను ఎంతో సహజంగా పలికించి ఆశ్చర్యపరిచారు. ఆటో డ్రైవర్

పాత్రలో ఆయన నటన పరిణతి చెందింది. కూతురి భవిష్యత్తు కోసం ఆరాటపడే సగటు తండ్రి పాత్రలో జగపతిబాబు మరోసారి తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. సినిమాకు ఆయనే ప్రధాన బలం. తొలి సినిమా అయినప్పటికీ, భావోద్వేగపూరితమైన సన్నివేశాల్లో నిధి చక్కటి ప్రతిభ కనబరిచారు. నెల్లూరు సుదర్శన్ మార్క్ కామెడీ సినిమాకు పెద్ద ఎసెట్. బోరింగ్ సీన్స్‌లో కూడా తన పంచ్‌లతో థియేటర్‌లో నవ్వులు పూయించారు. దర్శకుడు సుభాష్ చంద్ర పాత కథనే తీసుకున్నప్పటికీ, దానికి భావోద్వేగాలను అద్ది తెరకెక్కించిన తీరు బాగుంది. సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ గోదావరి అందాలను, పల్లెటూరి వాతావరణాన్ని వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించింది. నాగవంశీ అందించిన నేపథ్య సంగీతం సన్నివేశాలను ఎలివేట్ చేయడంలో సక్సెస్ అయింది. సినిమా ప్రథమార్థం ప్రేమకథ మరియు కామెడీతో సరదాగా సాగిపోతుంది. సెకండాఫ్ పూర్తిగా ఎమోషన్స్ మీద ఆధారపడింది. కొన్ని చోట్ల కథ నెమ్మదించినట్లు అనిపించినా, క్లైమాక్స్ వైపు వెళ్లేకొద్దీ తండ్రీకూతుళ్ల బంధం ప్రేక్షకులను కదిలిస్తుంది. 'అమ్మ బాగుంటేనే ఇల్లు బాగుంటుంది', 'అతను ఫ్యాక్టరీకి కాదు.. కుటుంబానికి సెక్యూరిటీ గార్డ్' వంటి సంభాషణలు మనసును హత్తుకుంటాయి. మొత్తానికి 'గోదారి గట్టుపైన' ఎటువంటి ఆర్భాటాలు లేకుండా సాగే ఒక స్వచ్ఛమైన కుటుంబ కథా చిత్రం. వేసవి సెలవుల్లో కుటుంబంతో కలిసి చూడదగ్గ ఒక పాజిటివ్ ఫ్యామిలీ డ్రామాగా దీనిని అభివర్ణించవచ్చు.

# బాలయ్యతో జత కట్టనున్న బాలీవుడ్ బ్యూటీ



నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేనిల కాంబినేషన్‌లో రాబోతున్న చచీదీఖ111 సినిమా గురించి వస్తున్న ఈ లేటెస్ట్ అప్‌డేట్ నందమూరి అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఈ చిత్రంలో బాలయ్యతో బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫఖ్రీ జతకట్టనున్నట్లు సమాచారం. మరోవైపు, 'వీరసింహారెడ్డి' వంటి మాస్ హిట్టు తర్వాత బాలయ్య, గోపీచంద్ వీరిద్దరూ కలుస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. గతంలో గోపీచంద్ మలినేని సినిమాల్లోని ఐటెం సాంగ్స్ ఎంత పెద్ద హిట్ అయ్యాయో మనకు తెలిసిందే. ఈసారి ఆ జోరును మరింత పెంచేందుకు బాలీవుడ్ నటి నర్గీస్ ఫఖ్రీని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. 'రాక్ స్టార్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నర్గీస్, బాలయ్య ఎనర్జీకి తోడైతే స్క్రీన్ పై గ్లామర్ అండ్ మాస్ విజువల్స్ అదిరిపోతాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఒక స్టూడియోలో ఈ పాట కోసం చిత్ర బృందం ఒక భారీ సెట్‌ను నిర్మించింది. సమాచారం ప్రకారం, ఈ పాట షూటింగ్ ఈ రోజు (మే 8) నుంచే ప్రారంభం కానుంది. తమన్ అదిరిపోయే మాస్ ట్యూన్ ఇచ్చారని, బాలయ్య తనదైన సిగ్నేచర్ స్టెప్పులతో రచ్చ చేయబోతున్నారని టాక్. గోపీచంద్ మలినేని కూడా బాలయ్యను పక్కా మాస్ యాక్షన్ అవతారంలో చూపించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.





# రామ్ చరణ్ 'పెద్ది' సెట్స్ పై చిరంజీవి సందడి...!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, యువ దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా సెట్స్‌పై తాజాగా మెగాస్టార్ చిరంజీవి సందడి చేశారు. ఈ విషయాన్ని దర్శకుడు బుచ్చిబాబు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. చిరంజీవి సెట్‌ను సందర్శించినప్పటి వీడియోను ఆయన షేర్ చేశారు.
ఈ సందర్భంగా బుచ్చిబాబు ఓ ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. చిరంజీవిని ఉద్దేశిస్తూ, "పెద్ది సెట్స్‌లో బాస్ మరియు నా గురువు. ఇది నా జీవితంలో అత్యుత్తమ జ్ఞాపకాలలో ఒకటి. అవును.. 'పెద్ది' స్ఫూర్తితో నేను కూడా కొంచెం కండలు పెంచాను" అని పేర్కొన్నారు. తన అభిమాన హీరో, గురువు సెట్‌కు రావడంతో బుచ్చిబాబు ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, చిరంజీవితో పాటు దర్శకుడు సుకుమార్ కూడా 'పెద్ది' సెట్స్ ను సందర్శించారు.
రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఈ భారీ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# నేను చనిపోలేదు..
## ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నా: శక్తి కపూర్



ప్రముఖ బాలీవుడ్ నటుడు శక్తి కపూర్ (73) తన మరణంపై సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వదంతులను తీవ్రంగా ఖండించారు. తాను ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నానని స్పష్టం చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను విడుదల చేశారు. ఈ తప్పుడు ప్రచారంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. "అందరికీ నమస్కారం. నా మరణం గురించి వస్తున్న వార్తలన్నీ అబద్ధం. నేను ఆరోగ్యంగా, ఆనందంగా ఉన్నాను. దయచేసి ఆ వార్తలను పట్టించుకోవద్దు" అని శక్తి కపూర్ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఈ విషయంపై తాను సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నానని, ఇలాంటివి చేయడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఈ వీడియో చూసిన ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెట్టారు. కాగా, నాలుగు దశాబ్దాల సినీ కెరీర్‌లో శక్తి కపూర్ ప్రతినాయకుడిగా, హాస్యనటుడిగా సుమారు 700 చిత్రాలలో నటించి తనదైన ముద్ర వేశారు. 'రాజా బాబు', 'అందాజ్ అప్నా అప్నా', 'హంగామా', 'మాలామాల్ వీక్లీ' వంటి

# ఎన్నారై మోసం కేసు..
## నటి అషురెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ



పెళ్లి పేరుతో ఎన్నారై వ్యాపారవేత్తను మోసం చేశారన్న ఆరోపణలపై నమోదైన క్రిమినల్ కేసులో సినీ నటి అషురెడ్డికి (వెంకట అశ్వినిరెడ్డి) తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపైనా, తన తల్లి యశోదరెడ్డిపైనా నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని, దర్యాప్తును నిలిపివేయాలని ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు న్యాయస్థానం నిరాకరించింది. కఠిన చర్యలు తీసుకోకుండా మినహాయింపు ఇవ్వాలన్న అభ్యర్థనను కూడా తోసిపుచ్చింది. ఈ కేసుపై గురువారం జస్టిస్ జె.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పోలీసులు తప్పుడు ఆరోపణలతో కేసు నమోదు చేశారని, దర్యాప్తును నిలిపివేయాలని అషురెడ్డి తరఫు న్యాయవాది కోరారు. అయితే, ప్రభుత్వ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ కేసు నమోదుకు తగిన ఆధారాలున్నాయని తెలిపారు. సుమారు రూ.10.5 కోట్ల నగదు బదిలీ ఆన్‌లైన్‌లోనే జరిగిందని, దర్యాప్తు కొనసాగించాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఇప్పటికే పిటిషనర్‌కు 41ఏ నోటీసులు జారీ చేశామని కూడా పేర్కొన్నారు.
లండన్‌లో ఉంటున్న తన కుమారుడు వై.వి.ధర్మేంద్రను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషురెడ్డి, ఆమె తల్లి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసి మోసం చేశారంటూ హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త వై. సత్యనారాయణమూర్తి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేశారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com